ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Medak, Nalgonda, Tadepalligudem, Srikakulam
19-9-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 229 పేజీలు: 8 వెల: 6.50

ఓట్ల తొలగింపు ఆన్‌లైన్‌లో అసాధ్యం: ఇసి 5లో

అమెరికాలో ట్రంప్ పసిడి విగ్రహం!



## 'పోలవరం' గడువు 3 నెలలు పొడిగింపు

### వచ్చే మార్చికి పనులు పూర్తిచేయాలని లక్ష్యం

### రూ. 55,548.90 కోట్లకు పెరిగిన అంచనా వ్యయం

**విజయవాడ, సెప్టెంబరు 18, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న 3 సాగునీటి ప్రాజెక్టులు 83 శాతానికి పైగా పూర్తయినట్లు కేంద్ర గణాంకశాఖ విడుదల చేసిన సమాచార పత్రంలో వివరించింది. రాష్ట్రంలో వివిధ శాఖలకు చెందిన 51 ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతుండగా రూ.1.30 లక్షల కోట్ల విలువైన ఈ ప్రాజెక్టుల తాజా అంచనాలు రూ.1.84 లక్షల కోట్లకు పెరిగాయి. వాటికి ఇప్పటివరకూ రూ.1.01 లక్షల కోట్లు ఖర్చు చేశారు. ఇందులో పోలవరం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.10,151.04 కోట్లనుంచి ఏకంగా రూ.55,548.90 కోట్లకు పెరిగింది.

కేంద్ర నిధులతో రాష్ట్రంలో చేపడుతున్న మొత్తం ప్రాజెక్టుల అంచనా వ్యయంలో పోలవరానిదే 30.13 శాతంగా ఉంది. దీనికి ఇప్పటివరకూ రూ.24,347.76 కోట్లు ఖర్చుచేశారు. రాష్ట్రంలో మొత్తం కేంద్ర ప్రాజెక్టుల కోసం చేసిన ఖర్చులో ఈ ప్రాజెక్టుకే 23.90 శాతం వెచ్చించారు. 2022 ఏప్రిల్‌కి పూర్తి కావాల్సిన పోలవరం ప్రాజెక్టు తాజా గడువును 2026 మార్చి వరకు పొడిగించారు. ఇప్పటివరకు 95 శాతం పూర్తయిన సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజీని 2026 జూన్ నాటికి, 98 శాతం పూర్తయిన గుండ్లకమ్మ ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్రం వెల్లడించింది. దేశవ్యాప్తంగా కేంద్ర నిధులతో చేపట్టిన రూ.150 కోట్లకు మించిన ప్రాజెక్టుల పురోగతిని కేంద్ర గణాంకశాఖ తాజాగా వెల్లడించింది. దీనిప్రకారం కేంద్రనిధులతో చేపడుతున్న >>2

# ముందే వచ్చిన దసరా, దీపావళి

## జిఎస్టీ సంస్కరణలు ప్రజలకు పండుగ బోనస్

### కేంద్ర నిర్ణయాలను అభినందిస్తూ అసెంబ్లీలో తీర్మానం

### 'వన్ నేషన్, వన్ టాక్స్' వల్ల ఎంతో ప్రయోజనం

### గేమ్ ఛేంజర్‌గా మారిన జిఎస్టీ అమలు: సిఎం చంద్రబాబు



గురువారం అసెంబ్లీలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ఆర్థికంగా భారం పెరిగినా భరిస్తుందని సిఎం చంద్రబాబు స్పష్టం చేసారు.దేశంతో పాటు,రాష్ట్రంలో ప్రజల జీవన విధానంలో సంచలనాత్మక మార్పులు రానున్నాయన్నారు.ఆ క్రమంలో జిఎస్టీలో కేంద్రం తీసుకుని వచ్చిన సంస్కరణలకు ఎపి ప్రభుత్వం పరిపూర్ణ మద్దతునిస్తున్నట్లు వెల్లడించారు. జిఎస్టీ ప్రయోజనాలపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టే ఆలోచనలో కూటమి ప్రభుత్వం జిఎస్టీ 2.0 సంస్కరణలపై శాసన సభలో ప్రవేశపెట్టిన తీర్మానంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిస్తూ దేశంలోనే తొలిసారి జిఎస్టీ 2.0 సంస్కరణలపై తీర్మానంపై చర్చించిన ఎపి శాసనసభగతంలో సిఎస్టీ, వ్యాట్ లాంటి సంక్లిష్టమైన పన్నుల వ్యవస్థ ఉండేది. 17 రకాల పన్నులు, 13 రకాల సెస్సులు సర్చార్జిలు ఉండేవి. ఒక ఉత్పత్తికి అనుబంధ ఉత్పత్తులు వచ్చినా పన్నులు వేసే పరిస్థితి ఉండేది. 140 కోట్ల మంది ప్రజలకు ప్రయోజనం కలిగేలా జిఎస్టీలో రెండుస్లాబులతో సంస్కరణలు తీసుకు వచ్చింది. రెండు శ్లాబులతో పన్నుల వ్యవస్థను మరింత సరళతరం చేశారు.

ప్రభుత్వానికి ఆదాయం వస్తే అభివృద్ధి సంక్షేమం జరుగుతుంది. నెక్స్ జెన్ జిఎస్టీ అమలు దేశంలో ఓ గేమ్ చేంజర్ సంపద సృష్టించని వారికి సంక్షేమం చేసే అధికారం లేదు. కేంద్రం తీసుకువచ్చిన ఈ సంస్కరణలతో ముందుగానే దీపావళి, దసరా పండుగల బోనస్ ఇచ్చారు. 99 శాతం మేర వస్తువులన్నీ 5 శాతం పన్ను పరిధిలోకే వచ్చాయి. పేద మధ్యతరగతి ఇలా అందరికీ లబ్ది కలుగుతుంది.ఈ రిఫార్మ్స్ వల్ల పన్ను చెల్లింపు దారుల సంఖ్య 1.51 కోట్లకు పెరిగింది. అలాగే జిఎస్టీ వసూల్లు 22 లక్షల కోట్లకు పెరిగాయి. వన్ నేషన్ వన్ ట్యాక్స్ అనే విధానం సక్రమంగా అమలు కావటం వల్ల ప్రయోజనం చేకూరుతోంది. ఈ నెక్స్ జెన్ రిఫార్మ్స్ వల్ల ప్రపంచవ్యాప్తంగా డబుల్ డిజిట్ గ్రోత్ సాధించే దేశంగా భారత్ ఉంటుంది. జిఎస్టీ సంస్కరణలతో వచ్చిన ప్రయోజనాలను ప్రజలందరికీ చేరువ చేసే బాధ్యత అందరం తీసుకోవాలినిత్యావసర వస్తువులు సబ్బులు, టూత్ పేస్టు, షాంపూలు, నెయ్యి లాంటి వస్తువులన్నీ 5 శాతానికి వచ్చాయి. ఎసిలు, ఫ్రిడ్జ్‌ల ధరలు కూడా గణనీయంగా తగ్గుతాయి. జీవిత భీమా, ఆరోగ్యభీమాలకుకూడా జిఎస్టీ సున్నా శాతానికి వెళ్లింది. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రూ.750 కోట్ల వరకూ ఏపీకి ఆదా అవుతుంది. అగ్రిటెక్ యంత్రాలకు కూడా గణనీయంగా పన్ను తగ్గింది. రైతులకు ప్రయోజనం కలుగుతుంది.

ఇళ్ల నిర్మాణానికి వినియోగించే వస్తువుల ధరలు కూడా 5శాతం శ్లాబ్‌లోకి వచ్చాయి. నిర్మాణరంగం పుంజుకుంటుంది. సాధారణ ప్రజలుకూడా వినియోగించు కునేలా ఎలక్ట్రానిక్స్ వస్తువులపై జిఎస్టీ తగ్గింది. రాష్ట్రంలో ప్రతీఒక్కరికీ ఈ జిఎస్టీ ప్రయోజనాలు దక్కాలి. చిట్ట చివరి వ్యక్తికి కూడా ఈ అంశాలు తెలియాలి. ఈసారి అన్ని పండుగలు ఘనంగా జరుపుకునే అవకాశం >>2



స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన జరిగిన బిఎసి సమావేశం దృశ్యం

## 30 దాకా అసెంబ్లీ సమావేశాలు

**సచివాలయం,సెప్టెంబరు 18,ప్రభాతవార్త :** ఈనెల 30వ తేది వరకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నట్లు బిఎసి సమావేశంలో తీర్మానించారు. గురువారం స్పీకర్ అయ్యన్న పాత్రుడు అధ్యక్షతన జరిగిన బిఎసి సమావేశంలో మొత్తం 10 పనిదినాలుగా సమావేశం జరపాలని నిర్ణయించారు.ఈనెల 20,21,28 తేదీల్లో సెలవు దినాలుగా ప్రకటించారు.సమావేశంలో 19 అంశాలపై చర్చించాని టిడిపి నిర్ణయించగా బిజెపి 9 అంశాలపై చర్చించాలని సూచించగా జనసేన మూడు అంశాలపై చర్చించాలని బిఎసిలో నిర్ణయించారు.ఈ సమావేశంలో సిఎం చంద్రబాబు నాయుడు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, టిడిపి నుండి చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు, జనసేన నుండి నాదెండ్ల మనోహర్, బిజెపి నుండి విష్ణు కుమార్ రాజు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

## కేబినెట్ భేటీ నేటికి వాయిదా

**విజయవాడ,సెప్టెంబరు18,ప్రభాతవార్తప్రతినిధి:** అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబునాయుడు కేబినెట్ భేటీ గురువారం మధ్యాహ్నం నిర్వహించాల్సి ఉంది. కానీ అనూహ్యంగా సమావేశం వాయిదా పడింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే....నేడు మధ్యాహ్నం నిర్వహించాల్సిన కేబినెట్ భేటీ అర్థాంతరంగా వాయిదా పడింది. రేపు మధ్యాహ్నం వెలగపూడిలోని సచివాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు సిఎం చంద్రబాబు ఛాంబర్‌లో మంత్రివర్గ సమావేశం నిర్వహించినట్లుగా అధికారులు వెల్లడించారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోకి ప్రభుత్వం పలు బిల్లులను ఆర్డినెన్స్‌ల రూపంలో ప్రవేశపెట్టి ఆమోదింప చేయాలని యోచిస్తోంది. తొలుత కేబినెట్ భేటీ నిర్వహించి అమరావతి ప్రత్యేక ప్రయోజన వాహనం ఆమోదముద్ర వేయనున్నారు.

అదే విధంగా వైఎస్ఆర్ తాడిగడప మున్సిపాలిటీని తాడిగడప పురపాలక సంఘంగా పేరు మార్చే ప్రతిపాదనకు ఓకే చెప్పనున్నారు. ఇక పంచాయితీ రాజ్, మున్సిపల్ చట్ట సవరణకు సంబంధించి ఆర్డినెన్స్, నాలా చట్ట సవరణ, షెడ్యూల్ సబ్ కాస్ట్, ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆర్డినెన్స్‌లకు కేబినెట్ ఆమోదం తెలిపి చట్ట సభల్లో ప్రవేశపెట్టనున్నారు.



## పోలీసు కస్టడీకి ఎంపి మిథున్ రెడ్డి!

**విజయవాడ, సెప్టెంబరు 18,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టిస్తోన్న ఎపి లిక్కర్ స్కాంకేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ మిథున్ రెడ్డిని పోలీస్ కస్టడీకి ఇస్తూ విజయవాడలోని ఎసిబి ప్రత్యేక న్యాయస్థానం గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సిట్ ఎసిబి కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అయితే, సిట్ పిటిషన్‌పై నేడు ఎసిబి హైకోర్టు విచారణ చేపట్టింది. మిథున్‌రెడ్డిని రెండు రోజుల పాటు కస్టడీకి ఇస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో రెండు రోజుల పాటు అంటే ఈ నెల 19, 20 తేదీల్లో రెండు రోజులు కస్టడీలోకి తీసుకోనున్నారు.ఇక, ఏసీబీ కోర్టు ఆదేశాల మేరకు రేపు అనగా సెప్టెంబర్ 19న ఉదయం 8 గంటలకు మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు కస్టడీలోకితీసుకోనున్నారు. రెండు రోజుల పాటు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విచారించనున్నారు.

## ఇబ్బందులున్నా సంస్కరణలే మిన్న

### జిఎస్టీ సంస్కరణలకు మద్దతు తెలిపిన తొలి రాష్ట్రం ఎపి

### ప్రజల చేతిలో పెరగనున్న సంపద: అసెంబ్లీలో డిసిఎం పవన్



గురువారం అసెంబ్లీలో మాట్లాడుతున్న డిసిఎం పవన్

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఆదాయాలకు ఇబ్బందిగా ఉన్నా ఈ చారిత్రాత్మక సంస్కరణలకు మద్దతు తెలిపిన తొలి రాష్ట్రం ఎపినే అని రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేసారు. జిఎస్టీ 2.0 సంస్కరణలపై ఎపి శాసనసభలో తీర్మానం చేశారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జిఎస్టీ సంస్కరణలపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రకటనను స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. జిఎస్టీ మండలి 56వ సమావేశంలో జిఎస్టీ సంస్కరణలను కేంద్రమంత్రి నిర్మాలా సీతారామన్ ఆమోదించారని గుర్తుచేశారు. రాష్ట్ర ఆదాయాలకు ఇబ్బందిగా ఉన్నా ఈ చారిత్రాత్మక సంస్కరణలకు మద్దతు తెలిపిన తొలిరాష్ట్రం ఎపినే అని ఉద్ఘాటించారు. జిఎస్టీ పన్నుల నూతన విధానం ద్వారా ప్రజలకు మేలు చేసే వీలు కలుగుతుందన్నారు. ఇది ప్రజలు, ఆర్థిక వ్యవస్థకు చాలా లాభదాయకని నొక్కిచెప్పారు. వ్యవసాయ పనిముట్లు, యంత్రాల రేట్లు తగ్గి ఉత్పత్తి పెరుగుతుందని పేర్కొన్నారు.

పాలు, పెరుగుపై పన్ను 5శాతం నుంచి సున్నా శాతానికి అలాగే నిత్యావసరాల ధరలు చాలా వరకూ 18 నుంచి 5 శాతానికి తగ్గుతున్నాయని గుర్తుచేశారు. సిమెంట్‌పై పన్నును 28 నుంచి 18కి తగ్గించారని తెలిపారు. అత్యవసర మందులపై జిఎస్టీ పన్ను లేకుండాచేయడం ఎంతోమేలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ సంస్కరణల ద్వారా ప్రజల చేతిలో సంపద పెరిగి వస్తువుల వాడకం పెరుగుతుందని చెప్పుకొచ్చారు పవన్ కల్యాణ్.

జిఎస్టీ విషయంలో వాణిజ్య, వ్యాపార సంఘాలు అంగీకారం తెలిపినందుకు ఎపి ప్రభుత్వం తరఫున ధన్యవాదాలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లా నుంచి గ్రామస్థాయి వరకూ ఏపి బెనిఫిట్స్ జిఎస్టీ సంస్కరణల ద్వారా అమలు అవుతాయో తెలియజేయాల్సిన అవసరం కూడా ఉందని నొక్కి చెప్పారు పవన్. పరస్పర అవగాహనతోపాటు మీడియా వేదిక ద్వారా ప్రజలకు లాభాల గురించి తెలియజేయాలని కోరారు. జీఎస్టీ సంస్కరణలపై ఎపి ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వ్యవసాయ ఉత్పాదకతపెరిగి గ్రామీణ ప్రజల ఆదాయం పెరుగుతుంది.

రైతుల కోసం ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలు పరికరాలు, ఇన్ పుట్స్ పై పన్నులు తగ్గించడం సాగు వ్యవసాయ వ్యయాన్ని తగ్గించి ఉత్పాదకత పెంచుతాయి. తద్వారా గ్రామీణ ప్రాంత ప్రజల ఆదాయం పెంచుతాయి. ఆధునిక సాంకేతిక పరికరాల వినియోగం ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయ వృద్ధి బలపడతుంది. తక్కువ ఆదాయ కుటుంబాల కోసం పాలు,పెరుగు, పన్నీర్ లాంటి నిత్యవసరాలపై పన్ను తగ్గించడం >>2



## పంచాయితీల్లోనూ ఆన్‌లైన్ అనుమతులు

### భవన నిర్మాణాలకు మరింత సౌలభ్యం

### డిపిఎంఎస్ విధానం త్వరలో అనుసంధానం

### జనవరి ఫస్ట్ నుంచి అమలుకు అవకాశం

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామ పంచాయితీల్లోనూ భవన నిర్మాణాలకు ఆన్‌లైన్‌లో అనుమతులిచ్చేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. పట్టణ స్థానిక సంస్థల్లో అమలులో ఉన్న డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టం (డిపిఎంఎస్)ను పంచాయితీలకూ అనుసంధానించనున్నారు. పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలోని అన్ని పంచాయితిల్లోనూ ఇదేవిధానంలో కొత్త నిర్మాణాలకు అనుమతులు ఇవ్వనున్నారు. పురపాలక,పంచాయితీరాజ్ శాఖల మధ్య దీనిపై ఇప్పటికే చర్చలు జరిగాయి. వచ్చే ఏడాది జనవరి నుంచి పంచాయితీల్లోనూ ఆన్‌లైన్ అనుమతుల విధానం అమల్లోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. పంచాయితీల్లో కొత్త ఇళ్లు,భవన నిర్మాణాలకు అనుమతులకు ఇప్పటి వరకు పారదర్శకమైన వ్యవస్థ లేదు. చాలా చోట్ల నేతల ప్రమేయంతో అనుమతులు లేకుండానే నిర్మాణాలు వెలుస్తున్నాయి. పంచాయితీ కార్యదర్శులు,జిల్లా పట్టణ ప్రణాళిక అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నా నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారు.ఈ క్రమంలో పరిస్దితిని చక్కదిద్దడానికి అనుమతుల్లో పారదర్శకత, జవాబుదారీతనం కోసం పట్టణ,స్థానిక సంస్థల్లో అమలులో ఉన్న డిపిఎంఎస్ విధానాన్ని పంచాయితీలకు అనుసంధానించాలని ఆరు నెలల క్రితమే ప్రభుత్వం నిర్ణయించింది. >>2

## 3 దశల్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు!

### నవంబర్ తొలి వారంలో మొదటి దశ!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. నవంబర్ తొలి వారంలో తొలి దశ ఉండనున్నది. ఎన్నికల సంఘం డ్రాఫ్ట్ ప్రపోజల్ ద్వారా ఓ మీడియా సంస్థ ఈ అంచనా వేసింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను అక్టోబర్ మొదటి వారంలో ఇసి ప్రకటించనున్నది.

ఛాత్ పూజా సంబరాలు ముగిసిన తర్వాత ఎన్నికల ప్రక్రియ చేపట్టాలన్న ఆలోచనలో ఇసి ఉన్నట్లు తెలుస్తోంది. మూడు దశల్లోనే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఇసి ప్రణాళిక వేసినట్లు భావిస్తున్నారు. బీహార్ అసెంబ్లీ కాల పరిమితి నవంబర్ 22వ తేదీన ముగుస్తుంది. అయితే ఎన్నికలను ఆతేదీలోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. 2020లో కూడా బీహార్ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించారు.

## రాష్ట్రానికి 13 వేల మె.ట యూరియా కేటాయింపు

### ఎరువుల కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకొంటున్నాం: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి 13,050 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయిస్తూ గురువారం కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నెల 20వ తేదీకి గంగవరం పోర్ట్‌కు యూరియా రాష్ట్రానికి చేరుతుందనిఅన్నారు. ఈ కేటాయింపుతో రైతులకు మరింత వెసులుబాటు లభిస్తుందని, రైతులకు ఎరువుల కొరత లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని, రాష్ట్రంలో ఇప్పటికే సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రతి రైతు అవసరాలను, సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం సమగ్ర దృష్టితో ముందుకొస్తుందని, రైతుల ఆదాయాన్ని పెంచడం, పంటలకు సరైన మార్కెటింగ్‌ను అందించడం కూటమిలక్ష్యమని తెలిపారు.

## 5 రాష్ట్రాల్లో ఇడి తనిఖీలు

### ఎపి లిక్కర్ కేసులో తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులోనూ కీలక పత్రాలు స్వాధీనం

### హవాలా, షెల్ కంపెనీల ద్వారా రూ. 3,500 కోట్లు మళ్లినట్లు ఆరోపణలు

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీ హయాంలో ఎపిలో జరిగిన మద్యం కుంభకోణం అభియోగం కేసు విచారణలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి) రంగంలోకిదిగింది. సిట్ సేకరించిన వివరాల ఆధారంగా తెలుగు రాష్ట్రాలతోపాటు, తమిళనాడు, కర్ణాటక, దిల్లీలోనూ సోదాల కొరడా ఝుళిపించింది. ఏకకాలంలో 5 రాష్ట్రాల్లోని 20 ప్రాంతాల్లో ఇడి అధికారులు తనిఖీలు చేస్తూ కీలకపత్రాలను స్వాధీనం చేసుకుంటున్నారు.

ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో చోటుచేసుకున్న మద్యం కుంభకోణాల్లో హవాలా కోణాలు వెలికితీసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ ఎట్టకేలకు రాష్ట్రంలో వైఎస్సార్సీ హయాం లిక్కర్ స్కామ్‌పైనా దృష్టిసారించింది. పిఎంఎల్ఎ చట్టం కింద కేసు నమోదు చేసి దేశవ్యాప్తంగా ఏకకాలంలో 5 రాష్ట్రాల్లో ఆకస్మిక సోదాలు చేస్తోంది. హవాలా మార్గాల్లో విదేశాలకు తరలిపోయిన నగదుతో పాటు ముడుపులతో కూడబెట్టిన ఆస్తులపై ఆరా తీస్తోంది. హైదరాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లిలోని వెల్లింగ్టన్ ఎంక్లేవ్‌లో వ్యాపారవేత్త బూరుగు రమేష్, ఆయన కుమారుడు విక్రాంత్ నివాసంలో దాదాపు 7 గంటలపాటు తనిఖీలు చేసిన అధికారులు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. కాస్పో లీగల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్,మహదేవ జువెలర్స్, రాజశ్రీ ఫుడ్స్ కంపెనీల్లో విక్రాంత్ డైరెక్టర్‌గా ఉన్నారు. ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి ఆస్తులపై ఇడి దృష్టి సారించినట్లు తెలుస్తోంది. మొత్తం 23 సూట్ కేసు కంపెనీల్లో లావాదేవీలపై ఇడి దృష్టి పెట్టినట్లు సమాచారం. సిట్ వేసిన ఛార్జిషీట్‌లోని నిందితుల ఆస్తులు, కంపెనీలపై దృష్టి సారించిన ఇడి హైదరాబాద్‌లో సిట్ స్వాధీనం చేసుకున్న 11 కోట్ల రూపాయలపై ఆరాతీసినట్లు తెలుస్తోంది. పలు కంపెనీలకు ఇడి అధికారులు నోటీసులు ఇచ్చి వెళ్లారు.

వైఎస్సార్సీ హయాంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలు తెరిచి ప్రముఖ బ్రాండ్లన్నీ పక్కనపెట్టి జే బ్రాండ్లకు గేట్లెత్తారు. కొన్ని >>2

## వివిధ ఆలయాల బోర్డులకు ఛైర్మన్ల నియామకం 2లో



గురువారం డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌తో భేటీ అయిన ఎమ్మెల్సీ నాగబాబు

# డి సిఎం పవన్‌తో నాగబాబు భేటీ

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాతవార్త ప్రతినిధి:** జనసేన నేత, నూతన ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు ఉప ముఖ్యమంత్రి, తన సోదరుడు పవన్ కల్యాణ్‌ను కలిశారు. శాసనమండలి సభ్యుడిగా తొలిసారి సమావేశాలకు హాజరయ్యే ముందు ఆయన పవన్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసనమండలి సమావేశాలు నేటి నుంచి ప్రారంభమైన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సందర్భంగా, మండలిలో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రజా సమస్యల ప్రస్తావన వంటి పలు అంశాలపై నాగబాబుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. రాష్ట్రంలో ఇటీవల ఖాళీ అయిన ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో కూటమి ఒప్పందంలో భాగంగా జనసేన పార్టీకి ఒక స్థానం దక్కింది. ఆ స్థానానికి పార్టీ తరఫున నాగబాబు పేరును ఖరారు చేయడంతో, ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత తొలిసారి శాసన మండలి సమావేశంలో పాల్గొనేందుకు వెళ్తున్న నాగబాబు, తన తమ్ముడు, డిప్యూటీ సిఎంను కలవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# ముందే వచ్చిన దసరా, దీపావళి

>> ఉంది.
మోడీ సంస్కరణలతో పరోక్ష పన్ను చెల్లింపుదారులు 132 శాతం పెరిగారు.
2017లో 65 లక్షల మంది ఉంటే.. ప్రస్తుతం 1.51 కోట్ల మంది పన్ను చెల్లింపుదారులున్నారు.
జిఎస్టీ రిసిప్ట్‌ల ద్వారా 2018లో రూ.7.19 లక్షల కోట్లు మాత్రమే ఆదాయం, ప్రస్తుతం రూ.22.08 లక్షల కోట్ల ఆదాయం.
జిఎస్టీ సంస్కరణలు.. పేదల జీవితాల్లో ప్రభావం చూపుతుంది.
వాజ్‌పేయీ హయాంలో జీఎస్టీ సంస్కరణలు తీసుకువచ్చారు.
ఇపుడు జిఎస్టీ రెండో తరం సంస్కరణలు తీసుకువచ్చారు.
ఆ సంస్కరణలకు నేను ఎప్పుడూ ముందుంటాను.
అభివృద్ధి జరిగితే సంపద సృష్టి.. ప్రభుత్వానికి ఆదాయమనీ, ప్రభుత్వానికి ఆదాయం వస్తే సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందనీ సిఎం అన్నారు.
అప్పులు చేసి సంక్షేమం ఇవ్వడం సరికాదనేది నా నమ్మకం.
ఆర్థిక ఇబ్బందులు వచ్చినా.. దేశం, రాష్ట్రమే ముఖ్యం.
దీర్ఘకాల సంస్కరణలను దృష్టిలో పెట్టుకుని చూడాలి.
జిఎస్టీ గేమ్ ఛేంజర్.. సంస్కరణలకు మద్దతివ్వాలని చెప్పాననీ అన్నారు.
గతంలో 4 టైర్ (5, 12, 18, 28 శాతం)పన్నుల వ్యవస్థ ఉండేది.
ఒకే ఉత్పత్తికి సంబంధించి అనుబంధ ఉత్పత్తులు వస్తే పన్నులు మార్చేవారు.
పన్నుల విధానంలో 2 శ్లాబులు (5, 18 శాతం) ఉంచి సరళతరం చేశారు.
కొత్త పన్నుల విధానంతో ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుంది.
సంస్కరణలను ముందుండి నడిపిన నిర్మలా సీతారామన్ కృషి అభినందనీయం.
రాష్ట్ర ఆదాయానికి నష్టం కలిగినా సామాజిక ప్రయోజనాల కోసం సమర్థించామని పేర్కొన్నారు.
చరిత్రాత్మక సంస్కరణలకు మద్దతు తెలిపిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్.
జిఎస్టీ పన్ను విధానం సులభతరం ద్వారా ప్రజలకు ప్రత్యక్ష లాభం చేకూరుతుందని అన్నారు.
వ్యాపారులపై పన్నుల భారం తగ్గి.. పన్నుల వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుంది.
ప్రజల పొదుపు పెంచి.. కొనుగోలు శక్తి పెంపొందించేందుకు దోహదం చేస్తుంది.
స్థిరమైన వృద్ధి మార్గంలో నిలపడానికి ఈ సంస్కరణలు ఉపయుక్తంగా ఉంటుందన్నారు.
కొత్త పెట్టుబడులు పెంచి.. ఆర్థిక వృద్ధికి దారితీస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.



అమరావతిలో నిర్మిస్తున్న ప్రభుత్వ సముదాయం సూక్ష్మ నమూనా

# ఆకట్టుకునేలా అమరావతి ప్రభుత్వ సముదాయ సూక్ష్మ నమూనా

## -19న నిర్వహించే ప్రాపర్టీ షోలో ప్రదర్శన

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న ప్రభుత్వ సముదాయం (గవర్నమెంట్ కాంప్లెక్స్) సూక్ష్మ నమూనాను ప్రభుత్వం తయారు చేయించింది. హైదరాబాద్‌లో తయారైన నమూనా గురువారం విజయవాడ రానుంది. అమరావతి నగరం గురించి ప్రజలు తెలుసుకునేలా, భవిష్యత్తులో సమకూరబోయే మౌలిక వసతులు,నిర్మాణాలు నమూనాలో సమకూర్చారు. రాజధానినిర్మాణం పూర్తయ్యాక స్వరూపం ఎలా ఉంటుందో తిలకించే అవకాశం ఏర్పడుతుంది. సూక్ష్మ నమూనాలో అసెంబ్లీ భవనం, హైకోర్టు 50 అంతస్థుల జిఏడి టవర్‌తో పాటు నాలుగు హెచ్‌వోడీ టవర్లు,మెట్రో లైన్లు, ఐకానిక్ తీగల వంతెన,ప్రధాన మౌలిక వసతులు,రవాణా సదుపాయాలున్నాయి. నరెడ్కో సెంట్రల్ జోన్,కేంద్ర గృహ నిర్మాణ,పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో నగరంలోని ఏ కన్వెన్షన్‌లో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు జరిగే 11వ అమరావతి స్థిరాస్థి ప్రదర్శనలో ఈ నమూనాను ప్రదర్శిస్తారు. అనంతరం అమరావతిలోని ఎపి సిఆర్డీఏ కార్యాలయంలో ఉంచుతారు.

# ఇబ్బందులున్నా సంస్కరణలే మిన్న

>> ద్వారా 5 శాతం నుంచి 0 శాతానికి తగ్గించడం ద్వారా రోజు వారి వ్యయాన్ని తగ్గించినట్టు అవుతుంది. నెయ్యి, వెన్న, వంట పాత్రలపై పన్ను 12 శాతం నుంచి 5 శాతంకి తగ్గించడం ద్వారా కుటుంబ బడ్జెట్‌కి చాలా ఉపశమనం కలిగిస్తుంది. సబ్బులు, షాంపూలు, పేస్టులు వంటి వ్యక్తిగత సంరక్షణ వస్తువులపై జిఎస్టీ తగ్గింపు ద్వారా వాటి ధరల గణనీయంగా తగ్గుతాయి. తద్వారా ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత మెరుగవుతుంది. మధ్య తరగతి కోసం కార్లు, ఫ్రిజ్‌లు, టీవీలు, ఎయిర్ కండీషన్లపై 18 శాతానికి తగ్గించడం ద్వారా వాటి ధరలు అందుబాటులోకి వచ్చి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడతాయి. గృహ నిర్మాణానికి అవసరం అయిన సిమెంటుమీద పన్ను 18 శాతానికి తగ్గించడం నిర్మాణవ్యయం తగ్గుతుంది.

**శ్లాబులపై ప్రజలకు అవగాహన కల్పిద్దాం**

జిఎస్టీ సంస్కరణల లాభాలు ప్రతి కుటుంబానికి చేరే విధంగా అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలి. జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు ప్రజలందరికీ తెలియజేసే కార్యక్రమం చేపట్టాలి.
గ్రామ స్థాయిలో రెవెన్యూ అధికారులు ప్రజలను నేరుగా కలిసి వారికి ఎలా లబ్ధి చేకూరుతుందో చెప్పాలి. ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలి. ప్రతి కుటుంబం జిఎస్టీ సంస్కరణల గురించి తెలుసుకుని లాభాలు పొందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ చారిత్రాత్మక మార్గదర్శక సంస్కరణలను ఆహ్వానిస్తూ ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం వాటి విజయవంతమైన అమలుకు సహకరిస్తుంది" అన్నారు.

# వివిధ ఆలయాల బోర్డులకు చైర్మన్ల నియామకం

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ దేవాలయాల బోర్డులకు చైర్మన్లను నియమించింది. టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీలకు ప్రెసిడెంట్లను నియమించింది. వివిధ ఆలయాల బోర్డులకు చైర్మన్లను నియమిస్తూ ఏపీ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. శ్రీశైలం భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి దేవస్థానం పాలక మండలికి చైర్మన్‌గా పోతుగుంట రమేశ్ నాయుడు శ్రీకాళహస్తి కాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మండలికి చైర్మన్‌గా కొట్టె సాయి ప్రసాద్, కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం మండలికి చైర్మన్‌గా వి. సురేంద్ర బాబు (మణి నాయుడు),విజయవాడ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం (ఇంద్రకీలాద్రి) మండలికి చైర్మన్‌గా బొర్రా రాధాకృష్ణ (గాంధీ), వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం మండలికి చైర్మన్‌గా ముదునూరి వెంకట్రాజులు నియమితులయ్యారు.

**టిటిడి లోకల్ అడ్వైజరీ కమిటీలకు ప్రెసిడెంట్ల నియామకం**

టిటిడి లోకల్ అడ్వైజరీ కమిటీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - ఏవీ రెడ్డి, టిటిడి లోకల్ అడ్వైజరీ కమిటీ, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - నేమూరి శంకర్ గౌడ్,. టిటిడి లోకల్ అడ్వైజరీ కమిటీ, బెంగళూరు - వీరాంజనేయులు, టిటిడి లోకల్ అడ్వైజరీ కమిటీ, ఢిల్లీ - ఎదుగుండ్ల సుమంత్ రెడ్డి. టిటిడి లోకల్ అడ్వైజరీ కమిటీ, ముంబై - గౌతమ్ సింగానియా, టిటిడి లోకల్ అడ్వైజరీ కమిటీ, విశాఖపట్నం - వెంకట పట్టాభిరామ్ చోడేలు నియమితులయ్యారు.

# మెగా డిఎస్సీ నియామక పత్రాల పంపిణి వాయిదా

**విజయవాడ, సెప్టెంబరు 18, ప్రభాతవార్త ప్రతినిధి:** భారీ వర్షాల కారణంగా ఎపి మెగా డిఎస్సీ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం వాయిదా వేశారు. డిఎస్సీ ద్వారా ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులకు శుక్రవారం నియామక పత్రాలు అందించాల్సి ఉంది. సిఎం చంద్రబాబు,మంత్రి లోకేష్, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అసెంబ్లీ వెనుక ప్రాంగణంలో కార్యక్రమం నిర్వహించాల్సి ఉంది. కానీ బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ప్రాంగణం తడిసి ముద్దయింది. ప్రదేశం అనుకూలంగా లేకపోవడంతో కార్యక్రమాన్ని ప్రభుత్వం వాయిదా వేసింది.

# ఆన్‌లైన్ అనుమతులు

>> ఆగస్టు 15 నుంచి అమలు చేసేందుకు ఏర్పాట్లు చేసినా కొన్ని సాంకేతిక, ఫీజుల విషయంలో తలెత్తిన సమస్యలతో తాత్కాలికంగా వాయిదా వేశారు. వీటి పరిష్కారానికి ఉన్నత స్థాయిలో ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. 300 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మాణాలకు ఇప్పటి వరకు పంచాయితీ కార్యదర్శులు అనుమతులిస్తున్నారు. అంతకంటే మించినవి జిల్లా పట్టణ ప్రణాళిక అధికారులకు వెళ్తున్నాయి. భారీభవనాలైతే పట్టణాభివృద్ధి సంస్థలు అనుమతులు ఇస్తున్నాయి. నిబంధనల ప్రకారం పంచాయితీలకు ఫీజుల్లోరావాల్సిన వాటా మొత్తాలు పట్టణాభివృద్ధి సంస్థలు సరిగా విడుదల చేయట్లేదు. డిపిఎంఎస్ విధానం అమల్లోకి వచ్చాక పంచాయితీలకు పక్కాగా ఆదాయం రావాల్సిందేనని పంచాయితీరాజ్ శాఖ పట్టుబడుతోంది. ప్రభుత్వ స్థాయిలో త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి.

# 3 నెలలు పొడిగింపు

>> ప్రాజెక్టుల్లో రైల్వేవి అత్యధికంగా 28 ఉన్నాయి. ఇందులో మలుగూరు పాలసముద్రం మధ్య 17.97 కిలోమీటర్ల పొడవైన కొత్త రైల్వే ప్రాజెక్టు, గుంతకల్లు వెస్ట్‌మల్లప్ప గేట్ రైల్ ఓవర్ రైల్ ట్రాక్, తిరుపతి -కాట్పాడి మధ్య 104.39 కిలోమీటర్ల లైన్, గూడూరు-రేణిగుంట మధ్య 83.17 కి.మీ. మూడో లైన్, ముద్ఖేడ్, మేడ్చల్ మహబూబ్‌నగర్, డోన్ సెక్షన్‌లో 417.88 కి.మీ. డబ్లింగ్, విజయనగరం-సంబల్‌పూర్ మూడో లైన్, మల్కన్‌గిరి-పాండురంగాపురం మధ్య కొత్త రైల్వే లైన్, ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు రైల్వే లైన్ నిర్మాణాలు ఇంకా జీరో పురోగతిలోనే ఉన్నాయి. కర్నూలు 3 పీఎస్ఆర్ ఈ ట్రాన్స్‌మిషన్ లైన్, కర్నూలు4 ఆర్ఈజెడ్ ఫేజ్1 ట్రాన్స్‌మిషన్ సిస్టం ప్రాజెక్టులూ సున్నా స్థాయిలోనే ఉన్నాయి.
కర్నూలు, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రాజెక్టులు 6 శాతం మేర పూర్తయ్యాయి. 2022 మార్చికి పూర్తికావాల్సిన ఈ ప్రాజెక్టు గడువును 2030 మార్చికి పొడిగించారు. రూ.1,420 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటివరకు రూ.165.65 కోట్లు ఖర్చుచేశారు. పెట్రోలియం శాఖకు చెందిన విశాఖరాయ్‌పుర్ పైప్‌లైన్ ప్రాజెక్టు 8 శాతం మాత్రమే జరిగింది. 2024 సెప్టెంబరుకు పూర్తికావాల్సిన ఈ ప్రాజెక్టును 2027 సెప్టెంబరుకు వాయిదా వేశారు. రూ.2,212 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటివరకు రూ.13.45 కోట్లే ఖర్చుచేశారు. కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఇప్పటివరకూ 24 శాతం మాత్రమే పూర్తయింది. రూ.305 కోట్ల ఈ ప్రాజెక్టుకు ఇప్పటివరకు రూ.83.33 కోట్లు ఖర్చుచేశారు. దీని గడువును 2027 జూన్‌గా తెలిపారు.
విజయవాడ విమానాశ్రయంలో కొత్త సమీకృత టెర్మినల్ నిర్మాణం 79 శాతం పూర్తయినట్లు కేంద్రం వెల్లడించింది. 2022 సెప్టెంబర్ నాటికి పూర్తికావాల్సిన దీని నిర్మాణ గడువును తాజాగా 2025 డిసెంబరుకు పొడిగించినట్లు తెలిపింది. రూ.611.8 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టుకు ఇప్పటివరకు రూ.473.27 కోట్లు ఖర్చు చేసింది. రాజమహేంద్రవరం విమానాశ్రయంలో డొమెస్టిక్ టెర్మినల్ నిర్మాణం 51 శాతం పూర్తి కాగా రూ.347.15 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టుకు రూ.90.56 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపింది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి మొత్తం పనులు పూర్తిచేయా లన్నది లక్ష్యం. కడప విమానాశ్రయంలో కొత్త డొమెస్టిక్ టెర్మినల్ నిర్మాణం, ఇతర పనులు, నిర్వహణ పనులు అన్నీ కలిపి 34 శాతం పూర్తయ్యాయి. రూ.265.91 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టుకు రూ.50.06 కోట్లు ఖర్చు అయ్యినట్లు తెలిపింది. 2026 మార్చి నాటికి మొత్తం పనులు పూర్తి చేయాలన్నది లక్ష్యమని కేంద్రం వెల్లడించింది.

# తెలంగాణలో పండుగలకు 7754 ప్రత్యేక బస్సులు

## 20 నుంచి అక్టోబరు 2 దాకా స్పెషల్ సర్వీసులు

**హైదరాబాద్, ప్రభాతవార్త, సెప్టెంబరు 18:** తెలంగాణ రాష్ట్రంలో ఘనంగా నిర్వహించే బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రజలకు రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టిజిఎస్ఆర్‌టిసి) యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. దసరా, బతుకమ్మ పండుగలకు రాష్ట్రవ్యాప్తంగా 7754 స్పెషల్ బస్సులను నడపడానికి ప్రణాళిక సిద్ధం చేసింది. వాటిలో 377 స్పెషల్ సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించింది. ఈ నెల 20 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక బస్సులను నడపనున్నట్టు ఆర్‌టిసి ప్రకటించింది. సద్దుల బతుకమ్మ ఈ నెల 30న, దసరా అక్టోబర్ 2న ఉన్నందున.. ఈ నెల 27 నుంచే సొంతూళ్లకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముండటంతో ఆ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచనుంది. తిరుగు ప్రయాణానికి సంబంధించి అక్టోబర్ 5, 6వ తేదిల్లోనూ రద్దీకి అనుగుణంగా బస్సులను సంస్థ ఏర్పాటు చేయనుంది. హైదరాబాద్‌లో ప్రధాన బస్టాండులైన ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్‌తోపాటు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే కేపీహెచ్‌బీ కాలనీ, ఉప్పల్ క్రాస్‌రోడ్స్, ఉప్పల్ బస్టాండ్, దిల్ సుఖ్ నగర్, ఎల్బీనగర్, ఆరాంఘర్ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడిపించనుంది. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాష్ట్రం నలుమూలలతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలకు ప్రత్యేక బస్సులు నడుపుతోంది. దసరా స్పెషల్ బస్సుల్లో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 16 ప్రకారం తిరుగు ప్రయాణంలో ఖాళీగా వచ్చే బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చుల మేరకు టికెట్ ధరలను సంస్థ సవరించనుంది. ఈ నెల 20తో పాటు 27 నుంచి 30 తేదివరకు వరకు... అలాగే అక్టోబర్ 1,5,6 తేదిల్లో నడిచే స్పెషల్ బస్సుల్లోనే సవరణ (అదనపు) ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఆయా రోజుల్లో తిరిగే రెగ్యూలర్ సర్వీసుల చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదని.. అవి యధావిధిగా ఉంటాయని ఆర్‌టిసి పేర్కొంది. గత దసరా కంటే ఈ సారి అదనంగా 617 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని, రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంప్‌లను ఏర్పాటు చేసి ప్రయాణికులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని.. ముఖ్యంగా ఎల్బీనగర్, ఉప్పల్, ఆరాంఘర్, కేపీహెచ్‌బీ, సంతోష్ నగర్, తదితర ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం షామియానాలు, కుర్చీలు, తాగునీరు, మౌలిక సదుపాయాలతోపాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను ఏర్పాటు చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్టు ఆర్‌టిసి ఎండి విసి సజ్జనార్ తెలిపారు. ప్రతి రద్దీ ప్రాంతం వద్ద పర్యవేక్షణ అధికారులను నియమిస్తున్నామని, ప్రయాణికుల రద్దీని బట్టి వారు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచుతారని తెలిపారు.
పోలీస్, రవాణా, మున్సిపల్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యంగా సంస్థ అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. పండుగలకు రద్దీ ఎక్కువగా ఉందని వైట్ నంబర్ ప్లేట్ గల ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించి.. ఇబ్బందులు పడొద్దని సజ్జనార్ సూచించారు. ఆర్‌టిసిలో ఎంతో అనుభవం గల డ్రైవర్లు ఉన్నారని, వారు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తారని చెప్పారు. బతుకమ్మ, దసరా ప్రత్యేక సర్వీసుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను సంస్థ అధికారిక వెబ్ సైట్‌లో చేసుకోవాలని కోరారు. దసరా స్పెషల్ సర్వీసులకు సంబంధించి పూర్తి సమాచారం కోసం టిజిఎస్ఆర్‌టిసి కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# గిన్నిస్‌లోకి తెలంగాణ 'బతుకమ్మ'

## ప్రపంచ రికార్డు సృష్టించేలా సంబురాలు జరుపుతాం: తెలంగాణ మంత్రులు జూపల్లి, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 18,ప్రభాతవార్త:** గిన్నిస్ బుక్ రికార్డులో చేరేలా బతుకమ్మ సంబరాలు జరుపుతామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. గాంధీభవన్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, హనుమంతరావుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంసృతి అని బతుకమ్మ అంటే ప్రకృతి గౌరవించడం,ప్రకృతిని కాపాడటమని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పండుగలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని తెలంగాణ సంసృతి ప్రపంచానికి చాటి చెప్పాలి మంత్రి పిలుపునిచ్చారు. 21నుండి31 వరకు బతుకమ్మ పండుగ ఘనంగా జరుపుతామని వివరించారు. 21 న వెయ్యి సంభాల వద్ద ప్రారంభం చేయబోతున్నామని అన్నారు. పూలనే దేవతగా కొలిచే బతుకమ్మ పండుగ, బతుకమ్మ పండుగ పూల పండుగ మాత్రమే కాదు , ఆడబిడ్డలను గౌరవించుకునే పండుగ అని తెలిపారు. బతుకమ్మ తెలంగాణ ఆత్మగౌరవానికి, ప్రత్యేక సాంస్కృతిక అస్తిత్వానికి ప్రతీతెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా గౌరవిస్తుందని తెలిపారు. కవులను రచయితలను పిలిచి వారితో చర్చించి బతుకమ్మ పాటలకు ట్యూన్స్ కట్టించడంతోపాటు, ఆ పాటలను ముందు తరాలకు అందించేలా ముద్రణ చేయిస్తామని తెలిపారు. బతుకమ్మ జరిగే ప్రాంతంలో డెకరేషన్ ఏర్పాటు చేయడంతోపాటు విమానాశ్రయంలో కూడా మన సంసృతి తెలిసేలా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బతుకమ్మ పండుగలో ప్రజలు అందరూ భాగస్వామ్యం కావాలి అని కోరుతున్నాను. వివిధ రుగ్మతలు పారదోలే విధంగా అవగాహన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అన్నారు. బతుకమ్మ పండుగ ఉద్దేశం అందరూ కలిసి ఆత్మీయత కోసం ఇది వ్యక్తుల కార్యక్రమం కాదు అందరి పండుగ అని ఆయన తెలిపారు. మాజీ ఎంపీ హనుమంతరావు మాట్లాడుతూ 30 ఏళ్లుగా బతుకమ్మ కుంటలో ఆడకుండా చేశారు గత ప్రభుత్వం హయంలో ఎంతోమందిని అడిగినా పట్టించుకోలేదని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకుడు కబ్జా చేశాడు కాంగ్రెస్ అధికారంలో రాగానే బతుకమ్మ కుంట చాలా బాగా చేసారు నేను సోనియా గాంధీకి ఇది మా సంసృతి అని కూడ బతుకమ్మ అని చెప్తే ఆమె కూడ బతుకమ్మ ఎత్తుకుందని గుర్తుచేసుకొన్నారు. బతుకమ్మ కుంటను కాపాడిన రేవంత్ రెడ్డికి, హైడ్రాకు నా అభినందనలు అని అన్నారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ సంప్రదాయం బతుకమ్మ పండుగ కాంగ్రెస్ శ్రేణులు ఎంగిలి పువ్వు నుండి సద్దుల బతుకమ్మ వరకు ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్ళాలని కోరారు. చాలా వరకు 2000 నుండి బతుకమ్మ ఏర్పాటు అయింది అపోహ ఉందని కానీ ఇది పాత పండుగనే అని ఆయన తెలిపారు. కొందరు బతుకమ్మను రాజకీయం చేశారని అన్నారు. రకరకాల పాటలతో బతుకమ్మ ను ఇప్పటికీ రాజకీయం చేస్తున్నారు ఇది తెలంగాణ సంస్కృతికి దర్పణం పట్టేపండుగ అని ఆయన అన్నారు. తెలంగాణ సంప్రదాయంబతుకమ్మ పండుగలో ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా జరుపుకోవాలిబతుకమ్మ కుంట బతుకమ్మ కోసం మళ్ళీ వచ్చింది. బతుకమ్మ కుంటను కాపాడటంలో రేవంత్ రెడ్డి,హనుమంతరావు పాత్ర కీలకమని ఆయన అన్నారు.

# వారం - వర్జ్యం

19-09-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
త్రయోదశి రా.11.40
ఆశ్లేష ఉ.7.06
వర్జ్యం : రా.7.36-9.16
దు.ఉ.8.23-9.12, మ.12.27-1.16
శుభసమయం : ఉ.6.45-7.30
రాహుకాలం - ఉ.10.30-12.00

# వార్తాఫలం

**మేషం:** ఆస్తి పంపకములో నిందారోపణలు రానివ్వకుండా చాకచక్యంగా వ్యవహరిస్తారు.

**వృషభం:** నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సన్నిహితుల నుండి శుభవార్తలు వింటారు.

**మిథునం:** ఎదురు చూడని అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగ యత్నాలకు అనుకూలమై కాలం.

**కర్కాటకం :** గృహం, భూములు కొనుగోలు యత్నాలు ముమ్మరం చేస్తారు. ఆర్థిక పరిస్థితి అనుకూలం.

**సింహం:** క్రమశిక్షణకు ప్రాధాన్యత నిచ్చి, కష్టపడి, ప్రతిష్టాకమైన మంచి ఫలితాలను సాధిస్తారు.

**కన్య :** నూతన ప్రయత్నాలలో పురోగతిని సాధిస్తారు. ఇంటిలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది.

**తుల :** ప్రముఖులను కలుసుకొని కీలక సమాచారం తెలుసుకుంటారు. ఉద్యోగులకు హోదాలు లభిస్తాయి.

**వృశ్చికం:** సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు.

**ధనుస్సు:** మాటల చాతుర్యంతో శత్రువులను సైతం మిత్రులుగా మార్చుకుంటారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**మకరం:** నూతన ప్రయత్నాలలో పురోగతి సాధిస్తారు. సంఘంలో ప్రత్యేకమై గుర్తింపు పొందుతారు.

**కుంభం:** ప్రముఖులతో చర్చలు సాగిస్తారు. ఇంటిలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది.

**మీనం :** నూతన ఉద్యోగావకాశాలు లాభిస్తాయి. స్థిరాస్తి వివాదాల నుండి బయటపడతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 5 రాష్ట్రాల్లో ఇడి తనిఖీలు

>> డిస్టిలరీలను హస్తగతం చేసుకుని రకరకాల పేర్లతో మద్యం ఉత్పత్తి చేయించారు. కమీషన్లు ఇచ్చిన కంపెనీలకే అధిక ఆర్డర్లు కట్టబెట్టారు. బెవరేజెస్ కార్పొరేషన్ నుంచి మద్యం సరఫరదారుకు బిల్లులు చెల్లించగానే మద్యం ముఠా తమ ముడుపులు వసూలు చేసుకునేవారు. ఈ ప్రక్రియంతా పక్కా కుట్రపూరితంగా జరిగిందని ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ తేల్చింది. వైఎస్సార్సీ హయాంలో మద్యం మాటున దాదాపు రూ.3,500 కోట్ల దోపిడీకి పాల్పడినట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం గుర్తించింది. ఈ మొత్తాన్ని డొల్ల కంపెనీలు, బినామీ సంస్థల ద్వారా మళ్లించినట్లు ఛార్జిషీట్లలో పేర్కొంది. మద్యం ముడుపుల సొమ్ముతో కొందరు స్థిరాస్తి వ్యాపారాలు చేయగా మరికొందరు విదేశాల్లో పెట్టుబడులు పెట్టినట్లు సిట్ కొన్ని కీలక ఆధారాలు సేకరించింది. ఇప్పటివరకూ 29 మంది వ్యక్తులు, 19 సంస్థలను నిందితులుగా చేర్చింది. 12 మందిని అరెస్టు చేసింది. మద్యం ముడుపులను విదేశాలకు హవాలామార్గంలో తరలించారనే కోణంలో ఇడి రంగంలోకి దిగింది.

# ఎయిరిండియాకు తప్పిన పెను ప్రమాదం!

- విశాఖ నుండి హైదరాబాద్ వెళ్లే విమానం రెక్కలో ఇరుక్కున్న పక్షి
- చాకచక్యంగా వ్యవహరించిన పైలట్

**విశాఖపట్నం, సెప్టెంబరు 18 ప్రభాతవార్త:** విశాఖ నుంచి హైదరాబాద్‌కు బయల్దేరిన ఎయిరిండియా విమానానికి పెను ప్రమాదం తప్పింది. విశాఖ నుంచి మధ్యాహ్నం 2.20 గంటలకు హైదరాబాద్‌కు విమానం బల్దేరింది. విమానం గాలిలోకి ఎగిరిన కొంతసేపటికే విమానం రెక్కలో పక్షి ఇరుక్కుంది. దీంతో ఇంజిన్ ఫ్యాన్ రెక్కలు దెబ్బతిన్నాయి.పైలట్ చాకచక్యంగా వ్యవహరించి విమానాన్ని తక్షణమే వెనక్కి తిప్పి తీసుకొచ్చి ల్యాండ్ చేశారు. ఘటన సమయంలో విమానంలో మొత్తం 103 మంది ప్రయాణికులు ఉన్నారు. ఎయిరిండియా యాజమాన్యం ప్రయాణికులు హైదరాబాదు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది.

# అమెరికా సుంకాలు 25% తగ్గొచ్చు

## కేంద్ర ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలపై దేశ ప్రధాన ఆర్థికసలహాదారు వి.అనంత నాగేశ్వరన్ మాట్లాడుతూ త్వరలోనే అమెరికా ప్రతీకార సుంకాలను ఉపసంహరించుకనే అవకాశం ఉందని తెలిపారు. అలాగే పరస్పర సుంకాలను కూడా తగ్గించే అవకాశం ఉందని అన్నారు. దీంతో అధిక సుంకాల భారంతో ఇబ్బంది పడుతున్న భారతీయ ఎగుమతిదారులకు ఉపశమనం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కోల్‌కతాలో జరిగిన కార్యక్రమంలో నాగేశ్వర్ మాట్లాడుతూ, ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. గత ఆగస్టులో అమెరికా విధించిన 25శాతం ప్రతీకార సుంకాన్ని నవంబర్ చివరి నాటికి ఉపసంహరించుకోవచ్చు. నవంబర్ 30 తరువాత ప్రతీకార సుంకాలు ఉండవని నేను నమ్ముతున్నా. ఇది ఏదైనా నిర్దిష్ట లేదా స్పష్టమైన ఆధారాల ప్రకారంగా చేసిన ప్రటకటన కాదు. కానీ, ఇటీవల జరిగిన పరిణామాలను చూస్తే, రాబోయే రెండు నెలల్లో ప్రతీకార సుంకాల సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నా. అలాగే పరస్పర సుంకం విషయంలో కూడా సానుకూల పరిణామాలు ఎదురవుతాయని భావిస్తున్నానని అనంత నాగేశ్వర్ తెలిపారు. ప్రస్తుతం 25శాతం పరస్పర సుంకాన్ని 10లేదా 15శాతానికి తగ్గించే అవకాశం ఉందని నాగేశ్వరన్ పేర్కొన్నారు. మొత్తం సుంకాల సమస్య 8 నుంచి 10 వారాల్లో పరిష్కారం అవుతుందని ఆయన అంచనా వేశారు. అయితే, ఇది పూర్తిగా తన వ్యక్తిగత అభిప్రాయమేనని, అధికారిక హామీపై ఆధారపడలేదని స్పష్టం చేశారు. ఇటీవల జీఎస్టీ విధానంలో తీసుకొచ్చిన మార్పులు దేశంలో వినియోగాన్ని పెంచుతుందని భావిస్తున్నట్లు నాగేశ్వరన్ అన్నారు. దీని ప్రభావం జిడిపి వృద్ధిపై గణనీయంగా ఉంటుందని తెలిపారు. ప్రజలు చేతుల్లో అధిక కొనుగోలు శక్తి ఉన్నప్పుడు, రేట్లు తగ్గుతాయని పేర్కొన్నారు. అది డిమాండ్, ఉత్పత్తి, సామర్థం పెరుగుదలకు దారితీస్తుందని అన్నారు. ఇది ఆదాయ వృద్ధికి దోహదం చేస్తుందని అన్నారు.

## దేశంలో పథకం ప్రకారం ఓట్ల చోరీ

**- రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల**

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో పథకం ప్రకారం ఓట్ల చోరీ జరిగిందని, దీని వెనుక ప్రధాని మోదీ ఉన్నారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)పై సంచలన ఆరోపణలు షర్మిల చేశారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఓట్ల తొలగింపు వ్యవహారంపై ఆధారాలతో మాట్లాడుతుంటే, ప్రధాని మోదీ బండారం బయటపడుతోందని గురువారం ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ఎన్నికల సంఘం, బీజేపీకి కీలుబొమ్మగా మారిందని షర్మిల ఆరోపించారు. లక్షలాది మంది ఓటు హక్కును కాలరాస్తూ, బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. "ప్రధాని మోదీ కోసం అవసరమైన చోట దొంగ ఓట్లు సృష్టించడం, కాంగ్రెస్‌కు అనుకూలమైన చోట ఓట్లు తొలగించడం ద్వారా ఈసీ తన స్వయంప్రతిపత్తిని కోల్పోయింది" అని ఆమె పేర్కొన్నారు. కర్ణాటకలోని అలంద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుస్తుందనే ఉద్దేశంతోనే, నకిలీ లాగిన్ల ద్వారా సుమారు 6 వేల ఓట్లను తొలగించారని ఆమె ఆరోపించారు సాఫ్ట్‌వేర్‌ను హైజాక్ చేసి, ఆటోమేటెడ్ ప్రోగ్రామింగ్ ద్వారా ఓట్లను తొలగించడం దేశద్రోహంతో సమానమని షర్మిల అభిప్రాయపడ్డారు. నకిలీ ధృవపత్రాలు, తప్పుడు ఫోన్ నంబర్లతో ఓట్లను అక్రమంగా తొలగించడాన్ని ఉగ్రవాద చర్యగా ఆమె అభివర్ణించారు. రాహుల్ గాంధీ డిమాండ్ చేసిన తొలగించిన ఓటర్ల వివరాలను, వాటికి ఉపయోగించిన ఫోన్ నంబర్లు, ఓటీపీల సమాచారాన్ని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

## రాహుల్‌దేవ్ సింగ్‌కు గుంతకల్లు రైల్వే ఎస్పీగా అదనపు బాధ్యతలు

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 15,ప్రభాతవార్త** ప్రస్తుతం విజయవాడ రైల్వే ఎస్పీగా పనిచేస్తున్న రాహుల్‌దేవ్ సింగ్‌కు గుంతకల్లు రైల్వే ఎస్పీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సంబంధిత ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గుంతకల్లు రైల్వే ఎస్పీగా పనిచేస్తున్న రాహుల్‌ను కోనసీమ ఎస్పీగా బదిలీ చేసారు.



# మునోత్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

**పరుగులు తీసిన ఆర్‌డిఓ, ఏర్పేడు అధికారులు**

**శ్రీకాళహస్తిరూరల్,సెప్టెంబర్ 18 ప్రభాతవార్త** ఏర్పేడు మండలంలోని మనోత్ ఇండస్ట్రీస్‌లో గురువారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు రూ.50కోట్ల ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. సంఘటన విషయం తెలిసిన వెంటనే తెల్లవారుజామునే శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి, ఏర్పేడు ఎంపిడిఓ పరుగులు తీసారు. అయితే అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లిక పోవటంతో ఊపిరి పీల్చుకున్నారు.ఏర్పేడు మండలంలోని మనోత్ ఇండస్ట్రీస్ లిథియం ఆయాన్ బ్యాట రీలను త యారు చే స్తుంది.ఈ ఫ్యాక్టరీలో 125 మంది కార్మికులు పని చేస్తున్నట్లు సమాచారం. వేకువ జామున ప్రమాదం జరిగినపుడు ఫ్యాక్టరీలో ఎవ్వరూ లేదని ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి వివరించారు. అయితే సంఘటన విషయం తెలిసిన వెంటనే తిరుపతి,శ్రీకాళహస్తి డివిజన్లలోని 9 ఫైర్ ఇంజన్లు మంటలను ఆర్పటానికి రంగంలో దిగాయి.ఏర్పేడు పోలీసులు పరుగులు తీసారు.మండలంలో జరిగిన సంఘటనలో ఏం జరిగిందో అని ఏర్పేడు సిఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్, ఎంపిడిఓ పంచాయతీ కార్యదర్శులు, వికృతమాల,మర్రిమంద పంచాయతీ అధికారులు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు అక్కడకు చేరుకున్నారు. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు అక్కడే పరిశీలించారు. ప్రమాదం జరిగిన సమయంలో ఫ్యాక్టరీలో కార్మికులు ఎవ్వరూ లేదని తెలిసింది.

## సిఎం చంద్రబాబును అభినందిస్తూ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల



**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** జీఎస్టీ రెండో తరం సంస్కరణలకు మద్దతు తెలిపిన ముఖ్యమంత్రిని అభినందిస్తూ పయ్యావుల ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏపీ అసెంబ్లీ. ఆమో దించింది. జీఎస్టీ సంస్కరణలతో రాష్ట్ర ఆదాయం కొంత మేర తగ్గుతున్నా... మొదటగా వాటిని స్వాగతించి మద్దతు తెలిపినందుకు సీఎం చంద్రబాబుకు ఆర్థిక మంత్రి పయ్యావుల, అభినందనలు తెలిపారు. రాష్ట్రానికి ఆదాయం తగ్గినా, ప్రజలకు లబ్ది చేకూరుతుందనేది ముఖ్యమంత్రి ఆలోచన అని అన్నారు. రూ. 8 వేల కోట్లు నష్టం వస్తుందని ఆర్థిక శాఖ అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్తే... ప్రజలకు రూ. 8 వేలు కోట్ల లబ్ది చేకూరుతుంది కదా అని సీఎం అన్నారని తెలిపారు. ప్రజల సంక్షేమాన్ని, ఆర్థిక సుస్థిరతను దృష్టిలో పెట్టుకుని సంస్కరణలను సీఎం మద్దతు తెలిపారు. జీఎస్టీ సంస్కరణలకు చంద్రబాబు మద్దతు తెలుపుతున్నారని జీఎస్టీ కౌన్సిల్ సమావేశానికి వెళ్లే ముందు మీడియాతో చెప్పి వెళ్లానన్నారు. చంద్రబాబు మద్దతిచ్చారని తెలియగానే... జీఎస్టీ సంస్కరణలపై అందరిలోనూ ఓ పాజిటివ్ ధృక్కోణం ఏర్పడిందన్నారు. అనుభవమున్న నాయకుడైన చంద్రబాబు జీఎస్టీ సంస్కరణలకు మద్దతివ్వడంతో జీఎస్టీ కౌన్సిల్ సమావేశం మొత్తం పాజిటివ్ మూడ్ లో జరిగింది. ఈ సంస్కరణలు ఆమోదం పొందడానికి రెండు రోజుల పాటు జీఎస్టీ కౌన్సిల్ సమావేశాలు పెట్టినా... ఒక్క రోజులోనే సంస్కరణలకు ఆమోదం లభించిందని వివరించారు.

## జాతీయ స్థాయి బాలల లఘు తెలుగు నాటికల ప్రదర్శన పోటీలు

**- ఆంధ్ర సారస్వత పరిషత్తు**
**- అధ్యక్షుడు డా. గజల్ శ్రీనివాస్**

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆంధ్ర ప్రదేశ్ ,ఠాగూర్ మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 3 వ ప్రపంచ తెలుగు మహా సభలు 2026 సన్నాహాల్లో భాగంగా 8 నుండి 15 సంవత్సరాల వయసులోపు వున్న వారికి జాతీయ స్థాయి ..బాలల లఘు తెలుగు నాటికల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నారు. నవంబర్ 5 తేది ఉదయం 9 గంటల కు శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన కేంద్రం, గుంటూరులో నిర్వహించనున్నట్లు పరిషత్తు అధ్యక్షులు డా.గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ పోటీలకు సంచాలకులుగా అభినయ శ్రీనివాస్, మానాపురం సత్య నారాయణ లు వ్యవహరిస్తారని డా. శ్రీనివాస్ తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనేవారు విద్యాలయాల తరఫు నుండి గానీ, సాంస్కృతిక సంస్థల నుండి గాని మీ ఎంట్రీలు పంపవచ్చు. నాటిక నిడివి 15 నిమిషాలు మాత్రమే వుండాలన్నారు.నాటిక స్క్రిప్ట్ ను అక్టోబర్ 15 న కల్లా నెంబరు 83310 20896 వాట్సాప్ కు పీడీఎఫ్ ద్వారా పంపాలి. ఎన్నిక అయిన నాటికల వివరాలను నేరుగా సంస్థలకు తెలియ జేస్తారు.. జాతీయ సమైక్యతకు భంగం వాటిల్లే అంశాలు,సంభాషణలు వుండరాదు. వేదిక, లైటింగ్ , సౌండ్ సిస్టమ్ సదుపాయాలు నాటిక ప్రదర్శనకు అందజేయబడతాయి. ప్రదర్శనకు అర్హత సాధించి ప్రదర్శించిన నాటికకు అభినందన ప్రశంసా పత్రం, పాత్ర ధారులకు అభినందన పతకములు, ప్రశంసా పత్రం అందజేయ బడతాయి. ప్రదర్శన రోజున భోజన , అల్పాహార ఏర్పాట్లు చేయబడతాయి. ప్రథమ బహుమతి : 10,000/, పతకము, ప్రశంశా పత్రము, జ్ఞాపిక , ద్వితీయ బహుమతి 7500/ రూపాయలు,జ్ఞాపిక , పతకము, ప్రశంశా పత్రము, తృతీయ బహుమతి 5,000/ , పతకము, జ్ఞాపిక, ప్రశంశా పత్రము, మూడు ప్రత్యేక బహుమతులు , అభినందన పత్రాలు అందజేయ బడతాయి. నటులకు వ్యక్తిగత ప్రతిభా బహుమతులు వుంటాయి. విజేతలకు ప్రపంచ తెలుగు మహా సభలలో బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని ముఖ్య సమన్వయకర్తలు పి.రామచంద్ర రాజు, వి.విద్యాసాగర్ లు తెలిపారు.

## నిందితులపై మా సమాధానాలు పట్టించుకోకుండానే డిఫాల్ట్ బెయిలిచ్చారు : హైకోర్టులో సిఐడి వాదనలు

**మద్యం నిందితుల బెయిలు రద్దుపై విచారణ**

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాత వార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో నిందితులు ధనుంజయ రెడ్డి(ఏ31), కృష్ణ మోహన్ రెడి (ఏ-32),బాలాజీ గోవిందప్ప(ఏ-33)లకు విజయవాడ ఏసిబి కోర్టు ఈ నెల 6న డిఫాల్ట్ బెయిలిచ్చిందని...అయితే అభియోగపత్రాలపై ఆ కోర్టు లేవనెత్తిన అభ్యంతరాలకు 1వ తేదీనే సమాధానం ఇచ్చామని సిఐడీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హైకోర్టుకు చెప్పారు. వివరాలన్నీ ఏసిబి కోర్టు ముందు ఉన్నప్పుడు వాటిపై నిర్ణయం తీసుకోకుండా అసంపూర్తి అభియోగపత్రం దాఖలు చేశామనే కారణంతో డిఫాల్ట్ బెయిలివ్వడానికి వీల్లేదన్నారు. చార్జిషీట్ దర్యాప్తు అధికారి అభిప్రాయం మాత్రమేనని,దానిని పూర్తిగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సింది న్యాయాధికారేనని లూథ్రా పేర్కొన్నారు. డిఫాల్ట్ బెయిలిస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని హైకోర్టులో సిఐడి పిటీషన్ వేసింది. బుధవారం విచారణలో లూథ్రా వాదనలు వినిపించారు. 'మద్యం కుంభకోణం కేసులో ఈ ఏడాది జులై 19న మొదటి ఛార్జిషీట్,ఆగస్టు 11న మరో ఛార్జిషీట్ వేశాం.అభియోగపత్రాలు దాఖలు చేశాక ఏసిబీ కోర్టు నిందితులకు సీఆర్‌పీసీ సెక్షన్ 309ని అనుసరించి రిమాండ్ పొడిగించాలి. నిందితుల తరపు న్యాయవాదులు చెబుతున్నట్లు సీఆర్‌పీసీ సెక్షన్ 167(2) అనుసరించి రిమాండ్ పొడి గించినట్లు ఏసీబీ కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొనలేదు. పబ్లిక్ సర్వెంట్ అయిన ధనుంజయరెడ్డి విషయంలో కాంపిటెంట్ అథారిటీ నుంచి విచారణకు అనుమతి తీసుకోలే దన్న కారణంతో అభియోగ పత్రం అసంపూర్తిగా ఉందని కోర్టు పేర్కొనడం అభ్యంతరకరం.కేసు పెండింగ్‌లో ఉండగా అనుమతి ఉత్తర్వులను ఎప్పుడైనా కోర్టులో వేయొచ్చు. ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులు సైతం అభియోగపత్రంతో వేసి తీరాలనే నిబంధన ఏమీ లేదు.

అభియోగపత్రాలపై అభ్యంతరాలను లేవనెత్తుతూ ఏసీబీ కోర్టు న్యాయాధికారి మెమోరాండం జారీ చేశారు. ఇలాంటి అంశం చట్టంలో ఎక్కడా లేదు. న్యాయాధికారికి అభియోగపత్రాలపై సందేహాలుంటే దర్యాప్తు అధికారిని పిలిపించి నివృత్తి చేసుకోవాల్సింది. సాంకేతిక అంశాలను కారణంగా చూపుతూ ఏసీబీ కోర్టు డిఫాల్ట్ బెయిలు మంజూరు చేసింది'అని వాదించారు. పూర్తి స్థాయి వాదనలు వినేందుకు విచారణను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రకటించారు.

## తల్లితో కలిసి తండ్రిని హత్య చేసిన కుమారుడు

**- పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన తల్లి, కుమారుడు**

**పామిడి, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త** అనంతపురం జిల్లా పామిడి పట్టణంలోని షాధీఖానా వెనుకనున్న బెస్తవీదిలో జన్మనిచ్చిన తల్లి మీనాక్షిని వేధిస్తున్నాడని ఆవేశంతో రగిలిపోయిన కుమారుడు ప్రకాష్ తన పుట్టుకకు కారణమైన తండ్రి బెస్త సుధాకర్(45)ను హత్య చేయటం బుధవారం అర్ధరాత్రి కలకలం రేపింది. సంఘటనకు సంబందించి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన హతుడు బెస్త సుధాకర్ భార్య మీనాక్షి కుమారుడు ప్రకాష్ అందించిన సమాచారం మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి.. బెస్త సుధాకర్ ఐచర్ డ్రైవర్ కావటంతో మద్యానికి బానిసై తరుచూ మద్యం సేవించి భార్య మీనాక్షిని కొడుతుండటంతో కుమారుడు ప్రకాష్ తండ్రితో గొడవ పడుతుండేవాడన్నారు. దీంతో బెస్త సుధాకర్ అర్ధరాత్రి మద్యం మత్తులో భార్య మీనాక్షితో గొడవపడగా తట్టుకోలేని కుమారుడు ప్రకాష్ ఆవేశంతో రగిలిపోయి అక్కడే ఉన్నటువంటి రోకలికర్రతో తలపై బలంగా బాదటం కారణంగా తీవ్ర రక్తగాయమై ఆయన అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. తన తండ్రి బెస్త సుధాకర్‌ను తామే హతమార్చామని తల్లి కుమారుడు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సిఐ యుగంధర్ బెస్త సుధాకర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించి హతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

## స్వచ్ఛఉత్సవ్

**- షెడ్యూల్‌ఖరారు**

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 18,ప్రభాతవార్త** కేంద్రప్రభుత్వం గత పదకొండేళ్లుగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్-స్వచ్ఛ రైలు కార్యక్రమంలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో ఈ ఏడాది నిర్వహిస్తున్న స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమ వివరాలను సంబంధిత ఉన్నతాధికారులు వెల్లడించారు. స్వచ్ఛతాహీ సేవ-25 షెడ్యూల్ : స్వచ్ఛతాహీసేవ-25 కార్యక్రమం 11వ వార్షికోత్సవం సందర్భంగా బుదవారం నుంచి గాంధీ జయంతి వరకు ప్రతిరోజు చేపట్టే కార్యక్రమ వివరాలు ఇలా వున్నాయి. 19న శుక్రవారం స్వచ్ఛమైన రైల్వే స్టేషన్లు, 20,21వ తేదీల్లో శనివారం ఆదివారాల్లో స్వచ్ఛమైన రైలు బండి, 22న సోమవారం స్వచ్ఛమైన రైలు మార్గం, 23న మంగళవారం స్వచ్ఛమైన రైల్వే పరిసరాలు, 24,25న బుధ,గురువారాల్లో స్వచ్ఛమైన ఆహారం, 26న శుక్రవారం స్వచ్ఛమైన తాగునీరు, 27న శనివారం స్వచ్ఛమైన జలాశయాలు, పార్కులు, 28న ఆదివారం స్వచ్ఛమైన శౌచాలయాలు, పర్యావరణం, 29న సోమవారం స్వేచ్ఛా అంశంపై వ్యాసరచన పోటీలు, 30న మంగళవారం ప్లాస్టిక్ వినియోగం, నిషేధం, అక్టోబరు 1న బుధవారం స్వచ్ఛ రైలు నిర్వహణపై సమీక్ష, సంవివరణ,స్వచ్ఛ అవగాహన ర్యాలీ, 2న గురువారం స్వచ్ఛ ఉత్సవ్ దినోత్సవం ముగింపు.

## ప్రతి భక్తుడు సురక్షితంగా, సౌకర్యంగా దర్శనం చేసుకోవాలి

**- బ్రహ్మోత్సవాల్లో గరుడసేవరోజు ప్రజారవాణానే వినియోగిస్తాం - తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు**



**తిరుమల,సెప్టెంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకొండపై తొమ్మిదిరోజులుపాటుజరిగే శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తామని, పోలీసుశాఖ తరపున సాంకేతికతతో భక్తుల భద్రత పర్యవేక్షణ ఉంటుందని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. తిరుమలకు వచ్చిన ప్రతి భక్తుడు సురక్షితంగా, సౌకర్యవంతంగా మూలవిరాట్టుతోబాటు వాహనసేవల దర్శనం చేసుకునే విధంగా చూస్తామని తెలిపారు. 4వేల సిసికెమెరాలు, 6వేలమంది పోలీసులు, విజిలెన్స్ సిబ్బందితో విశాలమైన భద్రతా ఏర్పాట్లు చేశామని తెలిపారు. బ్రహ్మోత్సవాల భద్రత, పోలీసుశాఖ పరంగా తీసుకున్న చర్యలు గురించి గురువారం మధ్యాహ్నం తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణతో కలసి మీడియాతో మాట్లాడారు. బ్రహ్మోత్సవాలకు మొత్తం 5,691మంది పోలీసు అధికారులు, సిబ్బందిని నియమిస్తున్నామని, ఇందులో తిరుమలలోనే 4,223మంది పోలీసులు, తిరుపతిలో 1,468మంది బందోబస్తు విధుల్లో ఉంటారన్నారు. సివిల్‌పోలీస్, ఏపిఎస్‌పి,ఎఆర్, ఎస్‌బి స్పాటర్స్, ఆక్టోపస్, విజిలెన్స్ సిబ్బంది ప్రత్యేక బృందాలు నాలుగుమాఢవీధుల్లో ,క్యూకాంప్లెక్స్‌లు, ఘాట్‌రోడ్డు,పార్కింగ్ ప్రాంతాల వంటి కీలక ప్రాంతాల్లో విస్తృతంగా నియమించడం జరుగుతుందన్నారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు బారీకేడ్లు ఏర్పాటు, డ్రోన్‌తో పర్యవేక్షణ, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సీనియర్ పోలీస్ అధికారులతో పర్యవేక్షణ ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో పోలీసు సిబ్బందికి ఒంటిపై ధరించే కెమెరాలు, ఆధునిక సమాచార వ్యవస్థ, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం ,భక్తులకు కేటాయించిన పార్కింగ్ ప్రాంతాల్లోనే వాహనాలనే నిలుపుదలచేయడం వంటివి పోలీసులు చేపడతారన్నారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులు పూర్తిగా గ్యాలరీల్లోకి ప్రవేశ నిష్క్రమణ మార్గాలను వినియోగించాలని ఎస్పీ సుబ్బరాయుడు కోరారు. బ్రహ్మోత్సవాల్లో 24వతేదీ సిఎం చంద్రబాబునాయుడు విచ్చేస్తుండటంతో భద్రత మరింత ఎక్కువగా ఉంటుందన్నారు. గరుడసేవరోజు తిరుమల ఘాట్‌లో ద్విచక్రవాహనాలను నిషేధం ఉంటుందన్నారు.

## రైతు సమస్యలపై చర్చించాలని శాసనమండలిలో వైఎస్సార్సీ సభ్యుల డిమాండ్

**- తిరస్కరించిన మండల చైర్మన్ మోషేన్ రాజు**

**సచివాలయం,సెప్టెంబర్ 18,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 48వ శాసనమండలి సమావేశం మొదటి రోజు గురువారం రాష్ట్ర శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు అధ్యక్షత ప్రారంభమైంది.ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో భాగంగా వైకాపా సభ్యులు తోట త్రిమూర్తులు, యల్లారెడ్డిగారి శివరా మిరెడ్డి,పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, రైతుల సమస్యలు,యూరియా కొరతపై ఇచ్చిన వాయిదా తీర్మానం తిరస్కరించబడిందని మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు తెలిపారు.రైతు సమస్యలపై మాట్లాడడానికి తాము ఎల్లప్పుడు సిద్దంగానే ఉన్నామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సభాముఖంగా తెలిపారు.

ప్రశ్నోత్తరాల్లో భాగంగా పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నల్లో గ్రామీణాభివృద్ధికి సంబంధించి గ్రామాలకు అనుసంధాన రోడ్లు,వాటిని అభివృద్ధి చేసే క్రమంలో రైతుల వాటాదారులుగా చేర్చే అంశం మరియు మరొక్క ప్రశ్న పంచాయితీరాజ్ కు సంబంధించి 2019-24మధ్య కాలంలో పారిశుధ్య వ్యవస్థ నిర్వహణ లోపాలు,ప్రస్తుత ప్రభుత్వం లో తీసుకొచ్చిన మార్పులకు సంబంధించిన ప్రశ్నలను వాయిదా వేయడం జరిగింది. బీద రవీంద్ర,కావలి గ్రీష్మ ప్రసాద్,పేరాబత్తుల రాజశేఖరంలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాల గురించి పూర్తి వివరాలు కోరగా,ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సమాధానమిస్తూ రాష్ట్రంలో 1143పిహెచ్‌సిలు ఉన్నాయని మరియు అదనంగా 88నూతన పిహెచ్‌సిలను మంజూరు చేశామని నిర్మాణ దశలో ఏ ఒక్క భవనం ఆగిపోలేదని వివరించారు రాజగొల్ల రమేష్ యాదవ్,కృష్ణ రాఘవ జయేంద్ర భరత్,కవురు శ్రీనివాస్‌లు 50ఏళ్ళ పింఛను పథకం గురించి 2024-25సంవత్సరానికి గాను విడుదల చేసిన నిధులు వివరాలు కోరగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వివరించారు.

# తిరుమల సమాచారం

## మరింత నాణ్యత పాటించండి

**- అన్నప్రసాదాలు రుచిగా ఉండాలి - టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్**



**తిరుమల,సెప్టెంబర్ 18ప్రభాతవార్తప్రతి నిధి:** మరింత నాణ్యతతో అన్నప్రసాదాలు ఉండేలా చూడాలని, రుచికరంగా తయారుచేయాలని టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ అన్నదానం విభాగం అధికారులను ఆదేశించారు. అన్నప్రసాదాలు తయారీలో నాణ్యత పాటించాలని, శుచిగా వుండాలని సూచించారు. గురువారం రాత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాల, అక్కడ సిబ్బంది తయారుచేస్తున్న వంటలు, శుభ్రతను గమనించారు. అనంతరం భక్తులు భోజనం చేస్తున్న హాల్‌కెళ్లి భక్తులతో మాట్లాడి అభిప్రాయాలను తీసుకున్నారు . అన్నప్రసాదాల నాణ్యత రుచిపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. బ్రహ్మోత్సవాల సమయంలో మరింతగా శుచిగా ఉండాలన్నారు.

## బ్రహ్మోత్సవ వైభవం దేదీప్యమానం



**తిరుమల,సెప్టెంబర్ 18ప్రభాతవార్తప్రతి నిధి:** కలియుగవైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ఆలయం సర్వాంగసుందరంగా సిద్ధమైంది. ఆలయం గోడలపై ముందువైపు శంఖుచక్రనామాలతో,పచ్చనిఅరటిపిల్లల తోరణాలతో భక్తులకు స్వాగతం పలికేలా విద్యుత్‌విభాగం అందంగా తీర్చిదిద్దారు. గురువారం రాత్రి విద్యుద్దీపకాంతుల ట్రయల్‌రన్‌లో ఆలయం దేదీప్యమానంగా కనువిందుచేసింది.

## వసతి సౌకర్యంలో లోటులేకుండా అధికారులు చూడాలి

**- విఐపిలకు ప్రోటోకాల్ విభాగాలు సమన్వయంతో పనిచేయాలి**
**- టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి**



**తిరుమల,సెప్టెంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో 24వతేదీ నుండి మొదలుకానున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో సామాన్యభక్తులకు వసతి సౌకర్యంలో అసౌకర్యం కలగకుండా చూడాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల్లో విఐపిలకు వసతిలో ప్రోటోకాల్ విభాగంతో సమన్వయంగా పనిచేయాలన్నారు. వసతికల్పన విభాగంపై గురువారం సాయంత్రం అన్నమయ్యభవనంలో టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, డిప్యూటీ ఇఒలు భాస్కర్, రాజేంద్ర, ఓఎస్‌డి సత్రానాయక్, విఎస్ఒ సురేంద్రతో కలసి ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తొమ్మిదిరోజులు బాధ్యతాయుతంగా విదులు నిర్వహించాలని, ముఖ్యంగా ఆలయంలో పనిచేసే ఉద్యోగులు మరింత భక్తిభావంతో, సేవాభావంతో విధులు నిర్వహించాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతి గదుల కేటాయింపు ప్రణాళికాబద్దంగా చూడాలన్నారు. అలాగే అన్నప్రసాదం భవనంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 24వతేదీ సిఎం పర్యటనతోబాటు మంత్రులు, ప్రముఖులు విచ్చేసే అవకాశం ఉన్నందున ప్రతి విభాగం అంకితభావంతో సేవలందించాలని అదనపు ఇఒ వెంకయ్యచౌదరి స్పష్టంగా నిర్ధేశించారు.

## తిరుమలలో అలజడులకు వైసిపి కుట్ర

**- బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి**



**తిరుమల,సెప్టెంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** బ్రహ్మోత్సవాల ఆరంభమయ్యే వేళ తిరుమల టార్గెట్‌గా వైసిపి అనవసర రాద్ధాంతం చేస్తుందని టిటిడి బోర్డుసభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి మండిపడ్డారు. శనీశ్వరుడి విగ్రహం వివాదం నేపథ్యంలో అలిపిరి పోలీస్‌స్టేషన్‌లో భూమనపై కేసు నమోదైందని, అయితే ఆయన విచారణకు గురువారం రావాల్సి ఉండగా 23వతేదీ వస్తానంటూ వెల్లడించడం దేనికి సంకేతమన్నారు. 24వతేదీ బ్రహ్మోత్సవాలు మొదలవుతున్నాయని, ఆరోజు సిఎం చంద్రబాబునాయుడు తిరుమలకు వస్తున్న నేపధ్యంలో అలజడులు జరిగే అవకాశం ఉందని ఆయన ఆరోపించారు. ఇలాంటి వాటిని వైసిపి మానుకోవాలని భానుప్రకాశ్‌రెడ్డి హితవు పలికారు.

## బాలాజీ ఆరోగ్యవరప్రసాదినికి రూ.10లక్షలు విరాళం



**తిరుమల,సెప్టెంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న ట్రస్ట్‌లు, పథకాల్లో బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని ట్రస్ట్‌కు ఓ దాత తనవంతు విరాళమందించారు.విజయనగరంకు చెందిన కృష్ణహరీశ్ ఈశ్వర్ భక్తుడు గురువారం ఉదయం 10లక్షలు రూపాయలు డిడిని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందజేశారు.ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డుసభ్యుడు భాను ప్రకాశ్‌రెడ్డి ఉన్నారు.

## భద్రతకే తొలి ప్రాధాన్యత

**- ఘాట్‌రోడ్లపై ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు - ప్రతిఒక్కరినీ తనిఖీలు చేయాల్సిందే - టిటిడి సివిఎస్ఒ మురళీకృష్ణ**



**తిరుమల,సెప్టెంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** దేవుని బ్రహ్మోత్సవాల్లో భద్రతకే తొలి ప్రాధాన్యత అని టిటిడి సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ స్పష్టం చేశారు. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిదిరోజులు ప్రతి ఒక్కరినీ నిశితంగా తనిఖీలు చేయాలని, ఆర్టీసి డ్రైవర్ల గుర్తింపు తనిఖీ తప్పనిసరి అని ఆయన ఆదేశించారు. అన్నమయ్యభవనంలో తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ కె.విజయశేఖర్, విజిలెన్స్ అధికారులతో కలసి సమన్వయ సమావేశం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భక్తుల రద్దీతోబాటు వాహనాలు భారీగా వస్తాయని, ఘాట్‌రోడ్లపై ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. కొండపై పార్కింగ్ ప్రాంతాలను నిర్దేశిస్తూ సూచికబోర్డులు పక్కాగా ఉండాలన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఎల్ఇడి కటౌట్లు, ఎల్ఇడి స్క్రీన్లు పటిష్టత తనిఖీచేయాలన్నారు. రద్దీనియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదిరోజులు వాహనసేవలను వీక్షించేందుకు వచ్చే భక్తులు పాదరక్షలు ధరించరాదని, లగేజీ తీసుకురావద్దని సివిఎస్ఒవిజ్ఞప్తి చేశారు.

వార్త

ఈ భూమ్మీద మనిషంత గొప్పవాడు ఎవడూ లేడు. మనిషిలో మెదడంత గొప్ప అవయవం మరొకటి లేదు.

-విలియం హామిల్టన్

# ప్రభుత్వ విద్యకు తగ్గుతున్న ఆదరణ

ఒకనాడు ఎంతో పవిత్రంగా భావించి ఆరాధించి పూజించిన విద్య రానురాను అంగడి సరుకుగా మారిపోతున్నది. ప్రస్తుతం విద్య ఒక వ్యాపార రూపం దాల్చింది. విద్యనే కాదు విద్యార్థులతోసహా ఏకంగా విద్యాసంస్థలను అమ్ముకునే దురదృష్టపు రోజులు దాపురించాయి. తాజాగా విస్తుపోయే విధంగా హైదరాబాద్ నగరంలో నడిబొడ్డున ఒక విద్యా సంస్థ ముసుగులో నడుస్తున్న డ్రగ్స్ తయారీ కేంద్రాన్ని అధికారులు కనుగొన్నారు. పగలు విద్యాబోధన చేస్తూ అదే పాఠశాలలో రాత్రివేళలో భారీ ఎత్తున మత్తుమందు తయారు చేస్తున్న ముఠా గుట్టురట్టు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్‌తోసహా మరికొందరిని ఈగల్‌టీమ్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. అందుకు సంబంధించిన లక్షలాది రూపాయలు విలువ చేసే డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు అక్కడికి చేరుకొని పాఠశాలను సీజ్ చేసి అక్కడ చదువుతున్న విద్యార్థులను ఇతర పాఠశాలల్లో చేర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దేశంలోని ఎన్నో ప్రాంతాలకు సరఫరా చేసినట్లు సమాచారం. విద్యాశాఖ అసమర్థతకు నిదర్శనంగా విద్యావ్యాపారం వింతపోకడలు తొక్కుతున్నది. బహుశా దేశంలోని పాఠశాల తరగతి గదుల పక్కనే ఏకంగా డ్రగ్స్ తయారీ కేంద్రాన్ని నెలకొల్పడం పోలీసు వర్గాలే విస్తుపోతున్నాయి. ప్రైవేట్‌రంగంలో విద్యావ్యాపారం వెర్రితలలు వేస్తుందనేందుకు ఇది పరాకాష్ఠగా చెప్పొచ్చు. విద్యాశాఖలో పటిష్టమైన చట్టాలున్నా, అమలు చేయగలిగే సామర్థ్యం ఉన్న పరిస్థితి రానురాను అగమ్యగోచరంగా మారుతున్నది. వాస్తవంగా చూస్తే ఒకనాడు ప్రభుత్వ పాఠశాలలే తప్పప్రైవేట్ బడులు లేవు. ఎక్కడో పట్టణాలు, నగరాల్లో నడిచేవి. వాటిల్లో కూడా వ్యాపార ధోరణులు కన్పించేవికావు. లాభనష్టాలతో సంబంధం లేకుండా కేవలం సేవాదృక్పథంతో విద్యాసంస్థలు సేవలు అందించేవి. నిర్వాహకులు సామాజిక బాధ్యతగా భావించి ఆ పాఠశాలలను నడిపేవారు. ఇక ప్రభుత్వరంగంలో కూడా ఆనాడో పాఠశాలలు అంతో ఇంతో పటిష్టంగా నడిచేవి. కానీ పరిస్థితులు మారిపోయాయి. పాలకుల అశ్రద్ధ, అరకొర నిధులు, అవినీతి, వీటన్నింటిని మించిన రాజకీయ జోక్యంతో విద్యాప్రమాణాలు నానాటికీ దిగజారిపోతున్నాయి. రాబోయే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బీదాబిక్కి జనం కూడా నాణ్యమైన విద్య ప్రైవేట్ పాఠశాలల్లోనే దొరుకుతుందనే నమ్మకంతో అవైపే అడుగులు వేస్తున్నారు. ఏమాత్రం ఆర్థిక వసతి లేనివారు, మరో దారిలేనివారు, విధిలేని పరిస్థితుల్లో ప్రభుత్వపాఠశాలల బాటపడుతున్నారు. గ్రామాల్లో కూడా ఈ ప్రైవేట్ విద్యావ్యాపారం విస్తరిస్తున్నది. అధికారుల రికార్డుల ప్రకారమే అంకెలు చూసినా ఆశ్చర్యం గొలిపే విషయాలు వెలుగు చూస్తున్నాయి. 2021-2022 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు ముప్పైలక్షల డెబ్బైఎనిమిదివేల నూటఎనభై తొమ్మిది మంది ఉండగా ప్రైవేట్ బడుల్లో ఇరవైఎనిమిది లక్షల అరవైఏడువేల ఐదువందల తొంభైఏడు మందిఉన్నారు. అయితే 2022-23 విద్యా సంవత్సరం నాటికి ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులసంఖ్య తగ్గి ప్రైవేట్ స్కూళ్లలో పెరిగిపోయింది. సర్కారు బడుల కంటే ప్రైవేట్ స్కూళ్లల్లో దాదాపు రెండులక్షల మందికి పైగా విద్యార్థులు అడ్మిషన్ తీసుకున్నారు. 2023-24 సంవత్సరంలో ప్రభుత్వస్కూళ్లలో చేరేవారి సంఖ్య మరింతగా తగ్గిపోయింది. సర్కారు బడుల్లో ఇరవైఆరు లక్షల ముప్పైఆరువేల ఆరువందల ముప్పైకి పరిమితం కాగా ప్రైవేట్ బడుల్లో ముప్పైనాలుగు లక్షలకుపైగా పెరిగిపోయింది. అంటే దాదాపు ప్రభుత్వ స్కూళ్ల కంటే ప్రైవేట్ స్కూళ్లలో ఏడు లక్షలకుపైగా ఎక్కువ మంది చేరారు. గత పదేళ్ల నుంచి పరిశీలించినా క్రమేపీ ప్రభుత్వ స్కూళ్లలో సంఖ్య తగ్గుతుంటే ప్రైవేట్ స్కూళ్లలో పెరిగిపోతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఎటువైపు దారిస్తుందో. ఎందుకు ఈ పరిస్థితి దాపురిస్తుందో? కారకులు ఎవరు? కారణాలు ఏమిటి? అనేది అటు అధికార వర్గాలకు కానీ,ఇటు పాలకులకు గాని తెలియంది కాదు. ప్రభుత్వ పథకాలు, ఆశయాలు కాగితాల వరకు బాగానే ఉంటున్నాయి. ఆచరణకు వచ్చేసరికి అసలు సమస్యలే కారణాలవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో యేటా వేలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు. ప్రభుత్వాలు బడిబాటంటూ పాఠశాలల్లో చేర్పించేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నా ఆశించిన మేరకు ఫలితాలు కన్పించడం లేదు. అన్నింటికంటే ముఖ్యంగా పాఠశాలల్లో కనీస వసతుల కొరత తీవ్రంగా కన్పిస్తున్నది. వేలాది ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉంటున్నట్లు సమాచారం. ప్రభుత్వ పాఠశాలల్లో మంచినీరు, మరుగుదొడ్ల వంటి కనీస వసతులు లేకపోవడంతో ప్రధానంగా బాలికలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా అందరికి విద్య అందించాలనే లక్ష్యం కను చూపు మేరలో కన్పించడంలేదు. దేశాభివృద్ధికే కాదు మానవ జాతి అభ్యున్నతికి విద్య పునాది అనేది నిర్వివాదాంశం. ఆరేళ్ల నుంచి పద్నాలుగేళ్ల బాలబాలలందరికీ ఉచిత విద్య అందించాలనే కార్యక్రమం పదేళ్లలో పూర్తి చేయాలని స్వాతంత్ర్యం రాగానే పెద్దలు నిర్ణయించిన సంకల్పం కాగి తాల్లోనే కన్నుమూసింది. ఇక డిపెప్, ఎపెప్, సర్వశిక్ష అభియాన్ వంటి కార్యక్రమాలు చేపట్టి దేశవ్యాప్తంగా లక్ష లాది కోట్ల రూపాయలు వెచ్చించారు, వెచ్చిస్తూనే ఉన్నారు. కానీ లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా పాల కులు కళ్లు తెరవాలి. బాలబాలికలను భావిపౌరులుగా తీర్చిదిద్దాల్సిన ప్రభుత్వరంగంలోని విద్యావ్యవస్థను ఇంతటి దారుణ పరిస్థితుల్లోకి నెట్టడం సమంజసం కాదు.

బుద్ధిహీనులూ, మృతులూ మాత్రమే తమ అభిప్రాయాలను మార్చుకోకుండా ఉంటారు.



లోవెల్

మహామేధస్సులో అనేదేదీ లేదు. మహామేధస్సు అంటేశ్రమ, నైపుణ్యంల సమాహారమే.



లియో టాల్‌స్టాయ్

# ప్రజావాక్కు



### బకాయిల వెంటనే చెల్లించాలి

కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిపైనే అయిపోయినప్పటికీ ఉద్యోగులకు రావలసిన బకాయిలు,పి.ఆర్.సి., మధ్యంతర భృతి వాటి గురించి స్పందించటం లేదు. జీతాలు సకాలంలో చెల్లిస్తామని ఎన్నికల వాగ్దానాన్ని మాత్రమే అమలు చేస్తున్నారు. ఇప్పటికే ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు అనేక రీతులలో ప్రభుత్వానికి తెలియజేసినప్పటికీ నిష్ప్రయోజనమే అయినది. ఈ నేపథ్యంలో పలు ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు వివిధ రీతులలో నిరసన కార్యక్రమాలు కూడా ప్రారంభించారు. ఈఅసంతృప్తి ముదిరి పాకాన పడక ముందే కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి ఉద్యోగులకు ఇవ్వవలసిన కనీసం రెండు డిఏలను ప్రకటించి మధ్యంతర భృతి,పి.ఆర్.సి. కమిషన్ గురించి ఒక స్పష్టత ఇవ్వవలసినదిగా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు.

- పారేపల్లి సత్యనారాయణ, దేవులపల్లి, ఏలూరు జిల్లా

### పోస్టుల సర్దుబాటు అన్యాయం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల వ్యవస్థలో పాత కళాశాలలలో ఆనాడు ఉన్న డిమాండుననుసరించి ఒక్కొక్క సబ్జెక్టుకు మూడేసి నాలుగేసి పోస్టులు మంజూరై విద్యార్థులకుసంపూర్ణ విద్యనందించే వెసులుబాటు కల్పించారు. తరువాత కాలంలో వచ్చిన నూతన కళాశాలలను మంజూరైతే చేసారుగాని,పోస్టులు మంజూరు చేయలేదు. ప్రక్క కళాశాలల నుంచి సిబ్బందిని డెప్యుటేషన్ ద్వారా అసంపూర్తి బోధనతో కాలం వెళ్ల బుచ్చేవారు. ఇటువంటి కళాశాలలలో పోస్టులు మంజూరు చేయవలసిన బాధ్యత ఉంది. కానీ పాత కళాశాలలలోనున్న మంజూరు పోస్టులను అదనంగా ఉన్నాయనే నెపంతో నాన్శాంక్షన్ కళాశాలలలో సర్దుబాటు చేసారు. ఇది బాధాకరం.

- డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

### పోస్టులను భర్తీ చేయాలి

ఆంధ్రప్రదేశ్ జూనియర్ కళాశాలలో పూర్వకాలంలో లైబ్రేరియన్ పోస్టు జూనియర్ లెక్చరర్ ఇన్ లైబ్రరీ సైన్స్‌గా మార్చారు. జోన్ రెండు జోన్‌మూడులలో షెడ్యూల్డ్ ట్రైబ్ కేటగిరీలో రెండుపోస్టులు నింపడానికి నోటిఫికేషన్ ఇచ్చారు. జోన్ వన్‌లో కూడా ఖాళీలున్నాయి క్యారీ ఫార్వర్డ్ పోస్టులను ఓపెన్ క్యాటగిరిగా మార్చాలి.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### సభలకు రాకుంటే రాజీనామా చేయాలి

'నో వర్క్ నో పే' అనే పదం కార్మిక వర్గాలకు వర్తిస్తుంది. ఎన్నుకోబడిన రాష్ట్ర అసెంబ్లీ పార్లమెంటు సభ్యులకు ఈ రూలు ఎందుకు అమలు చేయడం లేదు. వీరందరు విధిగా సెషన్సు జరుగుతున్నన్ని రోజులు సభలకు తప్పని సరిగా హాజరై ప్రజా సమస్యల మీద చర్చలు జరిపి అవసరమయితే చట్టాలు చేసి ప్రజలకు సేవ చేయాలి. అటువంటి బాధ్యతను ప్రజలు ఓటేసి కట్టబెడితే చట్ట సభలకు రాకపోతే సభా మర్యాదను అగౌరవ పరిచినట్లతుంది. వీరికి ఇబ్బడి ముబ్బడిగా జీతభత్యాలు నాగా లేకుండా ముడుతున్నాయి. పనిచేయకుండా జీతాలు తీసుకోవడం సిగ్గుపడాల్సిన విషయం.సభలకు హాజరు కాకూడదని నిర్ణయించు కున్నట్లయితే తమ సభ్యత్వానికి రాజీనామా చేయాలి. దీనికోసం పార్లమెంటులో చట్టం చేయాలి. ఈ దిశగా సుప్రీం కోర్టు కూడా స్పందించి తగు సలహాలను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలి. పాలకులలో క్రమశిక్షణ లోపిస్తే పాలితులు సంఘ వ్యతిరేకులవుతారు.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### పారదర్శకత పెరిగితేనే మార్పు సాకారం

సీఎం ప్రకటించిన కొత్త విద్య విధానం పట్ల రాష్ట్ర ప్రజల్లో ఆసక్తి కలగడం సహజం. విద్యారంగం దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే ప్రధానాధారం. కాబట్టి కొత్తవిధానం రూపకల్పనలో విద్యార్థుల అవసరాలు, ఉపాధ్యాయుల సమస్యలు, తల్లిదండ్రుల ఆశలు అన్నీ ప్రతిబింబించాలి. నేటి పరిస్థితుల్లో విద్యార్థులకు పుస్తక జ్ఞానం మాత్రమే కాకుండా జీవిత నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం,సృజనాత్మకత,నైతికవిలువలు కూడా అవసరం. కొత్తవిధానం ఈఅంశాలపై దృష్టిసారిస్తేనే ప్రయోజనం.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### వాటర్ షెడ్ పథకం

నీటిసౌకర్యం లేని ప్రాంతాలలో లేక వర్షాధారంపైన ఆధారపడి వ్యవసాయం చేసే ప్రాంతాలలో వర్షపు నీటిని ఒడిసి పట్టి తద్వారా పంటలు పండించడం పంట ఉత్పాదకత పెంచడం పంట సాంద్రత పెంచడమే లక్ష్యంగా వాటర్ షెడ్ పథకం ప్రవేశపెట్టారు ఆ కోణంలో చూస్తే భారత దేశంలోని భూ పరివేష్టిత రాష్ట్రాలు గిరిజన జనాభా ఆధారపడి చేసే పోడు వ్యవసాయ రాష్ట్రాలు ఈశాన్య భారత రాష్ట్రాలు అన్నింటికీ ఇది ఒక జీవధారం లాగా పనిచేస్తుంది. దీనివల్ల వాతావరణ సమతుల్యం కాపాడుకోవడంతో పాటు పంటల వైవిధ్యం కూడా సాధ్యం.

-భారత అవినాష్, జనగామ

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# భారత్ వ్యూహంతో ట్రంప్ దారికొచ్చేనా?

**చైనాతో స్నేహం భారత్‌కి ముఖ్యం. చైనాకు భారత్ స్నేహ హస్తం అందిస్తుంది. ఇక రష్యాతో ఇప్పటికే ఉన్న బంధాన్ని మరింతగా పెంచుకొని ఇరుదేశాల వాణిజ్యాన్ని మరింతగా విస్తరించాలని భావిస్తుంది. భారత్ మెతక దేశం సుంకాల పెంపుద్వారా భారత్‌ను దారికి తెచుకోవచ్చు అని భావించిన ట్రంప్‌కు షాంగై సదస్సు ద్వారా భారత్ అంటే ఏమిటో తెలిసివచ్చింది. ఇక ఏళ్ల తరబడి చైనా అండతో భారత్ పైకి ఉగ్రవాదని ప్రోత్సహిస్తున పాకిస్థాన్‌ను చైనాతో స్నేహ సం బంధాలు పెంచుకోవడం ద్వారా ఆదేశాన్ని ఒంటరి చేయడం అనేది మరొకవ్యూహం. చైనా,భారత్ ప్రపంచంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన దేశాలు. రెండు దేశాల మార్కెట్ పరిధి ప్రపంచ మార్కెట్‌లో సుమారు 50 శాతం.అనూహ్యంగా భారత్ మరియు చైనా దేశాలమధ్య స్నేహం చిగురించింది. ఇప్పుడు చైనా అమెరికాను అడ్డుకట్టవేయాలంటే తప్పకుండా భారత్ సహకారం అవసరం. ఇటు భారత్‌కు కూడా చైనాతో స్నేహం తప్పనిసరి. కానీ చైనా గతఅనుభవాలను దృష్టిలో ఉంచుకొని భారత్ మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి.**



డాక్టర్ రామకృష్ణ బండారు

ఎన్నో సంవత్సరాల నుండి భారత్‌కు మిత్రదేశంగా వ్యవహరిస్తున్న అమెరికా, డోనాల్డ్ ట్రంప్ రెండవ సారి అధ్యక్ష బాధ్యతలు చెప్పటినప్పటి నుండి భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది. గత ఆరు నెలలుగా అమెరికా అధ్యక్షుడుడోనాల్డ్ ట్రంప్ భారత్‌పై వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ భారత్‌ను ఇరుకున పెట్టె ప్రయత్నం చేస్తున్నాడు. గతంలో, తమ మధ్య వాణిజ్యాన్ని2030 నాటి కల్లా 500 బిలియన్ డాలర్లకు చేర్చాలని భావించిన ఇరు దేశాలు ట్రంప్ తీరుతో ఆ లక్ష్యాలను పక్కన పెట్టాయి. చైనా, రష్యా, దక్షిణాఫ్రికా వ్యవస్థాపక సభ్యులుగా ఉన్న బ్రిక్స్ కూటమిలో భారత్ సభ్యత్వం కలిగినందుకు పదిశాతం సుంకాలు, రష్యానుంచి భారత్ చమురు కొనుగోలు చేయడానికి జరిమానాగా మరో 25 శాతం సుంకాలు, ఇలా భారత్ ఎగుమతులపై సుంకాలను మొత్తంగా 50శాతానికి పెంచి భారత్ ఆర్థిక వ్యవస్థను బలహీనపరచడంతో పాటు ఇరు దేశాల మధ్య ఉన్న దౌత్య సంబంధాలకు ఆటంకం కలిగేలా ట్రంప్ వ్యవహరిస్తున్నాడు. భారత్ ఫార్మా,సాఫ్ట్‌వేర్ రంగాల ఎగుమతులపై కూడా 200 శాతం సుంకాలు విధించాలని భావిస్తున్నాడు. భారత్ చైనాతో చీకటి ఒప్పందం చేసుకున్నట్లుగా, భారత్‌ను తాము విడిచిపెట్టినట్లుగా ప్రకటించాడు. ఇలా భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతూ, పాకిస్థాన్‌కు దగ్గరవుతున్న డోనాల్డ్ ట్రంప్ భారత్‌ను వత్తిడికి గురిచేసి తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని చూస్తున్నాడు. ఎప్పుడూ శాంతి, సహనం కోరుకొనే భారత్ మాత్రం ఈసారి దెబ్బకు దెబ్బ అన్నట్లుగా వ్యవహరిస్తోంది. ట్రంప్ సుంకాల పెంపు బెదిరింపులకు ఏ మాత్రం భయపడక, చలించక తన వ్యూహాత్మక ఎత్తుగడలతో భారత్ ట్రంప్‌కు చెక్ పెట్టేందుకు సిద్ధం అయింది. అందులో భాగంగానే 50 శాతం సుంకాల పెంపు ప్రకటన తరువాత భారత్ ప్రధాని యు.కె‌లో పర్యటించి భారత్ యూ.కే మధ్య స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నాడు. తాజాగా ఎస్.సి.ఓ సదస్సు కోసం చైనాలో పర్యటించి చైనాకు దగ్గరయేందుకు పావులు కదుపుతుంది. కేవలం చైనాతోనే కాకుండా అటు రష్యా, జపాన్ దేశాలతోనూ బంధాన్ని బలపర్చుకునే విధంగా ప్రయత్నాలు చేస్తుంది. ఇన్నాళ్లు భారత్ శాంతి సహనాలను చుసిన అగ్రరాజ్యం ఇప్పుడు భారత్ వ్యూహాత్మక 'దౌత్య తంత్రాని' చూసి తట్టుకోలేకపోతుంది. అందుకే, భారత్ తమకు మిత్ర దేశం, భారత్‌తో వాణిజ్య చర్చలకు మేము సిద్ధం అని ఇటీవల ట్రంప్ ప్రకటించాడు. ఇటు పాకిస్థాన్ కూడా భారత్ చైనా రష్యా దేశాధినేతల కలయికను చూసి తట్టుకోలేక పోయింది. చైనాతో స్నేహం, రష్యాతో బంధం బలోపేతంతో ట్రంప్‌ను ఏకాకిని చేసి పాకిస్థాన్‌ను కూడా ఇరుకునపెట్టే 'వ్యూహం'తో భారత్ ముందుకు పోతుంది. అసలు ట్రంప్ భారత్ పై ఎందుకు కక్ష కట్టాడు? ఒక వైపు భారత్‌తో వాణిజ్య చర్చలుంటాయి అంటూనే మరోవైపు జి 7 కూటమిపై కూడా భారత్ పై సుంకాలు పెంచేలా ఒత్తిడి ఎందుకు తెస్తున్నాడు? భారత్ వ్యూహంతో ట్రంప్ దిగి వస్తాడా? చైనాతో స్నేహబంధం మంచిదేనా? భారత్ సహాయసహకారాలు లేకుండా పెద్దన్న పాత్రపోషించగలడా? అనేవి ఇప్పుడు ఆసక్తి కలిగిన అంశాలు. భారత్‌తో అమెరికాకు భారీ వాణిజ్య లోటు ఉన్నదని, ఫలితంగా అమెరికా నష్టాలను చవిచూస్తున్నది అనేది ట్రంప్ ముఖ్య వాదన. కానీ వాస్తవాలను పరిశీలిస్తే ట్రంప్ నిజస్వరూపం తెలుస్తుంది. అమెరికాకు చైనాతో 295.4 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు ఉన్నది. యూరోపియన్ యూనియన్‌తో 235. 6 బిలియన్ డాలర్లు, మెక్సికోతో 157.2 బిలియన్ డాలర్లు, వియాత్నంతో 113.1 బిలియన్ డాలర్లు, కెనడాతో 54.8 బిలియన్ డాలర్ల వాణిజ్యలోటు ఉన్నది. ఇక భారత్ విషయానికి వస్తే



కేవలం 45.8 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు ఉన్నది. వాణిజ్యలోటు ఎక్కువగా ఉన్న చైనాపై మొదట 50 శాతం సుంకాలను విధించాడు. చైనా ప్రతీకార సుంకాలకు దిగడంతో 50శాతం నుండి 30శాతానికి తగ్గించాడు.ఇక ఈ యూపై 15శాతం, ఇలా వాణిజ్య లోటు ఎక్కువగా ఉన్న ఇతర దేశాలపై తక్కువ శాతం పన్నులు విధించి భారత్‌పైమాత్రం 50 శాతం విధిస్తున్నాడు. వస్తువుల వాణిజ్యంలో అమెరికాకు లోటు ఉన్నప్పటికీ, సేవల వాణిజ్యంలో అమెరికాకు లాభం ఉన్నది. ఐటి. సాఫ్ట్‌వేర్, బి పి ఓ సేవలు భారత్ అమెరికాకు చేస్తుంది. ఒక సాఫ్ట్‌వేర్ తయారు చేయడానికి అమెరికాలో అయ్యే ఖర్చుతో పోలిస్తే,భారత్‌లో కేవలం 50 శాతం తక్కువ ధరకు తయారు చేసి అమెరికాకు ఎగుమతి చేస్తున్నారు. ఫలితంగా అక్కడి కంపెనీలకు బిలియన్ డాలర్ల మేర లాభాలు వస్తున్నాయి. టిసిఎస్ ఇన్ఫోసిస్,విప్రో వంటి భారత్ కంపెనీలు సాఫ్ట్‌వేర్ డెవలప్మెంట్, క్లౌడ్ సర్వీసెస్, డేటా అనలిటిక్స్ వంటి సేవలను అతి తక్కువ ఖర్చుతో అమెరికా కంపెనీలకు ఎగుమతి చేస్తున్నాయి. భారత్ ఐటి సపోర్ట్‌తోనే అక్కడి బ్యాంకింగ్, డిజిటల్ మార్కెటింగ్ ఇతర రంగాలలో సేవలు అందించగలుగుతున్నాయి. కానీ ట్రంప్ ఒక్క ఉత్పతుల లోటును మాత్రమే పదేపదే చెప్పున్నాడు. ట్రంప్‌కు ఇవన్నీ తెలియనివి కావు. కానీ ట్రంప్ వ్యక్తిగత విషయాలలో భారత్ సపోర్ట్ చేయడం లేదనే కారణంతో ఇదంతా చేస్తున్నాడు. నిన్నటివరకు భారత్‌కు మిత్ర దేశంగా ఉన్న అమెరికా, ట్రంప్ అనూహ్య నిర్ణయాలతో ఒక్కసారిగా భారత్‌కు శత్రు దేశంగా మారిపోయింది. అయితే భారత్ తన సిద్ధాంతాలైన శాంతి, సహనాన్ని పాటిస్తూనే, అమెరికాకు చెక్‌పెట్టేందుకు అడుగులు వేస్తుంది. అమెరికా సుంకాల పెంపుతో వాటిల్లే నష్టాలను పూడ్చడంకోసం ఇతర దేశాలలో మార్కెట్ పెంచుకునేలా స్వేచ్ఛవాణిజ్య ఒప్పందాలను చేసుకుంటుంది. దానిలో భాగంగానే ఇటీవల యూకేతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటుంది. అలాగే యూరోపిన్ దేశాలలో సైతం మార్కెట్‌ను పెంచుకునేలా దౌత్యసంబంధాలు నడుపుతుంది. ముఖ్యంగా అమెరికా ఆధిపత్యానికి అడ్డుకట్ట వేసేందుకు త్రిశూల వ్యూహం అమలు చేస్తున్నది. అందులో భాగంగా,మొదటిది చైనాకు దగ్గరవడం, రష్యాతో బంధాన్ని బలోపేతం చేయడం ద్వారా ఇరు దేశాలతో దౌత్య,వాణిజ్య సంబంధాలు పెంచుకోవడం. రెండవది చైనా రష్యాలతో భారత్ చేతులు కలపడం ద్వారా భారత్‌పై ట్రంప్ ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయడం. ఇక మూడవది చైనా అండతో భారత్ పై కాలు దువ్వుతున్న పాకిస్థాన్‌ను చైనా నుండి దూరం చేయడం. ఇలా ట్రంప్ సుంకాల దెబ్బదుకు భరత్ దీటుగా, వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. ముందుగా, శత్రువుకి శత్రువు మనకి మిత్రుడు అన్నట్లుగా అమెరికాకు ఎప్పటి నుండో కొరకరాని కొయ్యగా ఉన్న చైనాతో దౌత్య వాణిజ్య సంబంధాలు పెంచుకునేలా అడుగులు వేస్తుంది. ప్రస్తుత పరిస్థితులలో భారత్‌తో చేయి కలపడం చైనాకు సైతం అత్యవసరం.చైనాతో ఇప్పటికే భారత్‌కు భారీవాణిజ్య లోటు ఉన్నది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 14.25 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను చైనాకు భారత్ ఎగుమతి చేయగా, 113.5 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను చైనా నుండి దిగుమతి చేసుకుంది. 2003-04 చైనాతో భారత్‌కు వాణిజ్య లోటు1.1బిలియన్ డాలర్లుగాఉండగా ప్రతుతం 99.2బిలియన్ డాలర్లకు చేరుకుంది.కాబట్టి, చైనాతో స్నేహం భారత్‌కి ముఖ్యం. చైనాకు భారత్ స్నేహ హస్తం అందిస్తుంది. ఇక రష్యాతో ఇప్పటికే ఉన్న బంధాన్ని మరింతగా పెంచుకొని ఇరుదేశాల వాణిజ్యాన్ని మరింతగా విస్తరించాలని భావిస్తుంది. భారత్ మెతక దేశం సుంకాల పెంపుద్వారా భారత్‌ను దారికి తెచుకోవచ్చు అని భావించిన ట్రంప్‌కు షాంగై సదస్సు ద్వారా భారత్ అంటే ఏమిటో తెలిసివచ్చింది. ఇక ఏళ్ల తరబడి చైనా అండతో భారత్ పైకి ఉగ్రవాదని ప్రోత్సహిస్తున పాకిస్థాన్‌ను చైనాతో స్నేహ సంబంధాలు పెంచుకోవడం ద్వారా ఆదేశాన్ని ఒంటరి చేయడం అనేది మరొకవ్యూహం. చైనా,భారత్ ప్రపంచంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన దేశాలు. రెండు దేశాల మార్కెట్ పరిధి ప్రపంచ మార్కెట్‌లో సుమారు 50 శాతం.అనూహ్యంగా భారత్ మరియు చైనా దేశాలమధ్య స్నేహం చిగురించింది. ఇప్పుడు చైనా అమెరికాను అడ్డుకట్టవేయాలంటే తప్పకుండా భారత్ సహకారం అవసరం. ఇటు భారత్‌కు కూడా చైనాతో స్నేహం తప్పనిసరి. కానీ చైనా గతఅనుభవాలను దృష్టిలో ఉంచుకొని భారత్ మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. ●

# వివిధ శాఖలను అనుసంధానించడం అత్యవసరం!

చిందం మధు

మనదేశంలో ఎన్నో మెట్రోపాలిటన్ నగరాలు, మరెన్నో నగరాలున్నాయి. ఇన్ని నగరాలు ఉన్నా కూడా మనదేశంలో ప్రణాళిక బద్ధమైన నగరం మాత్రం చండీగఢ్ ఒక్కటే. మన దేశంలో ప్రణాళిక బద్ధమైన నగరాలు లేకపోవడానికి కారణాలను వెతికినప్పుడు ఒక కారణం మాత్రం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. అదే విద్యుత్ విభాగం, రోడ్డు రవాణావిభాగం, పట్టణ సుందరీకరణ,ఫారెస్ట్ విభాగం లాంటి విభాగాల మధ్య సమన్వయం లేకపోవడం మనకు ప్రధాన కారణంగా తెలుస్తుంది. మనదేశంలో అన్ని విభాగాలు కూడా వాటి పరిధిలో అవి పనిచేస్తాయి. కానీ ఒక విభాగానికి మరొక విభాగానికి మధ్య సమన్వయలేమి మనకు కనిపిస్తుంది. మనదేశంలో అన్నివిభాగాలు కూడా నిరంతరంగా పనిచేస్తూనే ఉంటాయి. ఉదాహరణకు రోడ్డు, రవాణా వ్యవస్థ అనేది పాత రోడ్లను పునరుద్ధరించి కొత్త రోడ్లను వేయడం, కొత్తగా రోడ్లను విస్తరించడం లాంటి పనులు చేస్తాయి. విద్యుత్ విభాగం కూడా దేశానికి వెలుగును అందించడానికి నిరంతరంగా కృషి చేస్తుంది. అందుకు ఈవిభాగం 24 గంటలు సేవలు అందించడం జరుగుతుంది. వీరు ముఖ్యంగా వర్షాకాలంలో ఎంతో అప్రమత్తతతో పనిచేయాల్సి ఉంటుంది. కరెంటు వైర్లు వర్షానికి తెగిపడితే వాటిని బాగు చేయడం, కరెంటు స్తంభాలు కూలితే వాటి స్థానంలో మరొకటి పునరుద్ధరించడం లాంటి పనులు చేస్తారు. అంతేకాకుండా సంవత్సరం పొడుగునా కొత్తగా కరెంటు వైర్లువిస్తరించడం, పాత వాటిని పునరుద్ధరించడం వీరి పని. వీరు మన దేశంలో ముఖ్యంగా, మన రాష్ట్రంలో చాలాచక్కగా పని చేస్తున్నారు. దాని ఫలితమే 24గంటల నిరంతర విద్యుత్.ఇంకాఅత్యంత ముఖ్యమైన విభాగం మనదేశంలో అటవీ విస్తీర్ణం 33శాతం ఉండేందుకు కృషి చేస్తున్న విభాగం అటవీ విభాగం (నగర సుందరీకరణ హెచ్ఎండిఏ, జిహెచ్ఎంసి హైదరాబాద్లో అయితే వీటి పరిధిలోకి వస్తాయి) వారు కూడా తమ పనిలో పూర్తిగా నిమగ్నమై పనిచేస్తారు. అందులో భాగంగానే మీరు ప్రతి వర్షాకాలంలో మొక్కలునాటే ప్రక్రియను ప్రారంభిస్తారు. ఈ మూడు విభాగాలను విడిగా చూసినప్పుడు మనకు అంతా బాగానే కనిపిస్తుంది. ఇక ఈ విభాగాల అనుసంధానం ఎందుకని అనిపిస్తుంది.కానీ అసలు సమస్య ఇక్కడే ఉంది. వర్షాకాలంలో అటవీశాఖ (నగర సుందరీకరణ విభాగం) వారు రోడ్లకు ఇరువైపులా మొక్కలనునాటుతారు. అవి వర్షాలకు పెద్దగా కూడా అవుతాయి. ఈ మొక్కలను రోడ్లకు ఇరువైపులా మాత్రమే నాటితే ఎటువంటి సమస్య ఉండదు. కానీ వారు చెట్లు నాటేది కరెంటు వైర్ల కింద, స్తంభాల మధ్య ప్రభుత్వాలు నాటిన మొక్కలు వేపుగా తొందరగా పెరిగి చెట్లుగా మారుతాయి.ఈ విద్యుత్ సిబ్బంది వారు సంవత్సరం లేదా రెండు సంవత్సరాలు తిరిగే లోపు ఎండాకాలంలో ఆ చెట్ల తలలను నరికి వేస్తారు. ఇక ఇంతటితో ఆగకుండా రోడ్డు రవాణా విభాగం వారు రోడ్ల విస్తరణ పనుల్లో భాగంగా ఆ చెట్లను వేళ్లవరకు తొలగిస్తారు. అంతేకాకుండా ఈ రోడ్ల విస్తరణ పనుల్లో భాగంగా పనులకు అంతరాయం కలిగించే విద్యుత్ స్తంభాల కరెంట్ సరఫరాను నిలిపివేస్తారు విద్యుత్ శాఖ వారు. కానీ ఆ స్తంభాలను అక్కడి నుంచి తొలగించడం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారు. ఈ రోడ్ల రవాణా విభాగం వారు ఆ స్తంభాలను రోడ్డుకు మధ్యలోనే ఉంచి అలాగే ఆ రోడ్డును విస్తరిస్తారు. ఆ స్తంభం కారణంగా ప్రమాదాలు జరిగాక తీరికగా వచ్చి అప్పుడు విద్యుత్ శాఖ వారు ఆ స్తంభాన్ని అక్కడి నుంచి తొలగిస్తారు. ఈ అన్ని శాఖలు కూడా వారి పరిధిలో పడి పనిచేస్తున్నాయి. కానీ ప్రభుత్వం, ఆయాశాఖలు అనుకున్న లక్ష్యాలను సాధిస్తున్నాయా అనే ప్రశ్నకు సమాధానం మాత్రం లేదు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో మొక్కలను నాటడం, విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు చెట్ల కొమ్మలను నరకడం, రోడ్ల విస్తరణంలో భాగంగా మొత్తం చెట్లనే తొలగించడం ఇది నిరంతర ప్రక్రియగా మారింది. ప్రతి సంవత్సరం ఇన్ని మొక్కలు నాటడం, పర్యావరణం కోసం ప్రభుత్వం ఇంత కృషిచేస్తుంది. తీరా చూస్తే నాటిన మొక్క చెట్టు అయ్యేలోపు ఆయా విభాగాల సమన్వయలేమికి బలి అవుతుంది. ఎటువంటి ప్రతిఫలం లేకుండా వృధా అవుతున్న ధనం ప్రజలదేకదా. ఆ ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ఉండాలి అంటే ఆయా శాఖలను అత్యవసరంగా అనుసంధానించి, ప్రజల సొమ్మును కాపాడటానికే మేమున్నాం అని చెప్పుకునే పాలకులు తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాల్సిన అవసరం కచ్చితంగా ఉంది. ●

# బాలికల పౌష్టికాహారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

కామిడి సతీష్ రెడ్డి

ఆరోగ్యమే మహా భాగ్యం కస్తూర్బా విద్యాలయాల్లో (కేజీబీవీ) చదివే బాలికలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు కస్తూర్బా విద్యాలయాలను దేశవ్యాప్తంగా కేంద్రం నిర్వహిస్తున్నది. వీటి నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటుంది. అయితే ఇటీవల కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో చదివే బాలికల ఆరోగ్యంపై ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో బాలికలు పౌష్టికాహారలోపంతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తేలింది. దీంతో ప్రభుత్వం బాలికలకు చదువుతోపాటు మంచి పోషకాహారం అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు గురుకుల విద్యాలయాల్లో మాదిరిగానే కేజీబీవీల్లో కూడా మెస్ చార్జీలను పెంచి విద్యార్థుల ఆహార మెనూలో మార్పులు చేసింది. గతంలో కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో చదివే ఒక్కో విద్యార్థికి మెస్ చార్జీల కింద 1,225 రూపాయలు అందించగా, ఇప్పుడు దీన్ని 1,740రూపాయలకు పెంచారు. అంటే గతంలో కంటే 515 రూపాయలు మెస్ చార్జీలు పెంచారు. పాఠశాలలు ప్రారంభమైన నుంచే కొత్త మెనూ అమల్లోకి తీసుకువచ్చింది. దీని ప్రకారం కేజీబీవీ బాలికలు ఈ ఏడాది నుంచి కొత్త వంటలు రుచి చూస్తున్నారు. కొత్త మెనూ ప్రకారం నెలలో రెండుసార్లు మాంసాహారం, వారంలో ఐదుసార్లు గుడ్లు, ప్రతిరోజూ నెయ్యి వడ్డిస్తారు. కొత్త ఆహార మెనూ రూపొందించిన ప్రభుత్వం దీన్ని అమలుచేసే బాధ్యతను విద్యాశాఖకు అప్పగించింది.ప్రభుత్వ ఆదేశాలతో విద్యాశాఖ అధికారులు కొత్త మెనూ అమలు పరుస్తున్నారు. సమర్థవంతంగా అమలు చేయడానికి కొత్త వంటకాల తయారీపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అక్కడ శిక్షణ పొందిన వారితో జిల్లాలోని మిగితా వారందరికీ ప్రాంతాల వారీగా వంటకాల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ పథకాన్ని అమలు చేసేందుకు స్కూళ్ల ప్రారంభం నుంచే పర్యవేక్షించాలని ఉన్నతాధికారులకు ప్రభుత్వం ఆదేశించింది. మారిన మెనూ పాఠశాలల పునఃప్రారంభమైన రోజు నుంచే అమల్లోకి వచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రతిరోజు మారే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఉదాహరణకు ఉదయం అల్పాహారం కింద సోమవారం ఉప్మా పెడితే మరుసటి రోజు



ఇతర వంటకాల్లో ఏదైనా ఒకదాన్ని వడ్డిస్తారు. ఇలా రోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి వివిధ రకాల రుచులతో వంటకాలు అందిస్తారు. కొత్తగా రూపొందించిన ఆహార పట్టిక విద్యాలయాల్లో నోటీసు బోర్డుపై పెట్టి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే బాలికల తల్లిదండ్రులకు కూడా దీనిపై శిక్షణ ఇచ్చారు. జిల్లాల విభజన తర్వాత కొత్తగా ఏర్పాటైన మండలాల్లోనూ కేజీబీవీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సుమారు లక్షలాదికి పైగా విద్యార్థులు వివిధ పాఠశాలల్లో చదువుతున్నారు. ప్రస్తుతం కొత్త విద్యార్థుల ప్రవేశాలు కొనసాగుతున్నందున ప్రవేశాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. కస్తూర్బా విద్యాలయాల్లో ప్రతి ఏటా ప్రవేశాల సంఖ్య పెరుగుతూ వస్తుంది. మెనూలో ఉదయం ఉప్మా, జీరా రైస్, పులిహోరా, టమాట కిచిడీ, రాగి జావ, సాంబారు. బూస్టు, పూరి, బోండా, వడ, చపాతి,అరటిపండు. మధ్యాహ్నం టమాట పప్పుతో అన్నం,నెయ్యి,రసం,పెరుగు, ఉడకబెట్టిన గుడ్డు, చికెన్. సాయంత్రం పకోడి, ఉడకబెట్టిన శనగలు, ఎగ్‌బజ్జీ, బెల్లంపట్టీలు, అల్లం చాయ్, మిల్లెట్ బిస్కెట్లు.రాత్రివేళ వివిధ రకాల కూరలతో అన్నం, మజ్జిగ, సాంబారు. రాష్ట్ర ప్రభుత్వం కస్తూర్బా పాఠశాలల్లో కొత్త మెనూ అమలు చేయడం వరకు బాగానేఉన్నా ఆయా పాఠశాలల్లో వంట చేస్తున్న వారికి వేతనాల పెంపుపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదని వంట కార్మికులు వాపోతున్నారు. ఒక్కో పాఠశాలలో సుమారు నాలుగు,నుంచి ఐదుగురు వంట మనుషులు పనిచేస్తున్నారు.వారికి ఒక్కొక్కరికి నెలకు 9,500 రూపాయాలు చెల్లిస్తున్నారు. ఈ వేతనం తమ కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోవడం లేదని వాపోతున్నారు. దీనికితోడు కేజీబీవీల్లో కొత్త మెనూ అమలుతో తమకు మరింత భారం పెరిగిందని వాపోతున్నారు.ఇప్పటికే ఉదయం నుంచి రాత్రివరకు పాఠశాలల్లో పని చేస్తున్నామని కొత్తగా అమల్లోకి తెచ్చిన మెనూతో మరింత భారంగా మారనుందని వంట మనుషులు వాపోతున్నారు. పనికి తగ్గ వేతనం కింద తమకు నెలకు 20వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. రాష్ట్ర ప్రభుత్వం కస్తూర్బా విద్యాలయాల్లో కొత్త మెనూ అమలుకు చర్యలు తీసుకుంది. బాలికలకు పౌష్టికాహారం అందించేందుకు రూపొందించిన మెనూ అన్ని పాఠశాలల్లో పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థుల చదువుతో పాటు మెరుగైన భోజనం అందించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఏ ఒక్కరూ పోషకాహార లోపం లేకుండా ఆరోగ్యంగా ఉండేందుకు చదువులో ముందు ఉండేందుకు ప్రభుత్వం కేజిబివిల బలోపేతానికి కృషి చేస్తుంది. ●

# కుంభవృష్టితో ఉత్తరాఖండ్ అతలాకుతలం



## నాలుగు గ్రామాల్లో 30 ఇళ్లు పైగా ధ్వంసం
## 20 మందికి గాయాలు, 14 మంది గల్లంతు
## తృటిలో తప్పించుకున్న ఎంపి అనిల్ బలూనీ

**డెహ్రాడూన్, సెప్టెంబరు 18:** ప్రకృతి విలయంతో ఉత్తరాఖండ్ అల్లాడుతున్నది. చమోలి జిల్లాలో కొండచరియలు విరిగిపడ్డాయి. నాలుగు గ్రామాల్లో 30కు పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయి. 20 మంది గాయపడగా 14 మంది గల్లంతయ్యారు. శిథిలాల కింద వారు చిక్కుకుని ఉంటారని అనుమానిస్తున్నారు.
గురువారం భారీ వర్షం కారణంగా వరదలు సంభవించాయి. దీంతో చమోలి జిల్లాలోని నాలుగు గ్రామాల్లో కొండ చరియలు విరిగిపడ్డాయి. 30కుపైగా ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఈ నేపథ్యంలో సుమారు 20 మంది గాయపడ్డారు. 14 మంది జాడ కనిపించడంలేదు. దీంతో అదృశ్యమైన వ్యక్తులు శిథిలాల కింద చిక్కుకున్నట్లు అనుమానిస్తున్నారు.
కాగా, జాతీయ, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళాలు ప్రభావిత ప్రాంతాలకు చేరుకున్నాయని ఉత్తరాఖండ్ సిఎం పుష్కర్ సింగ్ ధామి తెలిపారు. సహాయక చర్యలు కొనసాగుతున్నా యని చెప్పారు. తలకు గాయమైన చిన్నారితో సహా తీవ్రంగా గాయపడిన వారిని హెలికాప్టర్ ద్వారా రిషికేశ్‌లోని ఎయిమ్స్‌కు తరలించినట్లు వివరించారు. ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు వెల్లడించారు.

**తృటిలో తప్పించుకున్న బిజెపి ఎంపీ**
డెహ్రాడూన్ రోడ్డుపైనా కొండచరియలు విరిగిపడ్డాయి. అదే రహదారిపై కాన్వాయ్‌లో వెళ్తున్న బిజెపి ఎంపీ తృటిలో తప్పించుకున్నారు. ఆ రోడ్డుపై కొండచరియలు విరిగిపడిన వీడియో క్లిప్‌ను ఆయన షేర్ చేశారు. ఉత్తరాఖండ్‌లో ఈ సంఘటన జరిగింది. గర్వాల్ బిజెపి ఎంపీ అనిల్ బలూనీ చమోలి, రుద్రప్రయాగ్‌లోని వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. ఆ తర్వాత రిషికేశ్‌కు వెళ్లిన ఆయన తన కాన్వాయ్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. దేవ్ ప్రయాగ్ సమీపంలోని బద్రీనాథ్ జాతీయ రహదారిపై కొండచరియలు విరిగిపడటాన్ని బిజెపి ఎంపీ అనిల్ గమనించారు. వెంటనే తన కాన్వాయ్‌ను నిలిపివేశారు. వాహనం నుంచి దిగిన ఆయన మిగతావాహనదారులను అప్రమత్తం చేశారు. ఇంతలో భారీగా కొండచరియలు ఆ రహదారిపై విరిగిపడ్డాయి. ఇది చూసి బిజెపి ఎంపీ అనిల్ కూడా భయాందోళన చెందారు. అక్కడి నుంచి దూరంగా వెళ్లారు. తన వాహనాలను వెనక్కి మళ్లించారు. మరోవైపు బిజెపి ఎంపి ఈ భయానక అనుభవాన్ని సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ వీడియో క్లిప్‌ను ఎక్స్‌లో షేర్ చేశారు. 'ఈ సంవత్సరం ఉత్తరాఖండ్‌లో సంభవించిన తీవ్రమైన వర్షాలు, కొండచరియలు విరిగిపడటం చాలా మందికి లోతైన గాయాలను మిగిల్చాయి. వాటిని నయం చేయడానికి చాలా సమయం పడుతుంది. నిన్న సాయంత్రం, విపత్తు ప్రభా విత ప్రాంతంలో కొండచరియలు విరిగిపడిన భయానక దృశ్యాన్ని మీ అందరితో పంచుకుంటున్నా' అని పేర్కొన్నారు. ఉత్తరాఖండ్ ఎదుర్కొంటున్న తీవ్రమైన ప్రకృతి వైపరీత్యం గురించి ఇది చాలా చెబుతుందని అనిల్ బలూనీ తెలిపారు. సవాల్‌తో కూడిన పరిస్థితుల్లో రోడ్లపై పేరుకుపోయిన కొండ చరియల శిథిలాలు తొలగిస్తున్నకార్మికుల అంకిత భావంతో పాటు అధికారులందరినీ అభినందిస్తున్నట్లు వెల్లడించారు.



# ఓట్ల తొలగింపు ఆన్‌లైన్‌లో అసాధ్యం

**అదంతా నిరాధార ప్రచారం: స్పష్టం చేసిన కేంద్ర ఎన్నికల సంఘం**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** సాఫ్ట్‌వేర్ వాడి ఓట్లను తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీచేసిన విమర్శలను కేంద్రఎన్నికల సంఘం ఖండించింది. అదంతా నిరాధార, అసత్య ప్రచారమని వెల్లడించింది. ఆన్‌లైన్ వేదికగా ఓట్లను తొలగించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వ కుండా ఏ ఒక్కరిఓటు తొలగించడం లేదు. ఆన్ లైన్‌లో మరెవరూ తొలగించలేరు. 2023లో అలంద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల తొల గింపునకు విఫల ప్రయత్నాలు జరిగాయి. ఆ వ్యవహారంపై దర్యాప్తు కోసం ఎన్నికల సంఘమే ఫిర్యాదు చేసింది. రికార్డుల ప్రకారం అలంద్ అసెంబ్లీకి 2018లో జరిగిన ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి విజయం సాధించారు. 2023లో కాంగ్రెస్ నేత బిఆర్ పాటిల్ గెలుపొందారు అని ఇసి వెల్లడించింది. రాహుల్ తప్పుడు సమాచా రాన్ని ప్రచారం చేస్తున్నారని బిజెపి దుయ్య బట్టింది. రాహుల్‌కు రాజ్యాంగం, చట్టం అర్థం కావడంలేదు. 2014 నుంచి మోడీజీ సాధిస్తున్న విజయాలన్నీ నిజం కాదని ఆయన ఆరోపిస్తు న్నారు. ఈ వ్యాఖ్యలు దేశ ప్రజలకు, ఓటర్లకు అవమానం. ఆయన బాంబు గురించి మాట్లాడు తున్నారు. ఈ ప్రకటలను తీవ్రంగా ఖండిస్తున్నాను అని మాజీ కేంద్రమంత్రి రవిశంకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. హైడ్రోజన్ బాంబు పేలుస్తామని కాంగ్రెస్‌వాళ్లు అంటున్నారు. ఆ బాంబ్ ఇలాగే ఉంటుందా? వాళ్లు ఓటమిని చవిచూస్తున్నారు. ఈ సమయంలో వారు చేయాల్సింది దానిని అంగీకరించడం. కష్టపడి మీస్థాయికి వస్తామనేలా వారిమాటలుఉండాలి. అంతేకానీ దానికిబదులుగా వారు కోర్టుల జోక్యాన్ని కోరు కుంటున్నారు. లేకపోతే వేరొకరిపై నిందలు వేస్తున్నారు అని ఢిల్లీ మంత్రి మజీందర్ సింగ్ సిర్సా మండిపడ్డారు. బంగ్లాదేశ్, నేపాల్ తరహా అశాంతి భారత్‌లో సృష్టించారని రాహుల్ భావిస్తున్నారని కమలం పార్టీ నేత అనురాగ్ ఠాకూర్ విమర్శించారు. రాహుల్‌నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దాదాపు 90ఎన్నికల్లో ఓటమి చవిచూసిందని, దాంతో ఆయనఅసహనం రోజురోజుకూ పెరుగుతోందని ఎద్దేవా చేశారు. క్షమాపణలు కోరడం, కోర్టుమందలింపులు ఆయనకు పరిపాటిగా మారాయని అన్నారు.



## కష్టకాలంలో నేపాల్‌కు సంపూర్ణమద్దతు ఇస్తాం
## ప్రధాని సుశీల కర్కికి ప్రధాని మోడీ భరోసా

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** కష్టకాలంలో ఉన్న పొరుగుదేశం నేపాల్‌కు భారత్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హామీ ఇచ్చారు. ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ నూతన ప్రధానిగా నియమితులైన సుశీల కర్కితో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణ ఎంతో ఆత్మీయంగా, భరోసా ఇచ్చేదిగా జరిగిందని ప్రధాని మోదీ తెలిపారు. ఇటీవల నేపాల్‌లో జరిగిన నిరసనలు, సంభవించిన ప్రాణనష్టం పట్ల ప్రధాని మోదీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సమయంలో నేపాల్‌కు అండగా నిలుస్తామని, అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. నేపాల్‌లో శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించేందుకు సుశీల కర్కి చేస్తున్న ప్రయత్నాలకు భారత్ పూర్తి అండదండలు అందిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ సంభాషణ వివరాలను ప్రధాని మోదీ స్వయంగా 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. "నేపాల్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాని సుశీల కర్కితో ఆత్మీయంగా మాట్లాడాను. ఇటీవల జరిగిన ప్రాణనష్టంపై నా ప్రగాఢ సానుభూతిని తెలియజేశాను. శాంతి, స్థిరత్వాన్ని నెలకొల్పే ఆమె ప్రయత్నాలకు మా సంపూర్ణ మద్దతు ఉంటుందని మరోసారి హామీ ఇచ్చాను" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. అదేవిధంగా, శుక్రవారం జరగనున్న నేపాల్ జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సుశీల కర్కికి, నేపాల్ ప్రజలకు ప్రధాని మోడీ ముందుగానేశుభాకాంక్షలు తెలియజేశారు.

## పెన్సిల్వేనియాలో కాల్పులు.. ముగ్గురు పోలీసులు మృతి

**పెన్సిల్వేనియా (యుఎస్), సెప్టెంబరు 18:** అమెరికాలో మరోసారి కాల్పుల మోత మోగింది. పెన్సిల్వేనియాలో జరిగిన ఒకదారుణ ఘటనలో ముగ్గురు పోలీసు అధికారులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు అధికారులు తీవ్రంగా గాయపడ్డారు. గృహ హింసకు సంబంధించిన ఒక కేసు విచారణ కోసం వెళ్లిన వారిపై ఓ దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో నిందితుడు కూడా హతమయ్యాడని అధికారులు తెలిపారు. పెన్సిల్వేనియాలోని కొడొరస్ టౌన్‌షిప్‌లో ఈ విషాదం చోటుచేసుకుంది. ఒక రోజు క్రితం ప్రారంభమైన కేసు విచారణలో భాగంగా పోలీసులు అక్కడికి వెళ్లారని స్టేట్ పోలీస్ కమిషనర్ క్రిస్టోఫర్ పారిస్ తెలిపారు. "ఇది గృహ హింసకు సంబంధించిన కేసు. విచారణలో భాగంగా వెళ్లిన అధికారులపై దాడి జరిగింది" అని ఆయన మీడియాకు వివరించారు.

## అన్ని మతాలను గౌరవిస్తా
### - చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** నిజజీవితంలోనే కాకుండా వృత్తిపరంగా కూడా తాను అన్ని మతాలను గౌరవిస్తానని సిజెఐ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. ఖజురహో ఆలయ సమూహంలో ఉన్న విష్ణు దేవుడి విగ్రహానికి చెందిన వివాదంపై స్పందిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద ఖజురహో ఆలయ సమూహంలో ఉన్న జవారి టెంపుల్‌లో ఏడు అడుగుల విష్ణుమూర్తి విగ్రహం ఉన్నది. అయితే ఆ విగ్రహాన్ని ధ్వంసం చేశారని, దాని స్థానంలోమరో విగ్రహాన్ని ప్రతిష్టించాలని సుప్రీంకోర్టులో పిల్ వేశారు. ఆ పిల్‌పై మంగళవారం వాదనలు జరిగాయి. ఆ సమయంలో చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. రాకేశ్ దలాల్‌అనేవ్యక్తి పిటీషన్‌వేశారు. మొఘల్ రాజులకాలంలో డ్యామేజ్ అయినవిగ్రహాన్ని తొలగించి కొత్తవిగ్రహాన్ని ఏర్పాటుచేయాలని కోరారు.

# డ్రగ్స్‌ఎక్కువ ఉన్న దేశాల్లో భారత్‌ను చేర్చిన అమెరికా!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణాకు ప్రధాన కేంద్రాలుగా ఉన్న దేశాల జాబితాను అమెరికా విడుదల చేసింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికా కాంగ్రెస్‌కు సమర్పించిన అధికారిక నివేదికలో మొత్తం 23 దేశాల పేర్లను వెల్లడించారు. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఈ జాబితాలో భారత్‌తో పాటు పొరుగు దేశాలైన చైనా, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బర్మా కూడా ఉన్నాయి. తమ దేశంలోకి అక్రమంగా ప్రవేశిస్తున్న మాదకద్రవ్యాల ముప్పును ఎదుర్కొనేందుకు కట్టుబడి ఉన్నామని ట్రంప్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ జాబితాలో ఉన్న ఇతర దేశాలలో మెక్సికో, కొలంబియా, వెనిజులా, బొలీవియా, ఈక్వెడార్, పెరూ, పనామా, కోస్టారికా, జమైకా, లావోస్ వంటి దేశాలు ఉన్నాయి. అయితే, ఈ జాబితాలో ఒక దేశం పేరు ఉండటం అనేది ఆ దేశ ప్రభుత్వ వైఫల్యాన్ని సూచించదని అమెరికా తన నివేదికలో స్పష్టం చేసింది. భౌగోళిక, వాణిజ్య, ఆర్థిక కారణాల వల్ల కొన్ని దేశాలు మాదకద్రవ్యాల రవాణాకు అనుకూలంగా మారతాయని, అందుకే వాటిని ఈ జాబితాలో చేర్చినట్లు తెలిపింది.
ప్రభుత్వాలు డ్రగ్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఈ పరిస్థితి ఉండొచ్చని పేర్కొంది. గత 12 నెలలుగా మాదక ద్రవ్యాల నియంత్రణ ఒప్పందాలను పాటించడంలో, చర్యలు తీసుకోవడంలో 'దారుణంగా విఫలమైన' దేశాలుగా ఆఫ్ఘనిస్థాన్, బొలీవియా, బర్మా, కొలంబియా, వెనిజులా పేర్లను ట్రంప్ ప్రత్యేకంగా ప్రస్తావించారు.
ఇటీవల భారత నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) పనితీరును భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం ప్రశంసించడం గమనార్హం. ఓ అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాను ఎన్‌సీబీ ఛేదించిన నేపథ్యంలో 'అక్రమ మాదక ద్రవ్యాల నుంచి అమెరికన్లను రక్షించడంలో, వారి ప్రాణాలను కాపాడటంలో సహాయం చేస్తున్నందుకు భారత ఎన్‌సీబీకి ధన్యవాదాలు" అని అమెరికా ఎంబసీ పేర్కొంది. ఈక్రమంలో ఇపుడు తాజా జాబితాలో భారత్ పేరు రావడం చర్చనీయాంశం అయింది.



## ఓట్ల తొలగింపునకు సాఫ్ట్‌వేర్ వాడుతున్నారు
### -కాంగ్రెస్ అగ్రనేత రాహుల్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు18:** కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి పట్టున్న ప్రాంతాల నుంచి ఓట్లను తొలగించారని విమర్శించారు. రాష్ట్రం వెలుపలి నుంచి నకిలీ లాగిన్లు, ఫోన్ నెంబర్లను ఉపయోగించి ఓటర్ ఐడిలను తొలగించినట్లు వ్యాఖ్యానించారు. సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి కేంద్రీకృత పద్ధతిలో ఈ చర్యలకు పాల్పడినట్లు ఆరోపించారు. ఈ మేరకు ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ ఓట్ల తొలగింపు అంతా వ్యక్తులతో గాకుండా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి చేస్తున్నారు. అదంతా ఒక ప్రక్రియ ప్రకారం జరుగుతోంది. ప్రతిపక్షాలకు ఓట్లు వేసే కమ్యూనిటీలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇందుకు సంబంధించి మేం 100 శాతం ఆధారాలను గుర్తించాం. నేను ఈ దేశాన్ని, రాజ్యాంగాన్ని ప్రేమిస్తున్నాను. ఈ ప్రజాస్వామ్య ప్రక్రియను ఇష్టపడతాను. ఈ ప్రక్రియను నేను రక్షిస్తున్నాను. ఇక దీనికి ఎలా స్పందించాలనేది మీ చేతుల్లోనే ఉంటుంది. కర్ణాటకలోకి అలంద్‌లో ఆరువేల ఓట్లను తొలగించే ప్రయత్నం జరిగింది అని విమర్శించారు. అలాగే ఓట్ల చోరీకి పాల్పడేవారిని ఎన్నికల సంఘం చీఫ్ రక్షిస్తున్నారని, ఈ వ్యవహారంపై విచారణ జరపాలన్న అభ్యర్థనలను విస్మరిస్తున్నారని అన్నారు. ఇది హైడ్రోజన్ బాంబు కాదని, దానిని త్వరలో పేలుస్తానని వెల్లడించారు.

# హిండెన్‌బర్గ్ ఆరోపణలపై ఆదానికి సెబీ క్లీన్‌చిట్!



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** ఆదానిగ్రూప్ సంస్థలపై అమెరికాకు చెందిన షార్ట్‌సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్‌రీసెర్చ్ చేసిన ఆరోపణల్లో ఆధారాలు లేవని, ఎలాంటి నంబంధనలు ఉల్లంఘించిందన్న ఆరోపణలపై హిండెన్‌బర్గ్ ఆధారాలు చూపించలేకపోయిందనిసెబీ క్లీన్‌చీట్ ఇచ్చింది. ప్రత్యేకించి ఆదానిగ్రూప్ ఛైర్మన్ గౌతమ్ ఆదాని, గ్రూపు కంపెనీలపై హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలు నిరాధారమని సెబీ తేల్చిచెప్పింది. 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆదాని మరో మూడు కంపెనీలు షేర్ల లావాదేవీలకు సంబంధించి పలు అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఆరోపించింది. ఆదికార్ప్ ఎంటర్‌ప్రైజెస్, మైల్‌స్టోన్‌ట్రేడ్‌లింక్స్, రెహావార్ ఇన్‌ఫ్రా సంస్థలద్వారా ఆదానిగ్రూప్‌లోకి నిధులను మళ్లిస్తోందని ఆరోపించింది. సెబీ గురువారం జారీచేసిన రెండు ఉత్తర్వుల్లోనూ ఎలాంటి నిబంధనల ఉల్లంఘనలు జరగలేదని ధృవీకరించింది. సంస్థ నిర్వహించిన సంబంధంలేని పార్టీలతో ఉన్న డీల్స్‌ను సంబందం ఉన్న పార్టీల డీల్స్‌గా పరిగణించలేమని, 2021లో వచ్చిన సవరణల తర్వాత నిర్వచనం కూడా మారిందని సెబీ వెల్లడించింది. అన్ని రుణాలను కూడా తిరిగి చెల్లించారని, నిదులు సమీకరణ ఎందుకోసం చేసారో వాటికి మాత్రమే సెబీ వినియోగించిందని సెబీ తన నివేదికలో వెల్లడించింది. అందువల్ల ఆదాని గ్రూప్‌పై చేపట్టిన అన్ని విచారణలను నిలిపివేస్తున్నట్లు సెబీ ప్రకటించింది.
సెబీ ఉత్తర్వులపై ఆదాని ఛైర్మన్ గౌతమ్ ఆదాని స్పందించారు. హిండెన్‌బర్గ్ ఆరోపణలు నిరాధారమని సెబీ ఉత్తర్వులతో నిర్ధారణ అయిందని పేర్కొంటూ సెబీ తీర్పును స్వాగతించారు. విషప్రచారంచేసిన వారు దేశానికి క్షమాపణలు చెప్పాలని కోరారు. సత్యమేవ జయతే, జైహింద్ అంటూ ఆయన తన ఎక్స్ ఖాతలోపోస్టుచేసారు. జాతికి సేవలందించడంలో రాజీలేని మార్గంలోనే ముందుకువెళతామని, భారత్‌లో మాసంస్థలు అందుకు ప్రతీకగా నిలుస్తాయని గౌతమ్ ఆదాని అన్నారు.



## సంక్షిప్తంగా..


### అమెరికాలో ట్రంప్ పసిడి విగ్రహం!

**వాషింగ్టన్, సెప్టెంబరు 18:** అమెరికా చట్టసభల భవనం క్యాపిటల్ ఎదురుగా ట్రంప్ బంగారు విగ్రహం ఏర్పాటుపై అమెరికాతోపాటు ప్రపంచదేశాల్లోను ఆసక్తిపెరిగింది. కొందరు ఈ చర్యపై విమర్శలు కూడా గుప్పిస్తున్నారు ట్రంప్ చేతిలో క్రిప్టో కరెన్సీ ఉన్నట్టు 12 అడుగుల ఎత్తు ఉండేలా ఈ విగ్రహాన్ని డిజైన్ చేశారు. దీని కోసం క్రిప్టోకరెన్సీ పెట్టుబడిదారులు నిధులు సమకూర్చారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేటును 25 బేస్ పాయింట్ల మేర తగ్గించిన నేపథ్యంలో విగ్రహం ఏర్పాటు ఆసక్తికరంగా మారింది. దీన్ని చూసేందుకు జనాలు తండోపతండాలుగా తరలివస్తున్నారు. డిజిటల్ కరెన్సీ భవిష్యత్తు, రిజర్వ్ బ్యాంకుల విత్త విధానాలు, ఆర్థిక రంగ మార్కెట్‌లో ప్రభుత్వం పాత్ర తదితర అంశాలపై జనాల్లో అవగాహన, చర్చను ప్రారంభించేందుకు ఈ విగ్రహం ఏర్పాటు చేసినట్టు క్రిప్టో ఇన్వెస్టర్లు కొందరు పేర్కొన్నారు.

### పాక్-సౌదీ మధ్య కీలక రక్షణ ఒప్పందం

**రియాద్, సెప్టెంబరు 18:** దాయాది పాకిస్థాన్, సౌదీ మధ్య కీలక రక్షణ ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సౌదీ అరేబియా పర్యటనలో ఉన్న పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆ దేశ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వ్యూహాత్మక రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. రెండు దేశాల్లో దేనిపైన అయినా దాడి జరిగితే అది ఇద్దరిపైనా జరిగిన దాడిగా భావిస్తారు. అప్పుడు రెండు దేశాలూ దాడి చేసిన దేశంపై పోరాడేలా ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్-భారత్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఈ ఒప్పందం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఒప్పందంపై భారత్ తాజాగా స్పందించింది. ఈ ఒప్పందం పరిణామాలను అర్థం చేసుకునేందుకు అధ్యయనం చేస్తున్నట్లు పేర్కొంది. జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి, అన్ని రంగాల్లో సమగ్ర జాతీయ భద్రతను నిర్ధారించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించింది.

### ఎయిర్ ఇండియా ప్రమాదం.. బోయింగ్‌పై అమెరికాలో దావా



**న్యూయార్క్, సెప్టెంబరు 18:** అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిం డియా విమానప్రమాదం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈఘటనలో మృతులకు సంబంధించిన నాలుగు కుటుంబాలు విమాన తయారీ సంస్థ బోయింగ్‌పై అమెరికాలో దావావేశాయి. ఈ పిటిషన్‌లో విడిభాగాల తయారీ సంస్థ హనీవెల్ పేరునుకూడా చేర్చాయి. ఈ మేరకు ఆ కుటుంబాలు మంగళవారం దాఖలు చేసిన ఈ దావాలో.. ఇంధన స్విచ్‌లు లోపభూయిష్టంగా ఉండటం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపించాయి. 787 డ్రీమ్‌లైనర్ విమానం డిజైన్, దాని విడిభాగాల అభివృద్ధి సమయంలోనే లోపాలు వారికి తెలు సని.. అయినా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదని పేర్కొన్నారు. 'ఇంధన సరఫరా, విమాన థ్రస్ట్‌నియంత్రణకు సంబంధించిన డిజైన్‌లో లోపంఉంది' అని బాధిత కుటుంబాలు ఆరోపించాయి. అంతేకాక.. అకస్మాత్తుగా వచ్చిపడే ప్రమాదాలను నిలువరించేందుకు ఆ రెండు సంస్థలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదన్నాయి. స్విచ్‌లకు తనిఖీలు, మరమ్మతులు అవసరమని విమానాయాన సంస్థలను హెచ్చరించలేదన్నారు.

### వైష్ణోదేవి యాత్ర పునఃప్రారంభం

**డెహ్రాడూన్, సెప్టెంబరు 18:** భారీ వర్షాలు, వరదలతో తీవ్ర ఆటంకాలు ఎదుర్కొన్న శ్రీ మాతా వైష్ణోదేవి యాత్ర ఈ రోజు తిరిగి ప్రారంభమైంది. ప్రతికూల వాతావరణం కారణంగా బుధవారం నిలిపివేసిన యాత్రను, వాతావరణం మెరుగుపడటంతో అధికారులు పునరుద్ధరించారు. దీంతో భక్తులు, స్థానిక వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు. గురువారం ఉదయం 6 గంటల నుంచే యాత్రకు భక్తులను అనుమతించారు. బేస్ క్యాంప్ నుంచి ఆలయం వరకు అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చినట్లు శ్రీ మాతా వైష్ణో దేవి పుణ్యక్షేత్ర మండలి అధికారులు తెలిపారు. పొగమంచు కారణంగా తాత్కాలికంగా నిలిచిపోయిన హెలికాప్టర్ సేవలను కూడా తిరిగి ప్రారంభించారు. తొలిరోజే 3,500 మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని, ఉదయం నుంచి భక్తుల రాక నిరంతరాయంగా కొనసాగుతోందని వారు వెల్లడించారు.

# ఎంపి కంగనా దక్షిణాదికి వస్తే చెంపదెబ్బకొట్టాలి!



## డిఎంకె నేత అళగిరి వ్యాఖ్యలపై దుమారం

**చెన్నై, సెప్టెంబరు 18:** బిజెపి ఎంపీ కంగనారనౌత్ దక్షిణాదికి వస్తే చెంపదెబ్బ కొట్టాలని అళగిరి అన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలపై పలువురు మండిపడుతున్నారు. అయితే, రూ.100 చెల్లిస్తే మహిళా కార్యకర్తలను నిరసనల్లోనే పాల్గొనేందుకు నియమించుకో వచ్చంటూ కంగనా గతంలో చేసిన ప్రకటనపై అళగిరి స్పందించారు. ఈ సందర్భంగా మండి ఎంపీపై విరుచుకుపడ్డారు. బిజెపి ఎంపీ అహంకారంతో మాట్లాడుతుందని విమర్శించారు. ఆమె దక్షిణాది రాష్ట్రాల సందర్శనకు వస్తే అదే సమయంలో ఆమెను చెంపదెబ్బ కొట్టాల్సిందేనంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గతంలో ఇలాంటి వ్యాఖ్యలు కంగనా గతంలో చేసిందని గుర్తుచేశారు. ఢిల్లీ విమానాశ్రయంలో ఓ మహిళా సిఐఎస్‌ఎఫ్ సిబ్బంది ఆమెను చెంపదెబ్బ కొట్టిన విషయాన్ని గుర్తు చేశారు. రైతుల ఉద్యమాన్ని ఉద్దేశించి కంగనా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా చెంపదెబ్బ కొట్టిందని, అవమానించే వ్యాఖ్యలు చేస్తే ఎవరికైనా ఆగ్రహం వస్తుందని అళగిరి తెలిపారు.
ఈసారి దక్షిణాదికివస్తే మరిచిపోకుండా కంగనాను చెంపదెబ్బ కొట్టాల్సిందేనని అప్పుడే ఆమెకు తప్పు తెలిసివస్తుందన్నారు. కాగా అళగిరిచేసిన వ్యాఖ్యలపై కంగనారనౌత్ స్పందించింది. భారత్‌లో ఎక్కడికైనా వెళ్లవచ్చని ఎవరూ ఆపలేరన్నారు. ద్వేషించేవారు కొందరుంటే ప్రేమించే వారు చాలా మందే ఉన్నారన్నారు. వరద బాధితులను కలిసేందుకు వెళ్లిన ఆమె ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. అళగిరి వ్యాఖ్యలపై స్పందించారు. తమిళనాడు సీఎం తలైవి జయలలిత పాత్రను సినిమాలో పోషించానని కానీ ఓటింగ్ సమయంలో సభలో ఉన్న ప్రతిపక్ష ఎంపీలు కూడా వరుసలో వెళ్తుండగా తనను తలైవి అని సంబోధించారన్నారు. మహిళలపై ఇలాంటి అగౌరవకరమైన వ్యాఖ్యలు చేయకూడదని ఇది ప్రజలకు తప్పుడు సందేశాన్ని పంపుతుందన్నారు.
ఇదిలా ఉండగా.. కులు జిల్లాలోని మనాలి సబ్ డివిజన్‌లోని సోలాంగ్, పాల్చన్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఇక్కడ తన రెస్టారెంట్ ఉందని ఇక్కడ కేవలం రూ.50 వ్యాపారం మాత్రమే జరిగిందని రూ.15లక్షలు జీతాలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. బియాస్ నది ఉప్పొంగుతున్నందున సోలాంగ్ గ్రామంలో కొండ చరియలు విరిగిపడే ప్రమాదం ఉందని స్థానికులు ఎంపీకి తెలిపారు.

# శబరిమల ఆలయం స్వర్ణాభరణ వివాదంపై విజిలెన్స్ దర్యాప్తు




**తిరువనంతపురం, సెప్టెంబరు 18:** కేరళలోని ప్రసిద్ధ శబరిమల ఆలయంలో విగ్రహాల బంగారు పూతపూసిన తాపడాలను అనుమతి లేకుండా తొలగించడం ఇటీవల వివాదాస్పదమైంది. తాజాగా ఇందుకు సంబంధించిన మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విగ్రహాల తాపడాలపై బంగారం బరువు తగ్గడాన్ని కేరళ హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. దీనిపై విజిలెన్స్ కమిటీ దర్యాప్తు చేపట్టాలని న్యాయస్థానం ఆదేశించింది. శబరిమలలో గర్భగుడి ముందు ఉన్న ద్వారపాలక విగ్రహాలపై బంగారు పూత పూసిన రాగి తాపడాలను 2019లో మరమ్మతుల నిమిత్తం తొలగించారు. వాటిని సరి చేయించి కొత్త బంగారు పూత తాపడాలను అందిస్తానని ఉన్నికృష్ణన్ అనే దాత తీసుకెళ్లారు. ఈ పనిని చెన్నైలోని ఓ సంస్థకు అప్పగించారు. 2019లో వాటిని తొలగించే సమయంలో తాపడాల బరువు 42.8 కిలోలుగా ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. అయితే ఆ తాపడాలను తమ వద్దకు తెచ్చినప్పుడు బరువు 38.28 కిలోలు మాత్రమే ఉందని సదరు కంపెనీ తెలిపింది. అంతేగాక ఆలయం నుంచి తాపడాలను తొలగించిన దాదాపు 40 రోజుల తర్వాత వాటిని చెన్నైలోని కంపెనీకి అందించినట్లు తెలిసింది. ఈ పరిణామాలపై తాజాగా కోర్టు అనుమానం వ్యక్తం చేసింది. ఉన్నట్లుండి తాపడాల బరువు 4.524 కేజీలు తగ్గడాన్ని తీవ్రంగా పరిగణించింది. వీటిని తిరిగి అమర్చినప్పుడు ఎందుకు బరువును సరిచూడలేదని ప్రశ్నించింది. ఈ తగ్గుదలకు ఏకైక కారణంగా బంగారు పూత తగ్గడమే అని న్యాయస్థానం అభిప్రాయపడింది. లేదంటే దాత వాటి స్థానంలో మరో తాపడాల సెట్‌ను కంపెనీకి ఇచ్చే అవకాశం కూడా ఉన్నట్లు పేర్కొంది. ఇందులో లోపాలు కనిపిస్తున్నాయని, బరువు ఎలా తగ్గిందో తెలుసుకునేందుకు విజిలెన్స్ కమిటీ దర్యాప్తుకు ఆదేశించింది. ఇందుకు సహకరించాలని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డుకు సూచించింది. దీనిపై మూడు వారాల్లోగా నివేదికను అందచేయాలని స్పష్టం చేసింది. అనంతరం ఈ కేసు విచారణను సెప్టెంబర్ 30వ తేదీకి వాయిదా వేసింది.

# రసవత్తరంగా ఆరంభమైన శాసనసభా సమావేశాలు

### న- ప్రశ్నోత్తర సమయం, జీరో అవర్‌లపై మంత్రుల శ్రద్ధ పెట్టడం లేదంటూ స్పీకరు అసహనం

### - సభకు హాజరుగాని వైసిపి శాసనసభ్యులు, సమావేశాలకు వస్తే మాట్లాడేందుకు సమయం ఇస్తామన్న స్పీకర్

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాత వార్తప్రతినిధి:** ఏపీ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి.సభకు వైకాంగ్రెస్ పక్ష ఎంఎల్ఏలు హాజరు కాలేదు.శాసనసభ ప్రశ్నోత్తర సమయంతో ప్రారంభమైంది. అనుసరణగా జీరో అవర్‌ల సాగింది.పలు అంశాలపై ఈ సందర్భంగా ఎంఎల్ఏ, మంత్రుల నడుమ రసవత్తరమైన సంభాషణ చోటు చేసుకుంది.జీరో అవర్‌లో సమస్యలపై తగిన ఆసక్తి మంత్రుల్లో కన్పించడంలేదనే విమర్శలు సభ్యుల నుంచి వెల్లువెత్తాయి. ఒక శాసనసభలో ప్రశ్నోత్తరాలను స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేపట్టారు. గురువారం తొలి రోజు సమావేశంలో జీరో అవర్‌పై మంత్రులు, అధికారులపై స్పీకర్ అయ్యన్న అసహనం వ్యక్తం చేసారు. జీరో అవర్‌లో ఎమ్మెల్యేలు మాట్లాడితే ఎవరూ నోట్ చేసుకోవట్లేదేనని స్పీకరు వ్యాఖ్యానించారు. జీరో అవర్‌లో లేవనెత్తిన అంశాలపై తప్పనిసరిగా సమాధానం రావాలన్న బుచ్చయ్యచౌదరి సమాధానం ఇచ్చేలా మంత్రులు, అధికారులను ఆదేశించాలని పట్టుబట్టిన బుచ్చయ్య స్పీకర్ జోక్యం చేసుకుని మంత్రులు వెంటనే సమాధానం చెప్పాలని ఆదేశాలు తాము నోట్ చేసుకుని సమాధానం చెబుతామని సభకు మంత్రి నాదెండ్ల స్పష్టం చేసారు. వివిధ సమస్యలపై సభ్యులు ప్రశ్నలు లేవనెత్తారు. ఈ సమావేశాలను వారం లేదా 10 రోజులు నిర్వహించే అవకాశం ఉంది. 6 ఆర్డినెన్స్‌ల స్థానంలో బిల్లులను ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టనుంది. పంచాయతీరాజ్ సవరణ, మున్సిపల్ చట్టాల సవరణ, ఏపీ మోటారు వాహనాల పన్నులు, ఎస్సీ వర్గీకరణ సహా ది ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్



లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఆఫ్ ది బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ ఎట్ ఆంధ్రప్రదేశ్ ఆర్డినెన్స్ 2025 స్థానంలో బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశం ఉంది.ఇక అసెంబ్లీకి రాని ఎంఎల్ఏలకు ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకునే నైతిక హక్కుందా?ఈ విషయంపై దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో పార్లమెంటులోనూ చర్చ జరగాలనేది నా అభిప్రాయం' అని శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు సభలో వ్యాఖ్యానించారు..'వైకాపా ఎంఎల్ఏలు ప్రమాణస్వీకారం తర్వాత సభకు రాలేదు. ఆ 11 మందిలో జగన్ మినహా మిగిలిన పది మంతి జీతాలు తీసుకుంటున్నారు. జగన్,వైకాపా ఎంఎల్ఏలందరూ అసెంబ్లీకి రండి.అందరు ఎంఎల్య్యేలకూ ఇచ్చినట్లే మీకూ మాట్లాడే సమయమిస్తా. ఆ భాధ్యత నాది. అయ్యన్నపాత్రుడిగా నన్న గౌరవించాలనడం లేదు. ఈ రోజు నేనున్నా,రేపు ఇంకొకరు స్పీకర్‌గా వస్తారు. స్పీకర్ స్థానాన్ని గౌరవించాల్సిన వైకాపా ఎంఎల్ఏలకు లేదా అని ప్రశ్నించారు 'అసెంబ్లీ సమావేశాలను ఈ నెలాఖరుతో ముగించి...దసరా తర్వాత మళ్ళీ ఐదారు రోజులు కొనసాగించాలనేది నా వ్యక్తిగత ఆలోచన.గురువారం జరిగే బీఏసీ సమావేశంలో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటాం. సమావేశాలకు ఎంఎల్ఏలందరూ హాజరవ్వాలి అని అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు.అమృత పథకంలో మైదుకూరు పురపాలక సంఘం అంశంపై ఎంఎల్ఏ పుట్టా సుధాకర్ యాదవ్,అంగన్‌వాడీ ఉపాధ్యాయులనఎ గౌరవ వేతనంపై జనసేన ఎంఎల్ఏ కొణతాల రామకృష్ణ,ఏపీపీఎస్సీ గ్రూప్-1 నోటీస్‌పై కమిటీపై ఎంఎల్ఏ కూన రవికుమార్,రాష్ట్రంలో సౌర విద్యుత్తుపై ఎంఎల్ఏ బత్తుల రామకృష్ణ, తుంగభద్ర డ్యాం నీటి వినియోగంపై ఎంఎల్ఏ ఎంఎస్‌రాజు,టిడ్కో ఇళ్ళ నిర్మాణంపై కామినేని శ్రీనివాస్,శ్రీకాకుళం ట్రైల్యాండ్ భూములకు సాగునీరుపై ఎంఎల్ఏ గొండు శంకరరావు,పెందుర్తి నియోజకవర్గంలో మానవ వనరుల అభివృద్ధిపై ఎంఎల్ఏ పంచకర్ల రమేష్‌బాబులు ప్రశ్నించారు, వైసిపి ఇరిగేషన్ రంగాన్ని విధ్వంసం చేసింది - మంత్రి నిమ్మల రామానాయుడు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇరిగేషన్ రంగాన్ని విధ వ్వంసం చేసిందన్నారు మంత్రి నిమ్మల రామానాయుడు..కూటమి ప్రభుత్వం చివరి ఎకరం వరకు సాగు నీరందించేలా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌ను గాడిలో పెడుతోందన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల రుణం తీర్చుకునేందుకు కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు,ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఆర్ వంశధార,తోటపల్లి,వంశధార-నాగావళి లింక్,జంఝావతి,హిరమండలం లిఫ్ట్, నాగావళి- చంపావతి,మహేంద్ర తనయ, తరకరామతీర్థసాగర్ వంటి కీలకమైన ప్రాజెక్టులను రెండేళ్ళలో పూర్తి చేసేలా యాక్షన్

## రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం!

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ లో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో పలు మార్పులు చోటు చేసుకుంటాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, కాకినాడ, డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, రాయలసీమ జిల్లాలతో పాటు కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరులో వర్షాలు పడనున్నాయి. ఈ ప్రాంతాల్లో మేఘావృత వాతావరణం నెలకొని ఉండగా, అక్కడక్కడ పిడుగులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ప్రజలు చెట్ల కింద నిలబడొద్దని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ప్రస్తుతం పశ్చిమ మధ్య నైరుతి బంగాళాఖాతం నుంచి తూర్పు విదర్భ, తెలంగాణ, దక్షిణ కోస్తాంధ్ర వరకు సముద్ర మట్టానికి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాయలసీమలో రాబోయే రెండు రోజుల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశముందని తిశిఖీదిలీతి మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. గురువారం వర్షాలు కురిసే జిల్లాలు: తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, బాపట్ల, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురవచ్చని అధికారులు తెలిపారు. ప్రజలు వాతా వరణ అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

# ఆర్డిటి అనంత పేదలకు వరప్రసాదిని

### - పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా పేదల అభ్యున్నతికి ఆర్డిటి సేవలు : ఎమ్మెల్యే సింధూర రెడ్డి



**అనంతపురం, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త బ్యూరో** ఉమ్మడి అనంతపురం జిల్లాలో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఆర్డిటి) ఒక గొప్ప వరప్రసాదం, పేదల పాలిట కల్పవృక్షం ఈ సంస్థ. ఈ ఆర్‌డిటి సంస్థ పార్టీలకు, మతాలకు, కులాలకు అతీతంగా పేదల సంక్షేమాభివృద్ధికి కోసం పనిచేస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో పేద మహిళా అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తోంది. ఈ సంస్థ ద్వారా విద్యారంగంలో పేద విద్యార్థుల ఉన్నత విద్యకు, క్రీడారంగంలో గ్రామీణ ప్రాంతాల్లోనీ నిరుపేద కుటుంబాల్లోని యువ క్రీడాకారులకు, వైద్య రంగంలో నిరుపేదలకు మరీ ముఖ్యంగా మహిళాభివృద్ధి కోసం ఎన్నో సేవలు అందిస్తోంది. ఈ సంస్థ ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని 3891 గ్రామాల్లో సుమారు 4.50 లక్షల కుటుంబాలకు వివిధ సేవలు అందిస్తోంది. ప్రభుత్వంతో పాటు ఈ సంస్థ మినీ ప్రభుత్వం లాగా ప్రజలకు చేసిన సేవలు లక్షలాదిమంది ప్రజల అభిమానాన్ని ఈ సంస్థ చూరగొందనీ చెప్పవచ్చు. ఎస్సీ, ఎస్టీ కాలనీలో పేదలకు ఇళ్ల నిర్మాణం, పేద విద్యార్థుల కోసం పాఠశాలలభవనాల నిర్మాణం పేద విద్యార్థులకు విద్యాభివృద్ధి గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాల పెంపుకు చెరువులు, కుంటలు, చెక్ డ్యాంల నిర్మాణం, రైతులకు పండతోటల పెంపకం, తుంపర సేద్యంతో పాటు బాగా వెనుకబడిన గ్రామాలకు రహదారుల నిర్మాణాన్ని చేపట్టింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మూడు ప్రధాన హాస్పిటల్స్ ను నిర్మాణం చేపట్టి పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తోంది. ఈ ఆర్ డి టి సంస్థ ద్వారా నిర్మాణం చేపట్టిన హాస్పిటల్‌లో సుమారు 8.50 లక్షల అవుట్ పేషెంట్స్ కు సుమారు 60 వేల మంది ఇన్ పేషెంట్స్ కు నిత్యం వైద్య సేవలు ఉచితంగా వైద్యం అతి తక్కువ ధరకే మెడిసిన్స్ అందిస్తోంది. సుమారు 15 వేల మందికి సర్జరీ వైద్యం, మరో 15వేల మంది మహిళలకు డెలివరీలు చేపట్టింది. ఈ సంస్థలో సుమారు 3వేల మందికి పైగా ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఆర్డిటి సంస్థ ద్వారా క్రీడారంగంలో యువ క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి క్రీడా శిక్షణతో రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ స్థాయిలో ఈ ప్రాంతానికి చెందిన ఎంతో మంది గ్రామీణ ప్రాంతపు యువ క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడం వలన వీరు వివిధ రంగాలలో అత్యంత ప్రతిభను చాటి మన రాష్ట్ర ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తున్నారు. ఇటువంటి గొప్ప ఆర్డిటి సంస్థకు కొన్ని సాంకేతిక కారణాలవల్ల ఎఫ్‌సిఆర్ఏ రెన్యువల్ చేయకుండా కేంద్రప్రభుత్వం ఆంక్షలు విధించింది. అయితే పేదల కోసం నిస్వార్థంగా పనిచేస్తున్న ఆర్డిటి సంస్థకు ఎఫ్‌సిఆర్ఏ మంజూరయ్యేలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ తీసుకొని కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎఫ్‌సిఆర్ఏ మంజూరయ్యేలా న్యాయం చేయాలని ప్రత్యేకంగా విన్నవించుకుంటున్నాను.

# వక్ఫ్ ప్రొటెక్షన్ ఫోరమ్స్ సమావేశాలు నిర్వహించండి

### - రాష్ట్ర ముతవల్లీల సంఘం అధ్యక్షుడు కేఎం సైకిల్ షఫీ డిమాండ్

**అనంతపురం, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త బ్యూరో** రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలని సదుద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా వక్ఫ్ ప్రొటెక్షన్ ఫోరం సమావేశములు అన్ని జిల్లాలలో జరపాలని వక్ఫ్ బోర్డ్ సీఈఓను దేశించినా ప్రతి జిల్లాలోని జిల్లా అధికారులు, జిల్లా కలెక్టర్లు, జిల్లా డిఎండబ్ల్యూ అధికారులు వక్ఫ్ ప్రొటెక్షన్ ఫోరం సమావేశములు జరపకుండా తగిన శ్రద్ధ చూపకుండా నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని రాష్ట్ర ముతవలీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్ షఫీ ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రతి జిల్లాలోనూ వక్ఫ్ ఆస్తులు పరిరక్షణ సమావేశములు నిర్వహించకుండా జిల్లా కలెక్టర్లు బిజీగా ఉన్నారని తప్పుడు సంకేతాలు ఇస్తున్నారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ల్యాండ్ గ్రాబర్లు,రాజకీయ నాయకుల కబంధ హస్తాలలో ఉన్న వక్ఫ్ స్థలాలను కాపాడడం మరిచిపోయి వారికి వత్తాసు పలుకుతూ వక్ఫ్ పరిరక్షణ సమావేశాలు ఆయా జిల్లాలలో నిర్వర్తించకపోవడం చాలా శోచనీయం అని ఆయన ఆరోపించారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్, సీఎంవో ఆఫీసు అధికారులు తక్షణమే స్పందించి అన్ని జిల్లాల కలెక్టర్లకు తప్పకుండా వక్ఫ్ ప్రొటెక్షన్ ఫోరం సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తద్వారా జిల్లాలలో, తాలూకాలలో మండలాలలో తగిన కార్యచరణ చేసి వక్ఫ్ స్థలాలు కాపాడాలి అన్న నిర్ణయానికి రావలసిన అవసరం ఎంతైనా ఉందని తప్పకుండా ప్రతి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం తెలిపిన షెడ్యూల్ ప్రకారం జిల్లా కలెక్టర్లు తూచా తప్పకుండా సమావేశాలు నిర్వర్తించాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ ముతవల్లిల సంఘం తరపున అధ్యక్షులు కేయం షకిల్ షఫీ డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 23 నుంచి డిసెంబర్ 15 వరకు అన్ని జిల్లాల్లోవక్ఫ్ ప్రొడక్షన్ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఒక షెడ్యూల్ తయారుచేసి అన్ని జిల్లాలకు పంపినట్లు ఆయన వెల్లడించారు.

ఆ షెడ్యూల్ ప్రకారం అన్ని జిల్లాల్లో వక్ఫ్ ప్రొటెక్షన్ సమావేశాలు నిర్వహనకు ఆయా జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## 19వ తేదీన చలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైసిపి

### - అనంతను కలిసిన జక్కంపూడి రాజా



**అనంతపురం, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త బ్యూరో** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజా గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ చలో మెడికల్ కాలేజి కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల భవనాన్ని శుక్రవారం జక్కంపూడి రాజాతో పాటు వైసీపీ నేతలు పరిశీలించనున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి అనంతపురానికి చేరుకున్న జక్కంపూడి రాజా అనంత వెంకటరామిరెడ్డిని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు జక్కంపూడి రాజాకు ఘన స్వాగతం పలికారు. అనంతరం తాజా రాజకీయ పరిస్థితులపై వారు చర్చించారు.

## అరంగేట్రం ఆర్చరీ ప్రీమియర్ లీగ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా రామ్‌చరణ్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** భారత్‌లో తొలిసారి నిర్వహించనున్న ఆర్చరీ ప్రీమియర్ లీగ్(ఏపీఎల్)కు గ్లోబల్ ఐకాన్ రామ్‌చరణ్‌ను బ్రాండ్ అంబా సిడర్‌గా నియమిస్తున్నట్లు జాతీయ ఆర్చరీ అసోసియేషన్(ఏఏఐ) అధ్యక్షుడు అర్జున్ ముండా, ఏఏఐ ప్రధాన కార్యదర్శి వీరేంద్ర సచ్‌దేవా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీలోని యుమున స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా అక్టోబర్ 2నుంచి 12 వరకు అరంగేట్రం ఏపీఎల్ జరుగనుంది. ఫ్రాంచైజీ ఆధారిత లీగ్‌గా జరుగబోతున్న టోర్నీలో ఆతిథ్య భారత్‌లోని పురుష, మహిళా కాంపౌండ్, రికర్వ్ ఆర్చర్లతో పాటు వివిధ దేశాల ఆర్చర్లను ఒక చోటుకు చేర్చనుంది.



ఉరవకొండ బస్ స్టేషన్‌లో మహిళా ప్రయాణీకులతో స్త్రీశక్తి పథకంపై ఆరా తీస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మెన్, ఎండీ సి.హెచ్.ద్వారకా తిరుమల రావు

# 1,050 ఎలక్ట్రిక్ బస్సులతోపాటు మరో 1,500 కొత్త బస్సులు

### - ఇతర రాష్ట్రాల తరహాలో విమర్శలకు తావులేకుండా స్త్రీశక్తి పథకం అమలు

#### - ఆర్టీసి వైస్ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ సి.హెచ్.ద్వారకా తిరుమలరావు

**ఉరవకొండ, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త** రాష్ట్రంలో కొత్తగా మంజూరైన 1,050 ఎలక్ట్రిక్ బస్సులతోపాటు మరో 1,500 కొత్త బస్సులను కొనగోలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్ణయించారని ఆర్టీసీ వైస్ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ సి.హెచ్.ద్వారకా తిరుమలరావు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన ఉరవకొండ ఆర్టీసీ డిపోను, బస్ స్టేషన్, కార్గో పార్సిల్ సర్వీస్ కేంద్రాలను ఆయన సంస్థ కడప జోనల్ ఛైర్మెన్ పూల నాగరాజుతో కలిసి తనిఖీ చేశారు. ఆర్టీసీ బస్ స్టేషన్‌లో బస్సులు ఎక్కి మహిళా ప్రయాణీకులతో స్త్రీశక్తి పథకం అమలు, ఉపయోగాలపై ఆరా తీసి సిబ్బందితో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర ్భంగా ఎండీ సి.హెచ్.ద్వారకా తిరుమలరావు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఆగస్టు 15న మహిళలకు ప్రధానమైన శ్రావణ శుక్రవారం రోజు స్త్రీశక్తి పథకం అమలులోకి వచ్చిందన్నారు. మిగతా రాష్ట్రాల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ వివిధ విమర్శలకు గురైన దృష్ట్య సమగ్రంగా అధ్యయనం చేసిన తరువాతే రాష్ట్రంలో అమలులోకి తెచ్చి పకడ్బందీగా, విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. స్త్రీశక్తి పథకం అమలులోకి రాకముందు రాష్ట్రంలో మహిళా ప్రయాణీకుల సంఖ్య నూటికి 40శాతంగా ఉండగా పురుషుల సంఖ్య 60శాతం ఉందని పథకం అమలులోకి వచ్చిన తరువాత మహిళా ప్రయాణీకుల సంఖ్య 65శాతం, పురుష ప్రయాణీకుల సంఖ్య 35కు చేరిందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఆక్యూపెన్సీ రేషియో (ఓఆర్) 69శాతం నుంచి 80 శాతానికి పెరిగిందన్నారు. ఉచిత బస్సుల్లో ఓఆర్ 76 శాతంగా ఉందన్నారు. రాష్ట్రంలోని 129 ఆర్టీసీ డిపోల్లో 60 డిపోల్లో ఓఆర్ 100శాతం దాటిపోయిందన్నారు. సెప్టెంబర్ 6న తూర్పు గోదావరి జిల్లా రావులపాలెం డిపోలో ఓఆర్ 130శాతం నమోదైందని వివరించారు. రాష్ట్రంలోని మహిళలు అవసరం మేరకే ప్రయాణం చేస్తున్నారన్న ఎండీ ఇతర రాష్ట్రాల కంటే రాష్ట్రంలో ఉచిత ప్రయాణ సౌకర్యం సజావుగా సాగుతోందన్నారు. కండక్టర్లు, డ్రైవర్లు ప్రయాణీకుల పట్ల సహనంతో ఉండాలని సూచించామన్నారు. స్త్రీశక్తి పథకం సమర్థవంతంగా అమలు చేస్తూనే బస్ స్టేషన్లలో సౌకర్యాల మెరుగుపై దృష్టి కేంద్రీకరించామన్నారు. ప్రయాణీకులు బస్సుల కోసం వేచి ఉండటానికి త్రీ సీట్ బల్లలు సరఫరా చేశామని తాగునీరు, టాయిలెట్ల సౌకర్యాలను మరింత పటిష్టంగా నిర్వహించడానికి కాంట్రాక్టులు ఇవ్వనున్నామన్నారు. ఇంటర్ స్టేట్ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఎక్కువగా రాయలసీమ, క్రిష్ణా, ఉత్తరాంధ్ర జిల్లాల నుండి వినతులు వస్తున్నాయని ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి మండలి త్వరలోనే ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఎండీ సి.హెచ్.ద్వారకా తిరుమల రావు వెల్లడించారు.

# దసరా ఏర్పాట్లపై సమీక్ష - హుండీ ఆదాయం రూ.2కోట్లు

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త** దుర్గమ్మ ఆలయంలో నిర్వహించబోయే దసరా ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై ఛీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ డి బ్రమరాంబ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను తెలుసుకుని పలుసూచనలు చేశారు. 72 గంటల్లో ప్రారంభమయ్యే దసరా ఉత్సవాలకోసం అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. - రెండు లక్షల వాటర్ బాటిల్స్: దసరాల్లో భక్తులకు అందించేందుకు రెండు లక్షల వాటర్ బాటిల్స్‌ను ఇప్పటికే సిద్ధం చేశారు. - అన్నదాన భవనం పరిశీలన: ఇఒ వికె శీనానాయక్ గురువారం అన్నదాన భవనం పరిశీలించి అక్కడ దసరాల్లో జరగబోయే అన్నదాన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులకు నిరంతరం ప్రసాదం పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్ రమా, ఏఇఒలు శ్రీనివాస్, వేంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కెనాల్‌రోడ్డులో దసరా ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

- హుండీ ఆదాయం రు.2కోట్లు: అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ వారికి భక్తులు హుండీల ద్వారా స మర్పిం చిన కాను కలను గు రు వారం లెక్కిం చగా రు. 2,17,98,528ల నగదు, 235గ్రావ ు ల బంగారం, 3కెజిల 970 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీ యుఎస్ 321 డాలర్స్, సింగపూర్‌డాలర్స్ 10, యుఎఇ దిర్హమ్స్ 35, సౌదీ రియాల్స్ 25, ఒమన్ బైసా 200, ఖతార్ 24 రియాల్స్, మలేషియా 2 రింగట్లు,



మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఆహ్వానం అందిస్తున్న ఇఒ

65యూరోలు, కువైట్ 5.1/2 దీనార్లు, హాంకాంగ్ 500 డాలర్లు, థాయిలండ్ 40 బాట్, బహ్రెయిన్ 11 దినార్లు లభించాయని ఇఒ వికె శీనానాయక్ తెలిపారు. - క్యూలైన్లను పరిశీలించిన ఎమ్మెల్యే: దసరా ఉత్సవాలకోసం ఏర్పాటుచేసిన క్యూలయిన్లను ఎమ్మెల్యే సుజనా చౌదరి గురువారం ఇఒ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దసరా ఉత్సవాలు మరింత ఘనంగా నిర్వహిస్తామన్నారు. విజయవాడ ఉత్సవ్‌ను కూడా వైభవంగా నిర్వహిస్తామన్నారు. దుర్గమ్మవారిని సుజనాచౌదరి దర్శించుకున్నారు.

# రైల్వేలో క్యూఆర్ కోడ్‌ను యూటిఎస్ యాప్‌తో స్కాన్‌చేస్తే రైల్వే జనరల్ టిక్కెట్లు

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 18,ప్రభాతవార్త** ప్రస్తుత పండుగల సీజన్‌లో సాధారణ తరగతి ప్రయాణికుల సౌకర్యార్థం తెలుగు రాష్ట్రాలలోని దక్షిణ మధ్య రైల్వే ఆధునిక పరిజ్ఞానంతో మౌలిక సౌకర్యాలను కల్పించడం ద్వారా ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తమ ప్రయాణాన్ని సాఫీగా కొనసాగించేందుకు చర్యలు చేపట్టింది. రిజర్వ్ టిక్కెట్లను సులభతరంగా కొనుగోలు చేయడానికి 'యూటిఎఫ్' మొబైల్ అప్లికేషన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఆధునిక టికెటింగ్ వ్యవస్థలో యూటిఎఫ్‌తో మరో ముందడుగు వేసింది. భారతీయ రైల్వేలో సాధారణ తరగతిలో భారీ సంఖ్యలో ప్రయాణించే ప్రయాణికులకు యూటిఎఫ్ మొబైల్ యాప్ ద్వారా టిక్కెట్ల కొనుగోలును ప్రోత్సహించడానికి దక్షిణ మధ్య రైల్వే ఒక నూతన విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. రెట్రో రిఫ్లెక్టివ్ జాకెట్ల వెనుక వైపు క్యూఆర్ కోడ్ ముద్రించబడిన యూటిఎఫ్ యాప్/రైల్ వన్ యాప్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా జనరల్ టిక్కెట్లను కొనుగోలు చేసే సౌకర్యం ఏర్పాటు చేయబడింది. స్టేషన్ కాన్కోర్స్ ప్రాంతంలో యూటిఎఫ్ మొబైల్ యాప్‌ను ప్రోత్సహించడానికి నియమించబడిన వ్యక్తులు ఈ జాకెట్లను ధరిస్తారు. రైలు వినియోగదారులు యూటిఎస్/రైల్ వన్ యొక్క మొబైల్ అప్లికేషన్‌తో జాకెట్ వెనుక భాగంలో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి యూటిఎఫ్ అప్లికేషన్ ద్వారా వినియోగించి టిక్కెట్లను కొనుగోలు చేయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి సిబ్బంది, ప్రయాణికులకు తెలియజేస్తారు. ఈ ముఖాముఖీ విధానం యాప్ యొక్క వినియోగదారు-స్నేహపూర్వక లక్షణాల గురించి, ముఖ్యంగా క్యూఆర్ కోడ్ ఆధారిత టికెటింగ్ గురించి ప్రయాణికులలో అవగాహన కల్పించడంలో సహాయపడుతుంది. ఇది టికెట్ కౌంటర్ వద్ద క్యూలను, ప్రయాణికుల సమయం వృధా కాకుండా,నగదు రహిత, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించేందుకు సహాయ పడుతుంది. ఈ అధునాతన వ్యవస్థ జోన్‌లోని ఆరు డివిజన్‌లలోని ప్రధాన స్టేషన్‌లైన సికింద్రాబాద్,కాచిగూడ, విజయవాడ, గుంటూరు,గుంతకల్లు, తిరుపతి,నాందేడ్ మొదలైన వాటిలో ప్రవేశపెట్టబడింది. జనరల్ టిక్కెట్ల కొనుగోలు కోసం మొదట విధించిన దూర పరిమితులను సడలించారు. రైలు వినియోగదారులు ఇప్పుడు స్టేషన్ ప్రాంగణం మరియు రైల్వే ట్రాక్ నుండి 5మీటర్ల దూరంలో ఉన్న ఏ ప్రదేశం నుండైనా టిక్కెట్లను కొనుగోలు చేయవచ్చు. సరళంగా చెప్పాలంటే ప్రయాణికుడు తమ ఇంటి నుండే తమ టిక్కెట్లను(జర్నీ/ప్లాట్‌ఫామ్ టిక్కెట్లు రెండూ) బుక్ చేసుకోవచ్చు. జనరల్ టిక్కెట్లను కొనుగోలు చేయడానికి పొడవైన క్యూలలో నిలబడకుండా రైలులో ప్రయాణం చేసే సౌకర్యం. స్టేషన్ కాన్కోర్స్ ప్రాంతంలో ఉన్న ప్రయాణికులు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా టిక్కెట్లను కొనుగోలు చేయవచ్చు.



రైల్వేలో క్యూఆర్ కోడ్‌ను యూటిఎస్ యాప్‌తో స్కాన్ చేయడం ద్వారా జనరల్ టిక్కెట్ పొందే విధానాన్ని ప్రయాణికులకు వివరిస్తున్న సిబ్బంది

# కంగుందిని పర్యాటక కేంద్రంగా మార్చుతాం

### - ఆర్టీసి వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం - కుప్పంలో తొలిసారి బౌల్డరింగ్ జిమ్ నిర్మాణం!

**కుప్పం, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త** సుమారు వెయ్యేళ్ల చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచే కంగుంది ప్రాంతాన్ని సిఎం చంద్రబాబునాయుడు సూచనలతో పర్యాటక కేంద్రంగా మార్చుతామని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. గురువారం కంగుంది గ్రామంలో తదేకం ఫౌ ండేషన్ అధ్వర్యంలో బౌల్డరింగ్ జిమ్ నిర్మాణానికి వారు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కంగుంది దుర్గంలో ఇటీవలే ట్రెక్కింగ్ యాత్రలను విజయవంతంగా మొదలు పెట్టినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలోని అందమైన ప్రకృతి రమణీయతతో కూడిన ప్రాంతాలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. యువతలో ట్రెక్కింగ్, రాక్ క్లైంబింగ్ వంటి కార్యక్రమాతో శారీరక దృఢత్వం, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కుప్పం ప్రాంతంలో తొలిసారి బౌల్డరింగ్ జిమ్‌ను ప్రారంభించడం జరుగుతోందన్నారు. కుప్పం ప్రాంతంనుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి క్రీడాకారులు ఎదిగేలా తగు ప్రోత్సాహం కల్పిస్తామన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఆలోచనలకు అనుగుణంగా కుప్పాన్ని ఆదర్శ నియోజకవర్గంగా మలుస్తున్నారన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం,పారిశ్రామిక రంగాల్లో సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు పరుగులు పెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనశేఖర్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, నేతలు దివాకర్, షరీఫ్, మునాఫ్, తిరుపతి, తదేకం ఫౌండేషన్‌ప్రతినిధులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మన్, కడ పి.డి

## మారేడ్‌పల్లిలోని ఓ వ్యాపారవేత్త ఇంట్లో ఇడి సోదాలు

**హైదరాబాద్ (కంటోన్మెంట్), సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లి ఏటిసి సెంటర్ రోడ్డులోని వెల్డింగ్‌టన్ ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న వ్యాపార వేత్త బూరుగు రమేష్ కుమారుడు, అతని కుమారుడు నివాసాలపై ఈడి అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. వెల్డింగ్ టన్ ఎన్‌క్లేవ్‌లోని ఫ్లాట్ నెం 26లో నివాసం ఉంటున్న రమేష్ ఇంట్లో ఈడి అధికారులు రెండు బృందాలతో ఈడి సోదాలు నిర్వహించారు.





# పేదరిక నిర్మూలనే పి 4 ప్రధాన లక్ష్యం ఆర్డీఓ, శ్రీకర్



**ఆత్రేయపురం, సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న ఇద్దరు విద్యార్థుల పేద కుటుంబాల ను అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ వారు రాష్ట్ర ప్రభుత్వం పిలుపుమేరకు పి4 కార్యక్రమం ద్వారా కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి పి. శ్రీకర్ సమక్షంలో దత్తత తీసుకున్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి ప్రభుత్వ ప్రధాన ప్రాథమిక ఫౌండేషన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చింతా శ్యామ్ కుమార్ సౌజన్యంతోనిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆర్డీఓ ముఖ్య అతిధిగా పాల్గొని విద్యార్థి తల్లిదండ్రులకు నిత్యవసర సరుకులతో పాటు వారి జీవనోపాధికి సహాయపడే పూతరేకులు తయారీ కి కావలసిన ముడి సరుకులు, విద్యార్థులకు కావలసిన విద్యాసామాగ్రి అందజేశారు. అనంతరం ఆధునిక ఫిజియోథెరపీ ఉచిత వైద్య శిభిరాన్ని డాక్టర్ మోహిత్ సీతల ఆధ్వర్యంలో ఆయన చేతుల మీదుగా ప్రారంభించి అవసరమైన వారికి ఫిజియోథెరపీ మెటీరియల్ మరియు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 60 మంది ఫిజియోథెరపీ ఉచిత వైద్య సేవలను వినియోగించు కొన్నారు. ఈ సందర్భంగా శ్యామ్ జాదూగర్ మెగా మ్యాజిక్ ఫ్యామిలీ నిర్వహిస్తున్నటువంటి సేవా కార్యక్రమాలను నేటి సమాజం ఆదర్శంగా తీసుకోని మరింత మంది దాతలు ముందుకు వచ్చి పేదరిక నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి రాజేశ్వరరావు మండల అభివృద్ధి అధికారి రమణ గ్రామ సచివాలయ సిబ్బంది, మ్యాజిక్ ఫ్యామిలీ సభ్యులు సూర్య చంద్ర రావు,శ్రీకాంత్, తేజశ్రీ, శ్రీధర్, కుమార లక్ష్మి, అన్నపూర్ణ, శ్యామ్, రిషిత్, జాన్విక లు పాల్గొన్నారు.

# భవిష్యత్ అంతా పకృతి వ్యవసాయమే...యూనిట్ ఇన్చార్జి కాంద్రు ఝాన్సీ



**ఆత్రేయపురం, సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
భవిష్యత్తు అంతా ప్రకృతి వ్యవసాయంపై ఆధారపడి ఉంటుందని దాని ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని యూనిట్ ఇన్చార్జి కాండ్రు ఝాన్సీ అన్నారు. ఆత్రేయపురం మండలంలోని వద్దిపర్రు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా 20 ఎకరాలలో ప్రకృతి వ్యవసాయ జీవామృతం పిచికారి చేశారు. ఈ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు, ప్రస్తుత పరిస్థితుల్లో రసాయనిక ఎరువులు పురుగు మందులు వాడడం వల్ల ఉత్పత్తుల్లో వాటి అవశేషాలు ఉండిపోతున్నాయన్నారు. దీంతో అనారోగ్యం పాలవుతుందన్నారు. ప్రతి రైతు కొంత పొలంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టి ఆరోగ్యకరమైన ఉత్పత్తులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ ఫెసిలేటర్ ఆకుల వీరబాబు , వద్దు పర్రు ఐ.సి. ఆర్.పి. అబ్బులు,విఏఏ వెంకట రత్నం, ఆదర్శ రైతులు కరుటూరి రాధ కృష్ణ , కరుటూరి నాగేశ్వరావు ,గన్నమనేని సత్య నారాయణ , బట్టు వెంకటేశ్వరావు, కరుటూరు బాల చంద్రం ,ఐసిఆర్పి మార్తమ్మ రైతులు వ్యవసాయ శాఖ సహాయకులు తదితరులు ఉన్నారు.

# రణభేరి ' బహిరంగ సభను విజయవంతం చేయాలి

## యుటిఎఫ్ ఆధ్వర్యంలో మోటార్ బైక్ ర్యాలీ



**అంబాజీపేట, సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
ఆర్థిక, విద్యారంగ సమస్యలపై ఈ నెల 25న విజయవాడలో నిర్వహించే రణభేరి బహిరంగ సభలో ఉపాధ్యాయులందరూ పాల్గొని విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర జనరల్ కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్,రాష్ట్ర కౌన్సిలర్ జ్యోతిబసు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు జిల్లా రణబేరి జాతా గురువారం అంబాజీపేటలో ప్రవేశించింది. యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు హాజరై జాతాకు స్వాగతం పలికారు. బైక్ ర్యాలీగా జాతా వెంబడి ఉపాధ్యాయుల సమస్యలపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ లో జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు, విద్యారంగ పరిరక్షణకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేయాలన్నారు. తక్షణం పీఆర్సీ కమిటీని నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని, బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు ఎం.సూర్యనారాయణ, పి.విశ్వప్రసాద్,జి.రాంబాబు, ఉపాధ్యాయులు సంఖ్యలో పాల్గొన్నారు.

# "స్వస్త్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ " తో మహిళలకు ఆరోగ్యం



**పిఠాపురం, సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే, " స్వస్త్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ " కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని, పిఠాపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు యాళ్ళ వినయ్ అన్నారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జన్మదిన మహోత్సవాలలో భాగంగా, పట్టణంలోని స్థానిక మంగాయమ్మ రావు పేటలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం " స్వస్త్ నారీ,సశక్త్ పరివార్ అభియాన్ " కార్యక్రమంలో భాగంగా, మహిళలకు వివిధ రకాల వైద్య సేవలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వైద్య శిబిరం ద్వారా మహిళలకు 14 రకాల వైద్య సేవలు అందించి, రక్త పరీక్షలు, వ్యాక్సిన్, షుగర్, బీపీ, క్యాన్సర్ స్క్రీనింగ్ వంటి పరీక్షలు కూడా చేయడం జరిగిందన్నారు.అలాగే అవసరమైన వారికి మందులు కూడా అందజేశామన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యులు తులసి, లావణ్య, వరలక్ష్మి, వార్డు కౌన్సిలర్ పావని,జనసేన నాయకులు , ఏఎన్ఎంలు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ముక్కామల విద్యార్థి



**అంబాజీపేట, సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
రాష్ట్ర స్థాయి అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ముక్కామల జెడ్పీ హైస్కూల్కు చెందిన 9వ తరగతి విద్యార్థి గుంట్రు దినేష్ ప్రసాద్ ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ ముత్యాల పవన్ కిషోర్ గురువారం తెలిపారు. స్థానిక హైస్కూల్లో దినేష్ ప్రసాద్ ను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా పీడీ పవన్ కిషోర్ మాట్లాడుతూ ఇటీవల కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ -17 వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో 79 కేజీల విభాగంలో దినేష్ ప్రసాద్ గోల్డ్ మెడల్ సాధించాడన్నారు. జిల్లా స్థాయి పోటీలలో అత్యంత ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన దినేష్ ప్రసాద్ ను, శిక్షణ ఇచ్చిన పిడి పవన్ కిషోర్ ను హెచ్ఎం ఎమ్మెస్సార్ మూర్తి అభినందించారు.
ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు,జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి,సర్పంచ్ బందారు వెంకటలక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ బి.శామ్యూల్ రాజు,ఎంపీటీసీ వనచర్ల దుర్గాభవాని,ఏఎంసి డైరెక్టర్ వక్కపట్ల ఆదిలక్ష్మి,జనసేన గ్రామ శాఖ అధ్యక్షుడు వక్కపట్ల సుబ్రహ్మణ్యం, బండారు మల్లిబాబులు దినేష్ ప్రసాద్ ను అభినందించారు.

# బాలికల అభ్యున్నతి కోసం బేటి బచావో బేటి పఢావో దోహదం

**జిల్లా బాలల పరిరక్షణ అధికారిని విజయ**



**శంఖవరం, సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
బాలికల అభ్యున్నతి కోసం భేటీ బచావో బేటి పడావో దోహదపడుతుందని జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ అధికారిని జాగారపు విజయ పేర్కొన్నారు. శంఖవరం మండలం కస్తూర్బా బాలిక విద్యాలయం లో స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సి. హెచ్.లక్ష్మి ఆదేశాల మేరకు శంఖవరం ప్రాజెక్ట్ సిడిపిఓ పర్వత వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో బేటి బచావో- బేటి పడావో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విజయ మాట్లాడుతూ బాలికలకు జీవించే హక్కు ,రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు , పాల్గొనే హక్కు తెలియజేశారు. లైంగిక వేధింపులు, మంచి స్పర్శ చెడు స్పర్శ, బాలల సంబంధిత చట్టాలు, తెలిపి అత్యవసర పరిస్థితుల్లో బాలల హెల్ప్ లైన్ 1098 కి కాల్ చేయాలని చైల్డ్ హెల్ప్ లైన్ 1098 పని తీరు గురించి తెలిపి ఈ నెంబర్ కు సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి అని తెలిపారు. అమ్మాయికి 18 సంవత్సరాలు అబ్బాయికి 21 సంవత్సరాలు నిండకుండా వివాహ చేసినట్లు అయితే బాల్య వివాహం నిర్మూలన చట్టం ప్రకారం 2 సంవత్సరాల జైలు శిక్ష 1 లక్ష రూపాయల జరిమానా విధించే అవకాశం ఉంది అని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ బి. బాల మణి కుమారి మాట్లాడుతూ విద్యార్థులందరూ బాలల చట్టాల పైన, హక్కులు పూర్తి అవగాహన కలిగించుకొని వారి జీవితంలో మంచి వృత్తిలో స్థిరపడలని తెలిపారు ఈ కార్యక్రమంలో మహిళా కార్యదర్శి డి. భవిత, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎరువుల వినియోగం తగ్గించికోండి...జిల్లా వ్యవసాయ అధికారి



**మామిడికుదురు., సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
మామిడికుదురు పి.ఏ.సిఎస్ కార్యాలయాన్ని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఓలేటి బోసు బాబు గురువారం సందర్శించి యూరియా అమ్మకాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ ఈలి శ్రీనివాస్ కు అభినందనలు తెలియజేశారు.యూరియా కొనుగోలు కోసం వచ్చిన రైతులతో మాట్లాడి ఎరువులు వినియోగాన్ని తగ్గించుకొనే విధంగా వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనల మేరకు ఎరువులు వాడాలని కోరారు. సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ సొసైటీలో రైతుల అవసరాలకు యూరియా అందుబాటులో ఉండే విధంగా నిల్వలు ఉంచాలని లేదనే సమస్య రాకుండా చూడాలని ఆయనను కోరారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మట్టా సత్తిబాబు, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కొత్తపల్లి శ్రీనివాస్,మండల వ్యవసాయశాఖాధికారి నందేపు వివి సత్యనారాయణ, రైతులు,సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు .

# గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలి



**అంబాజీపేట, సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
దీర్ఘకాలంగా ఉన్న వీఆర్ఎల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణవే పరిష్కరించాలని వీఆర్ఏలు డిమాండ్ చేశారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో వీఆర్ఎలు గురువారం దీక్షను చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీఆర్ఎలు మాట్లాడుతూ రాష్ట్ర గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపు మేరకు వీఆర్ఎల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దీక్ష శిబిరంలో శాంతి పోరాటం చేస్తున్నామన్నారు. వీఆర్ఎలకు పే స్కేలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని వర్తింప చేయాలని, అర్హత కలిగిన వారిని వీఆర్వోలుగా ప్రమోషన్ ఇవ్వాలని, నామినీలుగా విధులు నిర్వహిస్తున్న వారిని వీఆర్ ఏలుగా, నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వీఆర్ఎలు దివ్వి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలు చేయాలంటూ వి.ఆర్.ఏల దీక్షలు




**రావులపాలెం, సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
పే స్కేలు అమలు, నామినీలను వి.ఆర్.ఏ.లుగా నియమించాలని, అర్హులకు ప్రమోషన్స్ ఇవ్వాలని తదితర సమస్యల పరిష్కారం కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు ( వి.ఆర్.ఏ) గురువారం రావులపాలెం తహశీల్దార్ కార్యాలయం వద్ద దీక్షలు చేపట్టారు. అనంతరం తహశీల్దార్ బి.ముక్తేశ్వరరావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండు రోజుల పాటు దీక్షలు చేస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతున్నా తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని వెంటనే ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

# కలెక్టర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ




**కోనసీమ బ్యూరో, సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ రావిరాల ని మర్యాదపూర్వకంగా జిల్లా నూతన ఎస్పి రాహుల్ మీనా కలిశారు.ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ కి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, చట్టాల సమర్థవంతమైన అమలు వంటి అంశాలపై చర్చించారు.

# జీతాలు పెంపు,ప్రమోషన్ నామిని కి ఇవ్వాలంటూవి. ఆర్. ఏ లు నిరసన

**ఆత్రేయపురం, సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సేవకుల సంఘం పిలుపుమేరకు వీఆర్ఏల ప్రధాన సమస్యలైనపే స్కేలు అమలు, నామినీలను వీఆర్ఏలుగా నియమించాలి ,అర్హులకు ప్రమోషన్ కల్పించాలి, కారుణ్య నియమాకాలు చేపట్టాలి , ప్రధాన సమస్యల పై ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపుమేరకు సెప్టెంబర్ 18 19 తేదీలలో తహసిల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ టి ఆర్ రాజేశ్వరరావు కి డిమాండ్లు కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల గ్రామ రెవెన్యూ సేవకులు పాల్గొన్నారు.

# వ్యాధి నిర్ధారణకు ప్రత్యేక నిపుణుల బృందం ద్వారా శాంపిల్స్ సేకరణ

- వ్యాధిపై ఆందోళన అవసరం లేదు
- రైతులకు కలెక్టర్ కీర్తి చేకూరి భరోసా



**ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
ప్రత్యేక నిపుణుల పర్యవేక్షణలో పశువుల చికిత్స కొనసాగింపు జరుగుతోందని , ఇందు కోసం ప్రత్యేక వైద్యుల బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వం పంపడం జరిగిందనీ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.గురువారం సాయంత్రం కొవ్వూరు నియోజక వర్గం పరిధిలోనీ పెద్దవం, ఐ.పంగిడీ గ్రామాల్లో కలెక్టర్ పర్యటించి రైతులతో ముఖాముఖి సంభాషించి, వారికి భరోసా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, గేదెల వ్యాధి నివారణ కు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పశువుల పేడ పరీక్షల్లో బి. కోలి మరియు పొట్ట జలగ వ్యాధి నిర్ధారణ అయ్యిందన్నారు. గేదెలకు చికిత్స చేయడం కొనసాగుతోందనీ, ఇప్పటికే కొంతమేరకు సానుకూల ఫలితాలు కనిపిస్తున్నాయని , వ్యాధి లక్షణాలు తగ్గడం గుర్తించినట్లు వైద్యులు తెలియ చేయడం జరిగిందనీ కలెక్టర్ రైతులకి వివరించారు. ఈ సందర్భంగా గేదెలలో కనిపించిన వ్యాధి లక్షణాలకు సంబంధించిన చికిత్స జరుగుతుందని, మరిన్ని ల్యాబ్ పరీక్షల కోసం నమూనాలు సేకరించబడినట్లు , రెండు మూడు రోజులలో వాటి వివరాలు వస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. విజయవాడ పశువైద్య జీవవిజ్ఞాన పరిశోధన సంస్థ (వి బి ఆర్ ఐ) ప్రత్యేక నిపుణుల బృందం పర్యవేక్షణలో పశువులపై చికిత్స వ్యాధి తీవ్రత తదితర అంశాలపై కలెక్టర్ క్షేత్ర స్థాయిలో సమీక్షించడం జరిగింది. బుధవారం పెద్దవం గ్రామంలో మృతి చెందిన గేదె కు విజయవాడ నుండి వచ్చిన జాయింట్ డైరెక్టర్ డా.చంద్రమౌళి ఆధ్వర్యంలో శవ పరీక్షలు చేపట్టడం జరిగిందనీ, వాటికి సంబంధించిన నమూనాలు తదుపరి పరీక్షలు నిమిత్తం విజయవాడ పంపుతున్నట్లు తెలిపారు. పర్యటన నేపథ్యంలో తాళ్లపూడి మండలం పెద్దవం గ్రామానికి చెందిన రైతు జె. సత్యనారాయణ, కొవ్వూరు మండలం ఐ.పంగిడీకి చెందిన రైతు జె. కృష్ణార్జున లతో కలెక్టర్ ముఖాముఖి జరిపారు. గత పది రోజులకు ఇప్పటికీ వ్యాధి లక్షణాలు తగ్గుతున్నట్టు రైతులు వివరించారు. వ్యాధి నిర్ధారణ కోసం సేకరించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌లో పూర్తిగా పరీక్షించడం జరుగుతుందన్నారు.

# పిల్లలకు సురక్షిత నగరంగా హైదరాబాద్

## 'క్లాప్ ఫర్ చిల్డ్రన్' పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రులు సీతక్క, పొన్నం



**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో 'క్లాప్ ఫర్ చిల్డ్రన్– పిల్లల భద్రత కోసం నగరస్థాయి కార్యాచరణ ప్రణాళిక'ను తెలంగాణ ప్రభుత్వం, యూనిసెఫ్ సంయుక్తంగా ప్రారంభించింది. పిల్లలకు హైదరాబాద్‌ను సురక్షిత నగరంగా మార్చుతామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, రవాణా, బిసి శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. క్లాప్ ఫర్ చిల్డ్రన్ పోస్టర్‌ను సచివాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, హైదరాబాద్‌ను 'పిల్లలకి సురక్షిత నగరం'గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తుందని.. ఇతర నగరాలు, రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దామన్నారు. ఈ ప్రయత్నంలో యూనిసెఫ్ సంస్థకు పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించారు. ఈ ప్రణాళిక ద్వారా ప్రభుత్వ విభాగాలు, చట్టపరమైన సంస్థలు, సమాజం కలిసి పిల్లలు సురక్షితంగా, ఆరోగ్యంగా ఎదగడానికి కృషి చేయనున్నారు. చట్టపరమైన సంస్థలు, ఫ్రంట్‌లైన్ సేవలను బలోపేతం చేసి, మహిళా శిశు సంక్షేమ, పోలీసు, ఆరోగ్యం, విద్య, కార్మిక, జిహెచ్ఎంసి వంటి విభాగాల సమ న్వయంతో బుల్లీయింగ్, ఈవ్‌టీజింగ్, అసురక్షిత రవాణా, మాదకద్రవ్యాల వినియో గాన్ని నివారించడానికి చర్యలు చేపడతారు. బాలల రక్షణ సెల్‌లు, విజిలెన్స్ కమిటీల ద్వారా డేటా ఆధారిత మానిటరింగ్ జరుగుతుంది. అలాగే ఫ్రంట్‌లైన్ వర్కర్లకు, పిల్లలకు అనుకూలమైన, శిక్షణ ఇవ్వ నున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీమతి అనితా రామచంద్రన్, యూనిసెఫ్ చీఫ్ ఆఫ్ ఫీల్డ్ ఆఫీస్ డా. జెలాలెం బిర్హాను టాఫెస్సే తదితరులు పాల్గొన్నారు.

# బస్తీల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

## అభివృద్ధి కాలనీలకే పరిమితం కావొద్దు

### దిశ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో హరిచందన తదితరులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** హైదరాబాద్ అంటే జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ కాదని, నిజమైన హైదరాబాద్ బస్తీల్లో ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బస్తీలు, మురికివాడల్లో ఇంకా పేద ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారం కోసం అధికారులు ప్రణాళికలు రూపొందించి సమన్వయంతో పని చేయాలన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్ ఆర్డీలో గురువారం హైదరాబాద్ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం గురు వారం కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. జీహెచ్ఎంసీ పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ, కేంద్ర సహాయక పథకాలు(సీఎస్ఎస్), ప్రాజెక్టుల అమలు స్థితిపై సమీక్షించారు. గత దిశ సమావేశం తరువాత తీసుకున్న చర్యలపై నివేదికలను పరిశీలించి పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర పథకాలను సమయానుకూలంగా, సమర్థవంతంగా అమలు చేయాలని, శాఖల మధ్య సమన్వయం ముఖ్యమన్నారు. నగరంలో నిధుల కొరత ఉన్నప్పటికి లభ్యమవుతున్న నిధులను సమర్థవంతంగా వినియోగవించుకొని అభవివృద్ధి చేయాలన్నారు. నగరంలో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు జలమయమై ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. నాంపల్లిలో ఇద్దరు, సనత్‌నగర్‌లో ఒక యువకుడు నాలాలో కొట్టుకు పోవడం దుర దృష్టకరమని అన్నారు. పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యేలతో అన్ని శాఖల అధికారులు కలిసి పనిచేసి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచాలన్నారు. పాఠశాలలు, సామాజిక భవ నాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లపై దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలన్నారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం నగర అభివృద్ధికి నిధుల కొరత ఏర్పడిందన్నారు. సంక్షేమం, మౌళికసదుపాయాలు, అభివృద్ధి, విద్య తదితర అంశాలపై దిశా సమా వేశంలో చర్చించినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన, వివిధ శాఖల ప్రతి నిధులు, సీనియర్ అధికారులు పాల్గొ న్నారు.

# 30న సద్దుల బతుకమ్మ రోజును సెలవుదినంగా ప్రకటించాలి

## సిఎస్‌కు టిజిఎంప్లాయిస్ జెఎసి విజ్ఞప్తి

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** సద్దుల బతుకమ్మ పండుగైన సెప్టెంబరు 30న సెలవు దినంగా ప్రకటించాలని తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసి డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె కృష్ణారావుకి టిజిఈజేఏసి గురువారం వినతిపత్రం సమర్పించింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి సంవత్సరం మహిళలు సద్దుల బతుకమ్మ పండుగను పెద్ద ఎత్తున జరుపుకుంటారని అందుకే ఈ నెల సెప్టెంబర్ 30న జరిగే సద్దుల బతుకమ్మ పండుగ రోజును సెలవుదినంగా ప్రకటించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావుని టిజిఈజేఏసి చైర్మన్ మారం జగదీశ్వర్ జేఏసి నేతలతో కలిసి కోరారు.

# ఇంటర్ విద్యార్థిపై కాలేజీ ఫ్లోర్ ఇన్‌చార్జి దాడి

## మలక్‌పేట్ పోలీసులకు విద్యార్థి తల్లిదండ్రులు ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి కుటుంబసభ్యులు

**హైదరాబాద్ (మలక్‌పేట), సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** దిల్‌షుక్‌నగర్ గడ్డిఅన్నారం నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిపై ఫ్లోర్‌ఇన్‌చార్జ్ దాడి చేయడంతో విద్యార్థి ఎడమ దవడ ఎముక విరిగిన సంఘటన మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధిత విద్యార్థి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. అల్మాస్ గుడా ప్రాంతానికి చెందిన డి. సంతోష్ కుమార్ కుమారుడు దొంతిక సాయి పునీత్ దిల్‌షుక్‌నగర్ గడ్డిఅన్నారం నారాయణ జూనియర్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల 15 నిమిషాల సమయంలో ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన వాగ్వాదం విషయంలో ఫ్లోర్ ఇంచార్జ్ మాలి సతీష్ జోక్యం చేసుకొని సాయి పునీత్ పై దాడి చేసి కొట్టడంతో సాయి పునీత్ ఎడమ దవడ ఎముక విరిగి పోయింది. సంఘటన గురించి కళాశాల నిర్వాహకులు తమకు తెలియ జేయలేదని, తమ కుమారుడు సాయిపునిత్ సంఘటన గురించి తమకు చెప్పడంతో దాడి గురించి తమకు తెలిసిందని విద్యార్థి తల్లిదండ్రులు పేర్కొ న్నారు. సంఘటన గురించి కళాశాల మేనేజ్మెంట్ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ సంఘటన గురించి చర్యలు తీసుకోవాలని విద్యార్థి తల్లిదండ్రులు మలక్ పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని మలక్ పేట ఇన్స్పెక్టర్ పిడమర్తి నరేష్ పేర్కొన్నారు.

# మాదకద్రవ్యాల నివారణ అందరి బాధ్యత

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం : మంత్రి జూపల్లి

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** యువత జీవితాలకు ప్రమాదకరంగా మారిన మాదకద్రవ్యాల నివారణ సమాజంలో అందరి బాధ్యత అని రాష్ట్ర పర్యాటక, ఆబ్కారీ, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్‌లో గల మఖ్దూమ్ భవన్‌లోని రాజ్ బహదూర్ గౌర్ హాల్లో గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్య మండలి నిర్వహించిన మాదకద్రవ్యాల వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు కళారూపాల వర్కుషాప్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణి శంకర్, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ ఛాయాదేవి, సమితి సభ్యులు మరుపాక అనిల్ కుమార్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి స్టాలిన్, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు కె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, ఉపాధ్యక్షులు కె లక్ష్మి నారాయణ తోపాటు కళాకారులూ పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రజా నాట్య మండలి నాటక బృందం మాదక ద్రవ్యాల నివారణ, అవగాహన కల్పించడానికి రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాల యాలు, కళాశాలలు, పాఠశాలల వద్ద తమ కళారూపాలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను అన్ని వసతులు, సౌకర్యాలతో నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు.

# రెండు ఆటోలు ఢీ

## భూత్పూరు వద్ద ఘోరప్రమాదం

### ముగ్గురు మృతి, పలువురికి గాయాలు

**భూత్పూర్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కొత్తమొల్గర గ్రామ శివారులో గురువారం ఘోర రొడ్డు ప్రమాదం జరిగింది. రెండు ఆటోలు పరస్పరం ఢీకొన్న సంఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి తీవ్రగాయా లయ్యాయి. భూత్పూర్ పోలీస్ ఎస్సై చంద్రశేఖర్ తెల్పిన వివరాల ప్రకారం ఖిల్లాఘన్‌పూర్ నుంచి భూత్పూర్‌కు ఐదుగురు ప్రయాణీకులతో వస్తున్న టీజీ 32టీ 2284 నెంబరు గల ఆటో, మహబూబ్‌నగర్ నుంచి కూల్ డ్రింక్స్ లోడ్‌తో నాగర్‌కర్నూల్ వైపు వెళ్లే మరో ఆటో పర స్పరం ఢీకొన్నాయి.

ప్రమాదంలో ఐదుగురు ప్రయాణీకులతో ఖిల్లాఘన్‌పూర్ నుంచి భూత్పూర్ వైపు వస్తున్న ఆటోలో ప్రయాణించే ఖిల్లా ఘన్‌పూర్ గట్టుకాడిపల్లికి చెందిన గుంపల్లి వంశీ (24), ఇదే మండలం దొంతికుంటతండాకు చెందిన పాత్లావత్ సక్రి(33), భూత్పూర్ మండలం పోతుల మడుగుకు చెందిన చౌదరి నర్సింహారెడ్డి (56) మృతి చెందారు. ఇరువురు వంశీ, నర్సింహారెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, మరో మహిళ పాత్లావత్ సక్రి తలకు బలమైన గాయాలతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

# సామాజిక ఉద్యమంగా వనమహోత్సవం

## జిల్లాల వారీగా లక్ష్యాలపై ప్రిన్స్‌పల్ సెక్రటరీ అహ్మద్‌నదీమ్ సమీక్ష

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త :** అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు 2025సంవత్సర వన మహోత్సవం కార్యక్రమాన్ని సామాజిక ఉద్యమంగా సాగుతుంది. జిల్లాలు, డిపార్టుమెంట్లవారీగా మొక్కలు నాటడంపై గురువారం సచివాలయంలోని అటవీశాఖ మంత్రి ఛాంబర్‌లో ఉన్నతాధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని అటవీ, పర్యావరణ శాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ సువర్ణ నిర్వహించగా, అన్ని విభాగ అధికారులు పాల్గొన్నారు. ఇప్పటివరకు మొక్కలు నాటిన ప్రాంతాలకు జీయో టాగింగు పూర్తనట్టు గుర్తించారు. ఈ సంవత్సరం 18.03 కోట్ల మొక్కలు టార్గెట్ పెట్టుకోగా... 13.84 కోట్ల మొక్కలు ప్లాంటేషన్ పూర్తి చేసినట్టు వివరించారు. 77 శాతం టార్గెట్ పూర్తి చేసినట్టు స్పష్టం చేశారు. అయితే, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పచ్చదనాన్ని మరింత విస్తరింప చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది మొక్కలు పెంచే కార్యక్రమాన్ని వన మహోత్సవం పేరిట చేపడుతున్న విషయం తెలిసిందే. అటవీ అధికారులు సిద్ధం చేసిన పీపీటీని ప్రిన్స్‌పల్ సెక్రటరీ, పీసీసీఎఫ్ వీక్షిం చారు. సమగ్రంగా వివరాలు అడిగి తెలుసు కున్నారు. అన్ని డిపార్టుమెంట్లలో ఈ మొక్కలు నాటుతున్నప్పుడు ఎదరవుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టి వచ్చింది. అయితే, గత ఏడాది అనుభవాల ఆధారంగా మరింత పక్కాగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు వన మహోత్సవం కింద పకడ్బందీ కార్యచరణ రూపొందిం చాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో.. అన్ని మండలాలు, గ్రామాలు, మున్సిపాలిటీల్లో పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు సన్నద్ధం అవ్వాలని ఆదేశించారు. ఈ సారి 100 శాతం మనం పెట్టుకున్న టార్గెట్ రీచ్ కావాలని మంత్రి సురేఖ ఆదేశించిన విషయాన్ని అధికారులు గుర్తు చేశారు.

# రోడ్డు భద్రతలో ట్రాఫిక్ పోలీసుల పాత్ర కీలకం

## హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ సదస్సును ప్రారంభించిన గవర్నర్ జిష్ణుదేవ్

**హైదరాబాద్ (బేగంపేట), సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** పిల్లలు పాఠశాల నుంచి సురక్షితంగా ఇంటికి చేరాలన్నా, రోగులు సమయానికి ఆస్పత్రికి చేరాలన్నా, ప్రజలు ఒత్తిడి లేకుండా ప్రయాణించాలన్నా ట్రాఫిక్ పోలీసుల పాత్ర ఎంతో కీలకమని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. గురువారం నెక్లెస్‌రోడ్డులోని జలవిహార్‌లో హైదరాబాద్ సిటీ పోలీసు సంయుక్తంగా నిర్వహించిన ట్రాఫిక్ రోడ్డు భద్రతా సమ్మిట్ 2025ను గవర్నర్ జిష్ణుదేవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంచారు. ఈ సమ్మిట్ రెండు రోజులుపాటు జరగనుంది. సమ్మి ట్‌లో నగరంలోని ట్రాఫిక్ నిపుణులు, పరిశ్రమ ప్రముఖులు, విద్యావేత్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని గవర్నర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రజలు, ప్రభుత్వ భాగస్వామ్యంగా హెచ్‌సీఎస్‌సీ ఇతర నగరాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. విద్యాసంస్థలు ఇతరులు ట్రాఫిక్ విభాగానికి సహకరించాలని కోరారు. నగర పోలీసు కమిషనర్ సివి ఆనంద్ మాట్లాడుతూ నగరంలో రోజు రోజుకు పెరుగుతున్న వాహనాలతో ట్రాఫిక్ కు అంతరాయం లేకుం డా ఉండేందుకు చేపట్టా ల్సిన అన్ని రకాలైన ముందస్తు జాగ్రత్త చర్యలు ఎప్పటికప్పుడు చేపడుతున్నట్లు ఆయన పేర్కొ న్నారు. 92లక్షల వాహా నాలు, రోజుకు 1500కొత్త వాహానాలు రోడ్లపై ప్రయాణిస్తున్నాయ న్నారు. ట్రాఫిక్ నిర్వహణ నగర భద్ర తకు కీలకమని ఆయన అన్నారు. ప్రజల సహకారంతో ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌లో మార్పులు చేసుకుంటూ ప్రజలు, వాహన దారులకు ఇబ్బందులు రాకుండా చూసు కుంటు న్నామన్నారు. ప్రజల సహకారాన్ని పోలీసుల తరుపున అభినందిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ సీపీ విక్రమ్ సింగ్‌మాన్, జాయింట్ సీపీ జోయల్ డేవిస్, హెచ్‌సీఎస్‌సీ ట్రాఫిక్ ఫోరం జాయింట్ సెక్రటరీ వి.రాజశేఖరరెడ్డి, ట్రాఫిక్, ఎల్అండ్‌ఓ విభాగాల అన్ని డీసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



రోడ్డు భద్రతా సదస్సును ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

# తహశీల్దార్ కార్యాలయంలో ఎసిబి దాడులు

## లంచం కేసులో పట్టుబడిన ఇద్దరు అధికారులు

**వనపర్తి క్రైమ్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** ఏసీబీ వలలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ ఉద్యోగుల్లో అవినీతి ఆగడాలు ఆపడానికి ఏసీబీ కఠిన చర్యలు కొనసాగిస్తోంది. ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట లంచగొండి అధికారులు పట్టుబడుతున్నా, అవినీతి ఆగకపోవడం విచారకరం. తాజాగా వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని తాహసిల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు నిర్వహించి, రెవెన్యూ విభాగానికి చెందిన ఇద్దరు అధికారులను అదుపులోకి తీసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని నిర్విన్ గ్రామానికి చెందిన రైతుకు చెందిన ఇనాం భూమి రద్దు కోసం వనపర్తి ఆర్డీఓకు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తును వనపర్తి ఆర్డిఓ కార్యాలయం నుండి సంబంధిత మండలం కొత్తకోట తహసిల్దార్ కార్యాలయానికి పంపించారు. ఆర్డిఓ ఆదేశాల మేరకు కొత్తకోట మండల తహసిల్దార్ ఆ కార్యాల యంలోని ఎంఆర్ఐ వాసు అదేవిధంగా డిప్యూటీ సర్వేయర్ నవీన్ రెడ్డిలకు దరఖాస్తును పరిశీలించాలని సూచించారు. దరఖాస్తును పరిశీలించిన అధికారులు అనుకూలంగా వివరణ అందించేందుకు రూ. 40,000 డిమాండ్ చేయగా రైతు ఎసిబిని ఆశ్రయించాడు. ఏసీబీ బృందం లింగస్వామి, జిలాని, కిషన్ నాయక్‌లతో గురువారం కొత్తకోట మండల కార్యాలయంలో సంబంధిత అధికారులను విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

# ఎస్‌సి గురుకుల విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రతిభ చాటేలా ప్రణాళికలు రూపొందించాలి

## గురుకుల కార్యదర్శి కృష్ణఆదిత్యకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సూచన

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** ఎస్‌సి గురుకుల సొసైటీ నూతన కార్యదర్శిగా ఇంటర్ విద్య డైరక్టర్ కృష్ణ ఆదిత్య గురువారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. మాసబ్‌ట్యాంక్‌లోని డిఎస్ఎస్ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గురుకులాలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ నూతన కార్యదర్శికి పలు సూచనలు చేశారు. మంత్రి మాట్లాడుతూ... గురుకుల విద్యాలయాల విద్యా ర్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుకునేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయంతో విద్యా ర్థులకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలనీ, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రోత్సహించే విధంగా అకడమిక్ కార్యక్రమాలు అమలు చేయాలని సూచించారు. విద్యా ప్రమాణాల పెంపు దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

గురుకుల కార్యదర్శిగా అదనపు బాధ్యతలు స్వీకరించిన కృష్ణ ఆదిత్య.. సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థుల విద్యా ప్రగతి, శిక్షణా ప్రమాణాల పెంపుపై మరింత దృష్టి సారించాలన్నారు. ప్రతి ఉద్యోగి తాను నిర్వహిస్తున్న బాధ్యతను సమగ్రంగా నిర్వర్తించాలని, పరి పాలనలో పారదర్శకత, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ సమయ పాలనను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.

# మైనారిటీ గురుకులాల్లోని టీచర్లకు వేతనాలు చెల్లించాలి

## కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులను పర్మనెంట్ చేయాలి

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** మైనారిటీ గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పది నెలల వేతనం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది ఉపాధ్యాయులు గురు వారం నాడిక్కడ మైనార్టీ గురుకుల కార్యాలయా న్ని ముట్టడించారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బిసి విద్యార్థి సం ఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న టీచర్స్ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అక్కడే మొహరించిన పోలీసులు ఈ ముట్టడిని అడ్డుకునేందుకు ప్రయ త్నించారు. దీంతో పోలీసులకు వ్యతిరేకంగా టీచర్స్‌కు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కొద్ది సేపు ఉద్రిక్తత వాతావరణ ఏర్పడింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య టీచర్స్, పోలీసులను శాంతింపజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణ య్య, పిజిఆర్‌టి రాష్ట్ర అధ్యక్షుడు వేమ్‌రెడ్డి దిలీప్‌రెడ్డి, ఎస్‌టియు అధ్యక్షుడు సదానందం మాట్లాడుతూ మైనార్టీ గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్–ఔట్‌సోర్సింగ్ టీచర్లను పర్మినెంట్ చేయాలని, ఏడాదికి 12 నెలలకు వేతనాలు చెల్లించాని డిమాండ్ చేశారు. ఈ కాంట్రాక్ట్ టీచర్లకు రెగ్యులర్ టీచర్లకు ఉండే అన్ని అర్హతలు ఉన్నాయని, పోస్టులకు తగు బిఇడి, డిఇ విద్యార్హత ఉందని, నోటిఫికేషన్ ద్వారా, మెరిట్ కమ్ రోస్టర్ ద్వారా ఈ మేరకు ఎంపిక చేయడం జరిగిందన్నారు.

# సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌గా ఏనుగు నరసింహారెడ్డి బాధ్యతలు స్వీకరణ



పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న డా. ఏనుగు నరసింహారెడ్డి, ఆచార్య నిత్యానందరావు, డా. ఎన్.బాలాచారి తదితరులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), సెప్టెంబరు 18, ప్రభాతవార్త :** రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడుగా డా. ఏనుగు నరసింహారెడ్డి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం నిన్ననే సంచాలకుడుగా నియ మిస్తూ జీఓ విడుదల చేసింది. రెండు సంవ త్సరాలపాటు డిప్యుటేషన్ ప్రాతిపదికన నియమితులైన నరసింహారెడ్డి గురువారం రవీంద్రభారతి ప్రాంగణం కళాభవన్‌లోని భాషా సాంస్కృతికశాఖ కార్యాలయంలో సంబంధిత పత్రాలపై సంతకం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత ఏర్పాటు చేసిన తెలంగాణ సాహిత్య అకాడమీలో తొలి ఛైర్మన్ డా. నందిని సిధారెడ్డితో కలిసి, తొలి కార్యదర్శిగా పనిచేసిన డా. ఏనుగు నరసింహారెడ్డి, ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతం కావడానికి విశేష కృషిచేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, ఎక్సైజ్‌శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు నరసింహారెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. నామోజు బాలాచారిలతో పాటు పలువురు ప్రముఖులు, సాహిత్యవేత్తలు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు, రవీంద్రభారతి, సాంస్కృతికశాఖ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



# సిఎం రేవంత్‌రెడ్డితో ఎన్వీఎస్ రెడ్డి భేటీ

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా)గా బాధ్యతలు స్వీకరించిన ఎన్వీఎస్ రెడ్డి గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సీఎంకు పుష్ప గుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. నగర రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరచడానికి తగు సలహాలు ఇవ్వవలసిందిగా ముఖ్యమంత్రి ఎన్వీఎస్ రెడ్డికి సూచించారు.

# ముందు నీ పార్టీని చక్కబెట్టుకో

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో దమ్ముంటే సత్తా చూపించు

### కెటిఆర్‌పై మంత్రి పొంగులేటి ధ్వజం



**ఏదులాపురం మున్సిపాలిటీ, ప్రభాతవార్త :** నీకు విజన్ ఉందా? నీ నాన్నకు ఉందా తెలుసుకో కేటీఆర్ ... ముందు నీ ఇంటిని, నీ పార్టీని చక్కబెట్టుకో.. మూడున్నరేళ్ల తర్వాత వచ్చే ఎన్నికల్లో నువ్వు అమెరికాలో ఉంటావా.. ఇండియాలో ఉంటావా అన్నది కూడా రాష్ట్ర ప్రజలకు సందేహమే. దమ్ముంటే రానున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మీ పార్టీ సత్తా చూపించండి" అంటూ తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కేటీఆర్‌కు సవాల్ విసిరారు. గురువారం వరంగల్ క్రాస్ రోడ్‌లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన 80కుటుంబాలకు చెందిన వారు కాంగ్రెస్‌లో చేరగా వారికి మంత్రి స్వయంగా కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు ఎప్పటికీ మరవలేనివని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాటు ప్రజల కలలను ఛిద్రము చేసిందని మండిపడ్డారు. వారి హయంలో ఒక లక్ష ఇళ్లు ప్రతి సంవత్సరం కట్టివుంటే, పది లక్షల పేద కుటుంబాలకు గృహాలు అందేవి. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం లాంటి ప్రాజెక్టుల కమీషన్లలో మునిగిపోయింది. పాము కొర్రల్లో విషం పెట్టుకున్నట్టే, వీరంతా ఒళ్ళంతా విషం నింపుకుని తిరుగుతున్నారని" ఘాటుగా విమర్శించారు. 2023లో జరిగిన ఎన్నికల్లో నీ నాయన పాలేరులో నన్ను ఓడించడానికి కంకణం కట్టుకుని తిరిగా కాంగ్రెస్ కార్యకర్తలు నన్ను భారీ మెజార్టీతో గెలిపించారని.. పార్టీ ముందు నువ్వెంత బచ్చాగాడివి.. అని మంత్రి పొంగులేటి హెద్దేవ చేశారు. వచ్చే ఎన్నికల్లో నువ్వు నిలబడతావా? నీ మీద బచ్చగాన్ని పెట్టి మళ్లీ పార్టీ గెలిపిస్తుందని కేటీఆర్‌కు సవాల్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజలు బీఆర్ఎస్‌కు గట్టి బుద్ధి చెప్తారని, అసెంబ్లీ , లోక్ సభ ఎన్నికల్లోనే ప్రజలు వారిని పక్కన పెట్టేశారని మంత్రి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పేదలకు ఇళ్లు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు కాంగ్రెస్ పార్టీ వచ్చాక జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి, టీపీసీసీ నాయకులు ధరావత్ రామ్మూర్తి నాయక్, బొర్రా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లి ఆలయంలో భక్తులు సందడి

- వకుళమాత అన్నదాన భవనం నిర్మాణానికి 2 లక్షలు విరాళం
- స్వామివారి ఒక్కరోజు ఆదాయం, రూ 4,లక్షలు
- వెంకన్న ఆలయానికి గ్రామీణ బ్యాంకు క్యాష్ కౌంటింగ్ మిషన్ బహుకరణ

**ఆత్రేయపురం, సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం. గురువారం అశేష భక్తజనంతో శోబిల్లింది ఏడు వారాల నోము పూర్తయిన. భక్తులు వసంతం మండపంలో అష్టోత్తర శతనామావళి, గోపూజ, నిత్య కళ్యాణం, బాలభోగం, నివేదన, పవళింపు సేవ తదితర కార్యక్రమాలు అర్చకులు వేదమంత్రాలతో కమనీయంగా నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సన్నిధిలో నూతనంగా నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనం నిర్మాణానికి.విశాఖపట్నం జిల్లా, చిన్న ముసిడివాడకి చెందిన సిరికి అప్పాజీరావు, శ్రీదేవి, దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు రూ. 2,00,116లు. మండపేటకి చెందిన ఉంగరాల సీత రామ్ ప్రసాద్, పద్మావతి, దంపతులు వారి కుటుంబ సభ్యులు రూ. 40,116లు. విరాళంగా అందించారు. వారికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్ కార్యనిర్వహణాధికారి నల్లం





సూర్య చక్రధరరావు, సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు, శ్రీ స్వామివారి చిత్రపటం ప్రసాదాలను అందజేశారు. అనంతరం వెంకన్న ఆలయానికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ లక్ష్మీ పోలవరం శాఖ తరపున క్యాష్ కౌంటింగ్ మిషన్ ను అందించారు. ఈ మేరకు క్యాష్ కౌంటింగ్ మిషన్ ను ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావుకు బ్యాంక్ అధికారులు బుధవారం రోజున అందజేశారు.స్వామివారికి వివిధ సేవలద్వారా రూ,4,29,643లు ఆదాయం సమాకూరినట్లు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ముదునూరి వెంకటరాజు, కాయల జగన్నాధం, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ప్రాంతీయ మేనేజర్ జి శ్రీనివాసరావు, ప్లానింగ్ హెడ్ ఎమ్ కె ఎస్ శంకర్, లక్ష్మీ పోలవరం శాఖ మేనేజర్ డి రాజేష్, సిబ్బంది డి సూర్యగోపాల్,హేమలత తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కోరుతూ విఆర్ఏ ల నిరసన

**మామిడికుదురు, సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యల పరిష్కారం కోరుతూ మామిడికుదురు మండల రెవిన్యూ కార్యాలయం వద్ద విఆర్ఏ లు గురువారం నిరసన తెలిపారు. నామినీ విఆర్ఏ లను పర్మినెంట్ విఆర్ఏ లుగా గుర్తించాలని,జీతాలు పెంచాలని,పేస్కెల్ ప్రమోషన్లు వంటి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంఘం మండల శాఖ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు,కార్యదర్శి



కె.సత్యనారాయణ,ఎం.సుబ్రహ్మణ్యం, కె.సీతారామయ్య, యు.కొర్లపాటి తదితరులు పాల్గొన్నారు.

# యుటిఎఫ్ రణభేరి సభను విజయవంతం చేయండి



**మామిడికుదురు, సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
ఈనెల 25 వ.తేదీన విజయవాడలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో జరిగే రణభేరి సభను విజయవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్యోతిబసు పిలుపు నిచ్చారు.యుటిఎఫ్ రణభేరి బైక్ జాతా గురువారం మామిడికుదురులో ప్రవేశించింది.స్థానిక బస్ స్టాండ్ సెంటర్లో జరిగిన సమావేశంలో యుటిఎఫ్ ప్రతినిధులు మాట్లాడారు.ఉపాధ్యాయులు జాతాకు ఘనంగా స్వాగతం పలికారు.పేరుకుపోయిన వేల కోట్ల ఆర్థిక బకాయిలను చెల్లించాలని 12వ.పిఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు.జాతాలో జిల్లా అధ్యక్షులు సురేంద్ర, కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

# మ్యాజిక్ డ్రైన్ నిర్మాణ పనులు పరిశీలన

-జిల్లా డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి

**గండేపల్లి , సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
గండేపల్లి మండలం సింగరంపాలెం గ్రామ పంచాయతీ నందు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అడపా వెంకటలక్ష్మి, ప్రాజెక్ట్ మేనేజర్ బి.విజయ్ భాస్కర్ మ్యాజిక్ డ్రైన్ పనుల నిర్మాణమును పరిశీలించారు. ఈ కార్యక్రమము నకు పరిపాలనా అధికారి కె.చంద్ర రావు,ఎపిఓ ఎం.రామకృష్ణం రాజు, గ్రామీణ ఉపాది హామీ పనులు క్వాలిటి కంట్రోల్ అధికారిణి జి.శ్వేత,ఈసి



రమేష్, ఉపాది హామీ సిబ్బంది స్థానిక నాయకులు బి.రామకృష్ణ పాల్గొన్నారు.

# పోషక తృణధాన్యాల సాగుపై రైతులకు శిక్షణ



**రౌతులపూడి,, సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
మండలంలోని ఎం. కొత్తూరు గ్రామం లో గురువారం జాతీయ ఆహార భద్రతా మిషన్ పథకంలో భాగంగా రైతులకు పోషక తృణధాన్యాల సాగుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రాగి, ఇతర తృణధాన్యాల సాగు యాజమాన్య పద్ధతులు, వాటిని సాగు చేయవలసిన ఆవశ్యకత, వాటిలోని పోషక విలువల గురించి రైతులకు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వనరుల కేంద్రం ఏ డి ఏ మాలకొండయ్య , ఏవో సంజయ్, ఏఈ ఓ ఆర్.మౌళి ప్రసాద్ పాల్గొన్నారు.

## రాజకీయ పైరవీలతో కుర్చీ వదలని ఏపీవో

**కాకినాడ, సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
రౌతులపూడి మండలం ఎంజిఎన్ఆర్ఇజిఎస్ విభాగానికిఎఫ్. ఏ. సి ఏపీఓగా పనిచేస్తున్న దాట్ల సురేష్ నుయు. కొత్తపల్లి కి బదిలీ చేస్తూ ఈ నెల4న కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. నేటికీ ఆయన రిలీవ్ కాలేదు. ఆస్థానములో నియమించిన జె. ఇ కాంచన కు బాధ్యతలు అప్పగించలేదు. ఆయనకు బదిలీ ఉత్తర్వులు వచ్చి 15 రోజులు అవుతున్న రాజకీయ పైరవీలతో కుర్చీ వదల్లేదని బహిరంగంగా పలువురు వెల్లడిస్తున్నారు. టెక్నికల్ అసిస్టెంట్ అయినా ఎఫ్. ఏ. సి ఏపీఓ బాధ్యతలు చేపట్టారు. దీంతో కుర్చీ వదల్లేకపోతున్నారంటున్నారు. బదిలీ అయిన ఉద్యోగి రెండు, మూడు రోజుల్లో రిలీవ్ అవుతారు. అటువంటిది రిలీవ్ కానీ పరిస్థితి పై సర్వత్ర చర్చనీయాంసమవుతుంది.

# కాకినాడ జిల్లాకు పిఠాపురం మహారాజా పేరు పెట్టాలి

-మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఆదిత్య యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి



**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
తెలుగు భాషకు చిరస్మరణీయమైన రచనలు అందించి గొప్ప సంస్కరణ వాదిగా తెలుగు ప్రజలకు ఎనలేని సేవలు చేసిన మహనీయుడు పిఠాపురం మహారాజా అని మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ ఆదిత్య యూనివర్సిటీ ఛాన్సలర్,ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి అన్నారు. పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రస్తుత కాకినాడ జిల్లాకు పిఠాపురం మహారాజా పేరు పెట్టాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. పిఠాపురం మహారాజా రావు సూర్యారావు బహదూర్ సంఘ సంస్కరణకు విద్యాభివృద్ధికి దళిత జనార్ధరణకు విశేషంగా కృషి చేశారన్నారు. తెలుగు భాష వికాశానికి శ్రీ సూర్య రాయాంధ్ర నిఘంటువు తయారుచేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు కవులను రచయితలను శ్రీకృష్ణ దేవరాయల తర్వాత అదే స్థాయిలో ఆదరించారన్నారు. మహిళ అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహనీయుడు అన్నారు.తెలుగు ప్రాంతంలో సాంస్కృతిక వికాసానికి దోహదం చేసిన వారి పేరును ప్రభుత్వం ఈ జిల్లాకు పెట్టడం సముచితంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఆదిత్య విద్యాసంస్థలు, పిఠాపురం మహారాజా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం అక్టోబర్ 5వ తేదీన పిఠాపురం మహారాజా వారి జయంతి సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జాతీయస్థాయి కథ కవిత సంపుటాల పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తున్నామని తెలిపారు.

## వాడపల్లి దేవస్థానం చైర్మన్‌గా ముదునూరి వెంకటరాజు నియామకం



**ఆత్రేయపురం, సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
ఏడువారాల వెంకన్న గా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం చైర్మన్ గా ఆత్రేయపురంగ్రామనికి చెందిన మాజీ మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు( గబ్బర్ సింగ్ )ను రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ శాఖ నియమించింది. ఈ మేరకు గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రధాన ఆలయాలకు చైర్మన్ ల నియమిస్తూ ఆదేశాలిచ్చింది. కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి చైర్మన్ గా గబ్బర్ సింగ్ ను నియమించడం పట్ల పలువురు కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈయన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు అత్యంత సన్నిహితుడు, కొత్తపేట నియోజకవర్గంలో ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్ ) ఎమ్మెల్యే బండారుకు ప్రాధాన్యత క్రమంలో ముందు వరుసలో ఉన్నారు. త్వరలో ట్రస్ట్ బోర్డు సభ్యులు నియామకం, ప్రమాణస్వీకారం తదితర కార్యక్రమాలు నిర్వహించటానికి ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

# జిల్లా వైద్య ఆరోగ్య శాఖ టాస్క్ పోర్స్ కత్తిపూడి గ్రామ సచివాలయం 2 సందర్శన

**శంకవరం, సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
శంఖవరం మండలం లోని రావికంపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లో కత్తిపూడి 2 గ్రామ సచివాలయంను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్ఫోర్స్ టీం గురువారం సందర్శించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్జె. నర్సింహా నాయక్ ఆదేశము ల మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్ టీం సందర్శించారు.ఈ బృందం గ్రామం లో ఉన్న గర్భిణీ స్త్రీలను, పిల్లలు కిషోర్ బాలికలను గ్రామ సచివాలయంలో స్వయంగా కలిసి వారికీ ప్రభుత్వం తరుపున అందుతున్న సేవలు మరియు స్కీమ్స్ సక్రమంగా అందుతున్నాయో లేనిది అడిగి తెలుసుకున్నారు . పలువురు గర్భిణీలను



హేమోగ్లోబిన్ శాతం పరీక్షించి తక్కువ శాతం ఉన్న వారికీ తగు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం బాలింతలు కిషోర్ బాలికలకు సబ్ సెంటర్ సిబ్బందితో మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా డిపిహెచ్ఎన్ఓ టీ నీలవేణి, డిపిఓ జి.మహేష్, మరియు హెల్త్ సూపర్వైజర్ తాతారావు,కత్తిపూడి ఆయుషమాన్ ఆరోగ్య మందిర్ వైద్య సిబ్బంది, ఆశలు పాల్గొన్నారు.

# గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలి

**పిఠాపురం, సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి, వాటిని వెంటనే పరిష్కరించాలని, పిఠాపురం మండల గ్రామ రెవెన్యూ సహాయకులు డిమాండ్ చేశారు.ఇందులో భాగంగానే గురువారం పట్టణంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు అప్పలస్వామి, రాజారత్నం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండు రోజుల పాటు ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకుల ప్రధాన సమస్యలైన పే స్కేలు అమలు,కారుణ్య నియామకాలు,అర్హులైన



వారికి ప్రమోషన్స్ కల్పించాలన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో దశల వారి పోరాటాలు కొనసాగిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పిఠాపురం మండల గ్రామ రెవెన్యూ సహాయకులు సత్తియ్య,తమ్మారావు, సూర్యనారాయణ, తాతారావు,శేషరత్నం,నూకరత్నం, అబ్బులు, భాషా, తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతలతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యం ఇద్దాం కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి నరసింహా కిషోర్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ను గురువారం కలెక్టర్ కార్యాలయ ఛాంబర్లో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి. నరసింహ కిషోర్ మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, శాంతి భద్రతల పరిరక్షణ, చట్టసవ్యస్థల సమర్థవంతమైన అమలు వంటి విభిన్న అంశాలపై ఇరువురు అధికారుల మధ్య విశదీకరణ జరిగింది. సమన్వయంతో కలసి ముందుకు సాగి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు రెవెన్యూ, పోలీస్ విభాగాల పాత్రపై సవివరంగా చర్చించారు.జిల్లా శాంతి భద్రతలు కాపాడటమే కాకుండా, పరిపాలనలో పారదర్శకత, శీఘ్ర స్పందన, ప్రజలతో నేరుగా మమేకమయ్యే విధానాలపై దృష్టి సారించేందుకు , జిల్లా అభివృద్ధి, ప్రాధాన్యత అంశాలపై పరస్పరం ఆలోచనలు పంచుకున్నారు.

# మాజీ సిఎం జగన్ ను కలిసిన నరసింహం రాంజీ పాపారావు

**గండేపల్లి, సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ను మాజీమంత్రి తోట నరసింహం, తనయుడు తోట రాంజీ,గండేపల్లి మండలం పి. నాయకంపల్లి వైసిపి నాయకులు మలిరెడ్డి పాపారావు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పాపారావు పి.నాయకంపల్లి గ్రామదేవత శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవారి చిత్రపటాన్ని జగన్ కి అందజేశారు. అనంతరం గండేపల్లి మండలంలో వైసిపి పార్టీ గురించి చర్చించనట్లు తెలిపారు.



# యల్లమిల్లిలోస్వస్త్ నారి - స్వశక్తి పరివార్ అభియాన్ వైద్య శిబిరం



**గండేపల్లి, సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామంలో సూరంపాలెం పిహెచ్ సి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వస్త్ నారి - స్వశక్తి పరివార్ అభియాన్ ప్రత్యేక వైద్య శిబిరంలో ముఖ్య అతిథిగా యల్లమిల్లి గ్రామ టిడిపి అధ్యక్షులు సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూమహిళల ఆరోగ్యమే కుటుంబానికి బలం, సమాజాభివృద్ధికి పునాది అని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఆలోచనలతో ఈ కార్యక్రమం రూపుదిద్దుకుందని, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. జగ్గంపేటలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో జెడ్ రాగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐదు రోజులపాటు పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు హరిత, సింధు, వై శ్రీనివాసరావు, టి శ్రీదేవి, ప్రకాష్, రవి, దినేష్, కిషోర్ రోజా,రమేష్, ఉష వైద్య సేవ అందించగా సర్పంచ్ నూకతట్టు నాగజ్యోతి, పాల్గొన్నారు.

# పదవ తరగతి ఉత్తీర్ణతలో జిల్లాను మొదటి స్థానంలో నిలపడమే లక్ష్యం: డిఈఓ డాక్టర్ సలీం భాషా

**అంబాజీపేట, సెప్టెంబర్ 18 , ( ప్రభాతవార్త ) :**
పదవ తరగతి ఉత్తీర్ణతలో నూరు శాతం సాధించి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాను మొదటి స్థానంలో ఉంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీమ్ భాషా తెలిపారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్లో డీఈఓ సలీం భాషా గురువారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని జెడ్పీ హైస్కూళ్లలో పదవ తరగతి విద్యార్థులకు ఉదయం 8 నుంచి 9, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకుని అర్ధమయ్యే రీతిలో పాఠాలు బోధిస్తున్నారన్నారు. గత ఏడాది జిల్లాలో 91 శాతం ఉత్తీర్ణత వచ్చిందన్నారు. దానిని దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు.. పదవ తరగతి విద్యార్థులు నిత్యం పాఠశాలకు వచ్చేలా వారి తల్లితండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. శుక్రవారం (నేడు) నుండి ఎస్జీఎఫ్ క్రీడలను



ప్రారంభించనున్నామన్నారు. అనంతరం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న తీరును డీఈఓ పరిశీలించారు. విద్యార్థులకు ఇచ్చిన వర్కును,నోట్ పుస్తకాలను తనిఖీ చేశారు. ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, హెచ్ఎం కడలి సాయిరామ్, స్టాఫ్ సెక్రటరీ బి.ఎస్ఎన్.మూర్తి, పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, పీఈటీ అందె సూర్యకుమారి, ఉపాధ్యాయులు ఆయన వెంట ఉన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# టి-20ల్లో నమీబియా సంచలనం

## 13 బంతుల్లోనే హాఫ్ సెంచరీ.. జాన్ ఫ్రైలింక్ విధ్వంసం



**బులవాయో(జింబాబ్వే), సెప్టెంబర్ 18:** అంతర్జాతీయ టీ20ల్లో నమీబియా కుర్రాడు విధ్వంసం సృష్టించాడు. ఆతిథ్య జింబాబ్వేతో గురువారం జరిగిన మ్యాచ్‌లో జాన్ ఫ్రైలింక్ కేవలం 13 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. టాస్ గెలిచిన నమీబియా తొలుత బ్యాటింగ్ చేసింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన జాన్ ఫ్రైలింక్ ఆరంభం నుంచి జింబాబ్వే బౌలర్లపై ఎదురుదాడి మొదలుపెట్టాడు. తొలి ఓవర్‌లో వరుసగా 3 ఫోర్లు, రెండో ఓవర్‌లో 2 ఫోర్లు, నాలుగో ఓవర్‌లో 2 ఫోర్లు, 3 సిక్సులు బాదేశాడు. ఫ్రైలింక్ విధ్వంసం ధాటికి నమీబియా 4 ఓవర్లలో ఏకంగా 70 పరుగులు చేసింది. అర్ధసెంచరీ తర్వాత కూడా జాన్ ఫ్రైలింక్ మెరుపులు కొనసాగించినా, 31 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్లతో 77 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. మిడిలార్డర్ చేతులెత్తేసింది. ఆల్‌రౌండర్ రుబెన్ ట్రంపెల్‌మన్ 24 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 46 పరుగులు చేయడంతో నమీబియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 204 పరుగులు చేసింది. అనంతరం జింబాబ్వే 205 పరుగుల లక్ష్యఛేదనలో చేతులెత్తేసింది. ఆరంభంలోనే వికెట్లను జారవిడుచుకుంది. కెప్టెన్ సికందర్ రాజా (8) కూడా విఫలమయ్యాడు. సియాన్ విలియమ్స్ 48, రియాన్ బురి 32 పరుగులతో రాణించినా జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయారు.

# హైదరాబాద్ పాంథర్స్ విజయం

## 6 వికెట్ల తేడాతో లాల్ బహదూర్ సిసి ఓటమి



**హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, సి-డివిజన్ వన్డే క్రికెట్ లీగ్ లో హైదరాబాద్ పాంథర్స్ విజయం సాధించింది. 6 వికెట్ల తేడాతో లాల్ బహదూర్ సిసిని ఓడించింది. హైదరాబాద్‌లోని టేల్స్ క్రికెట్ గ్రౌండ్‌లో బుధవారం హైదరాబాద్ పాంథర్స్‌కు, లాల్ బహదూర్ సిసికి మధ్య మ్యాచ్ హోరా హోరీగా జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన లాల్ బహదూర్ సిసి నిర్ణీత 20 ఓవర్ లో 9 వికెట్లు కోల్పోయి 94 రన్స్ చేయగలిగింది. రామ్ చరణ్ 28 పరుగులు, భవిత్‌రెడ్డి 17 పరుగులు నమోదు చేశారు. ఇక తుషార్ క్రాంతి తన పేస్ బౌలింగ్ తో నిప్పులు చెరిగి హైదరాబాద్ పాంథర్స్ విజయానికి బాటలు వేశాడు. తుషార్ రెండు ఓవర్లలో 8 పరుగులు మాత్రమే ఇచ్చి 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 95 పరుగుల లక్ష్య చేదనలో హైదరాబాద్ పాంథర్స్ 17 ఓవర్లలో విజయాన్ని అందుకుంది. హ్రిత్విక్ 29 బంతుల్లో ఆరు ఫోర్ల తో 36 పరుగులు చేశాడు.

# సెంచరీతో కదంతొక్కిన ధ్రువ్ జురేల్

## ఆసీస్‌పై పట్టు సాధించిన భారత్-ఎ జట్టు

## రాణించిన సాయి సుదర్శన్, జగదీశన్

**లక్నో, సెప్టెంబర్ 18:** ఆస్ట్రేలియా-ఏతో లక్నో వేదికగా జరుగుతున్న మొదటి అనధికార టెస్ట్ మ్యాచ్‌లో భారత్-ఏ జట్టు అద్భుతంగా రాణిస్తోంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 4 వికెట్లు కోల్పోయి 403 పరుగులు చేసింది. అయితే, ఇంకా 129 పరుగులు వెనకబడింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా-ఏ 532-6 వద్ద డిక్లేర్ చేసిన విషయం తెలిసింది. భారత్-ఏ జట్టు విషయానికొస్తే, ధ్రువ్ జురేల్ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. అతడి అద్భుతమైన బ్యాటింగ్‌తో ఆసీస్‌కు దీటుగా బదులిస్తోంది. ఆట ముగిసే సమయానికి క్రీజులో దేవ్‌దత్ పడిక్కల్ 86, ధ్రువ్ జురేల్ 113 పరుగులతో ఉన్నారు. 116-1 ఓవర్ నైట్ స్కోర్‌తో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత జట్టు అద్భుతంగా పోరాడుతోంది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(8) విఫలం కాగా, నారాయణ్ జగదీశన్ (64), సాయి సుదర్శన్ (73) రాణించారు. ఆసీస్ బౌలర్లలో జేవియర్ బార్ట్‌లెట్, కోరీ రోకిసియోలీ, లియామ్ స్కాట్, కూపర్ కానెల్లీ ఒక్కో వికెట్ పడగొట్టారు.




# ప్చ్.. నీరజ్!

## నిరాశపరిచిన చోప్రా.. 8వ స్థానానికి పరిమితం

## రాణించిన సచిన్.. 4వ స్థానంలో యాదవ్

**టోక్యో(జపాన్), సెప్టెంబర్ 18:** ఇండియన్ ఒలింపిక్ గోల్డ్ మెడలిస్ట్ నీరజ్ చోప్రా వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో తీవ్ర నిరాశపరిచాడు. గురువారంనాడు జరిగిన టోర్నీ ఫైనల్‌లో 12మంది పోటీ పడగా నీరజ్ ఒక్కసారి కూడా 85 మీటర్ల మార్క్ అందుకోలేకపోయాడు. ఉత్తమంగా 84.03 మీటర్లు విసిరి 8వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. మూడు, ఐదో ప్రయత్నంలో ఫౌల్ చేసిన చోప్రా, రెండో ప్రయత్నంలో 84.03 మీటర్లు విసిరారు. నీరజ్ తొలి ప్రయత్నంలో 83.65 మీటర్ల దూరం విసరగా, అతని ప్రత్యర్థి, పాకిస్తాన్ ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్ 82.73 మీటర్లు త్రో విసిరాడు. కర్టిస్ థామ్సన్ 86.67 మీటర్లు విసిరి ప్రథమ స్థానంలో నిలిచాడు. నీరజ్ చోప్రా వరుస ప్రయత్నాలు చేసినప్పటికీ విఫలమయ్యాడు. దీంతో 8వ స్థానానికి పరిమితమై పతక రేసు నుంచి వైదొలగాడు. అటు పాక్ అథ్లెట్ అర్షద్ నదీమ్ కూడా ఈ ఫైనల్‌లో తేలిపోయాడు. రెండు, నాలుగు ప్రయత్నాలలో ఫౌల్ చేసిన అతను, ఉత్తమంగా 82.75 మీటర్ల త్రోతో పదో స్థానంలో నిలిచాడు.

**4వ స్థానంలో నిలిచిన సచిన్ యాదవ్**

ఈ ఫైనల్‌లో పోటీపడిన మరో భారత అథ్లెట్ సచిన్ యాదవ్ అంచనాలకు మించి రాణించి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. 86.27 మీటర్ల త్రో విసిరి మొత్తం మీద నాలుగో స్థానంలో నిలిచాడు. సచిన్ ఐదో ప్రయత్నంలో 85.96 మీటర్ల త్రో విసిరి పతకం ఆశలు కలిగించినా, చివరి ప్రయత్నంలో 80.95 మీటర్ల దూరమే త్రో విసిరాడు. దీంతో సచిన్ 40 సెంటీమీటర్ల తేడాతో కాంస్య పతకం చేజార్చుకున్నాడు. 86.67 మీటర్లతో మూడో స్థానంలో నిలిచిన అమెరికా అథ్లెట్ థాంప్సన్ కాంస్య పతకం అందుకున్నాడు. కెషోర్న్ వాల్కాట్ (ట్రినిడాడ్ అండ్ టుబాబో) 88.16 మీటర్ల త్రో విసిరి స్వర్ణం గెలవగా, అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా) 87.38 మీటర్లతో రజతం చేజిక్కించుకున్నాడు.

## చైనా మాస్టర్స్ 2025 బ్యాడ్మింటన్

# క్వార్టర్ ఫైనల్స్‌కు సింధు

**షెన్‌జెన్(చైనా), సెప్టెంబర్ 18:** చైనా మాస్టర్స్‌లో భారత షట్లర్లు జోరు కొనసాగిస్తున్నారు. రెండుసార్లు ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధు బ్యాడ్మింటన్ టోర్నీలో గురువారం జరిగిన రెండో మ్యాచ్‌లో వరుస సెట్లలో విజయం సాధించింది. వరల్డ్ నం.14 పీవీ సింధు, ప్రత్యర్థి థాయిలాండ్ షట్లర్ పోర్‌పవీ చోచువాంగ్‌ను 21-15, 21-15 తేడాతో మట్టి కరిపించింది. 41 నిముషాలపాటు సాగిన హోరాహోరీ పోరులో ఆరంభం నుంచి సింధు ప్రత్యర్థి చోచువాంగ్‌పై ఆధిపత్యం కనబరించింది. చివరకు విజయం సాధించి, క్వార్టర్-ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. అటు బీడబ్ల్యూఎఫ్ సూపర్ 750 టోర్నమెంట్ మెన్స్ డబుల్స్‌లో సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి- చిరాగ్ శెట్టి జోడీ క్వార్టర్- ఫైనల్స్‌కు చేరుకుంది.



వరల్డ్ నం.7 సాత్విక్- చిరాగ్ జోడీ ప్రత్యర్థి చైనీస్ తైపీస్ చియు సియాంగ్-చీహ్, వాంగ్ చి-లిన్ జంటను 21-13, 21-12 తేడతో ఓడించింది. మ్యాచ్ ప్రారంభం నుంచి సాత్విక్- చిరాగ్ జోడీ ఒక్కో గేమ్ గెలుస్తూ ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచింది. 33నిముషాలపాటు సాగిన మ్యాచ్‌లో చైనా జోడీ ఎక్కడా పోటీ ఇవ్వలేకపోయింది. దీంతో సాత్విక్-చిరాగ్ జోడీ గెలుపొంది, క్వార్టర్-ఫైనల్స్‌కు చేరుకుంది.

# గ్రామీణ క్రీడాప్రతిభను ప్రోత్సహిస్తాం: మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, సెప్టెంబర్ 18:** గ్రామీణ క్రీడాకారుల ఉత్సాహానికి ప్రోత్సాహం ఇచ్చే విధంగా సీఎం కప్ 2025 నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో ఆయన జిల్లా యువజన క్రీడ అభివృద్ధి అధికారులు, మరియు క్రీడా శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ, సీఎం కప్2024 మాదిరిగానే సీఎం కప్ 2025 కూడా గ్రామీణ స్థాయి నుంచి నిర్వహిస్తామని, గ్రామీణ యువ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని మొత్తం అందులో భాగస్వామ్యం చేస్తామని ఆయన తెలిపారు. సీఎం కప్ 2025 నిర్వహణ మొక్కుబడిగా నామమాత్రంగా నిర్వహించకుండా, అందరు ప్రజాప్రతినిధులను మరియు అధికారులను ఇందులో భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. ఇందులో ఎటువంటి పార్టీ భేదాలు లేకుండా ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా స్వయంగా మాట్లాడడం లేఖలు రాసి వారి సహాయాన్ని కోరుతామని, జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామని ఆయన తెలిపారు. కేవలం పోటీలు నిర్వహించడమే కాకుండా ప్రతి క్రీడాకారుడి సమాచారాన్ని నిక్షి ప్తం చేసి ప్రతిభా కలిగిన వారిని గుర్తించి ప్రోత్సహించడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.
స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి, డిప్యూటీ డైరెక్టర్లు స్టేడియం అడ్మినిస్ట్రేటర్లు కోచులు పాల్గొన్నారు.



# సెన్సెక్స్ నిఫ్టీలకు ఫార్మా, ఐటి, ఆర్థికసేవలు ఊతం

## మూడోరోజూ లాభాల్లోనే ముగిసిన ఈక్విటీ మార్కెట్లు




**ముంబయి, సెప్టెంబరు 18:** స్టాక్ మార్కెట్లు మూడోరోజు కూడా లాభాల్లోనే ముగిసాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 0.39శాతం పెరిగి 320.25 పాయింట్లు వృద్ధిని నమోదుచేసి 83,013.96 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. నిఫ్టీ 50 సూచీ కూడా 93.95 పాయింట్లు పెరిగి 25,423.60 పాయింట్లవద్ద స్థిరపడింది. దేశీయంగా జిఎస్టీ సంస్కరణలు, భారత్ అమెరికాలమధ్య చర్చల పురోగతి వంటివ అంశాలు మార్కెట్లకు ఊతం ఇచ్చాయి. ఫార్మా, ఐటి, ఆర్థికసేవల రంగాలషేర్లు పెరిగితే మీడియా, ప్రభుత్వరంగబ్యాంకులసూచీ, రియాల్టీలు కొంత క్షీణించాయి. వరుసగా మూడోరోజు కూడా మార్కెట్లలో బిఎస్‌ఇ పెరుగుతూనే వచ్చింది. బిఎస్‌ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.36శాతంపెరిగితే, స్మాల్‌క్యాప్‌సూచీ 0.01శాతం క్షీణించింది. మార్కెట్లపరంగా మొత్తం 2193 షేర్లు పెరిగాయి. 1984 షేర్లు క్షీణించాయి. 174 కంపెనీలషేర్లు స్థిరంగా కొనసాగినట్లు తెలుస్తోంది. ఇక ఐపిఒ పరంగా యూరోప్రతిక్ సేల్స్ గణనీయంగాపెరిగింది. 1.20 రెట్లు ఇష్యూ కొనుగోళ్లుజరిగాయి. అలాగే విఎంఎస్ టిఎంటి కూడా 19.04 రెట్లు అధికంగా అమ్ముడుపోయింది. ఐవాల్యూ ఇన్ఫోసొల్యూషన్స్ కూడా 0.22 రెట్లు అధికంగా కొనుగోళ్లు జరిగినట్లు తేలింది. నిఫ్టీలో ఫార్మాసూచీ 1.50శాతం పెరిగింది. బయోకాన్ 4.12శాతం, లారెస్ ల్యాబ్స్ 3.4శాతం, గ్లెన్‌మార్క్ ఫార్మాక్యూటికల్స్ 3.29శాతం, నాట్కో ఫార్మా 3.17శాతం, అరబిందోఫార్మా 3.1శాతం, మాన్‌కైండ్‌ఫార్మా 2.62శాతం, ఇప్కా ల్యాబ్స్ 2.32శాం,సన్‌ఫార్మా 1.72శాతం, గ్లాండ్ ఫార్మా 1.62శాతం, జైడస్ లైఫ్‌సైన్సెస్ 1.32శాతం పెరిగాయి. ఇతరత్రా అజంతా ఫార్మా 0.56శాతం గ్రాన్యూల్స్ ఇండియా 0.51శాతం, అబ్బట్ ఇండియా 0.29శాతం దిగుశ్రేణిలో ముగించాయి. యూరోపియన్ మార్కెట్లు ఫెడ్‌రిజర్వు రేట్‌కట్‌పైనే ఎక్కువ ఫోకస్ పెట్టారు. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ ఇతర ప్రపంచ బ్యాంకుల వడ్డీరేట్లపైనా దృష్టిపెట్టారు. ఆసియా మార్కెట్లు కొంతమేర దిగువస్థాయిలోనే ముగిసాయి. ఫెడ్‌రిజర్వుచైర్మన్ జెరోమ్‌పావెల్ 20 బేసిస్ పాయింట్లు తగ్గింపును రిస్క్‌మేనేజ్‌మెంట్‌గా అభివర్ణించడమే కాకుండా భవిష్యత్తులో మరో రెండు రేట్‌కట్‌లు ఉంటాయని సంకేతాలిచ్చారు. బ్యాంక్ ఆఫ్‌జపాన్‌కూడా తన పాలసీరేట్లను సవరిస్తుందన్న అంచనాలున్నాయి. చైనా సెంట్రల్ బ్యాంకు కీలక వడ్డీరేట్లను మాత్రం స్థిరంగానే కొనసాగించింది. డౌజోన్స్ పారిశ్రామిక సగటు రికార్డు స్థాయికి పరిగింది. 260.42 పాయింట్లు పెరిగింది. ఎస్‌అండ్‌పి 500 మాత్రం 0.1శాతం క్షీణించింది. నాస్‌డాక్ కాంపోజిట్‌కూడా 0.3శాతం క్షీణించినట్లు మార్కెట్లలో వాతావరణం కనిపిస్తోంది.

# 32 పైసలు క్షీణించిన భారత్ రూపాయి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** డాలరుతో రూపాయి చెలామణీ 32 పైసలు తగ్గింది. గురువారం 88.13 వద్దనే ముగిసింది. ఈ ఏడాది ఇప్పటివరకూ రూపాయి 2.94శాతం క్షీణించిందని ఇతర ఆసియా కరెన్సీలన్నింటికంటే ఎక్కువ క్షీణించింది భారత్‌కరెన్సీయేనని నిపుణ/లు చెపుతున్నారు. డాలర్‌సూచీ ఫెడ్ పాలసీ నిర్ణయాల తర్వాత కూడా ఎలాంటి ప్రభావం లేకుండా స్థిరంగా కొసాగింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ఫెడ్‌రిజర్వు పాలసీ రేట్లపరంగాను, అన్నింటికంటే కీలకంగా భారత్ అమెరికా వాణిజ్య చర్చలపైనా ఎకునకవ ఫోకస్‌పెంచారు. రూపాయికి మద్దతు 87.75వద్ద నిలిచి చివరకు 88.25వద్ద మరికొంత అనిశ్చితి ఏర్పడింది. చివరకు 88.13వద్ద కరెన్సీ ట్రేడింగ్‌ముగిసింది. ఫెడ్‌రిజర్వుచైర్మన్ జెరోమ్ పావెల్ 25 బేసిస్ పాయింట్ల వడ్డీరేట్లను కోతవిధించారు. ఇదంతా రిస్క్ మేనేజ్‌మెంట్ కోసమేనని ప్రకటించారు.

# 8.71 లక్షలమందికి పెరిగిన భారత్ మిలియనీర్లు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** భారత్‌లో ఏటికేడాది మిలియనీర్లు పెరుగుతున్నారు. రానురాను భారత్‌మిలియనీర్ల హబ్‌గా మారుతోంది. కనీసం 8.5 కోట్ల సంపద కలిగిన వారు 2021 నుంచి ఇప్పటివరకూ 90శాతం వృద్ధి చెందినట్లు హురూన్ ఇండియా సర్వేలో తేలింది. 2021 నాటికి 4.58 లక్షలమంది ఉన్న మిలియనీర్లు అదే ఈ ఏడాది నాటికి 8.71 లక్షలమందికి పెరిగారు. అంటే సుమారు రెట్టింపు సంఖ్యలో ఉన్నట్లు తేలింది. మెర్సిడిస్ బెంజ్ హురూన్ ఇండియా వెల్త్‌రిపోర్టులో ఆసక్తికర అంశాలు బయటపడ్డాయి. మొత్తం కుటుంబాల్లో 0.31శాతం మిలియనీర్ల కుటుంబాలున్నాయి. 2021లో అదే 0.17శాతం మంది మాత్రమే ఉన్నారు. 2017 నుంచి 2025 వరకూ భారత్ 445శాతం వృద్ధిని నమోదుచేసింది. 8.5 కోట్లకుపైగా కుటుంబాలు మిలియనీర్ల జాబితాలోచేరాయి. ఈక్విటీ మార్కెట్లలో వృద్ధి, పెట్టుబడులను ఆకర్షించడంలో మన మిలియనీర్ పారిశ్రామికవేత్తలు ముందంజలో ఉన్నారు. దేశంలో అత్యధికంగా మహారాష్ట్రలో ఉన్నారు. 1.78 లక్షలకుటుంబాలు కనీసం 8.5 కోట్లకుపైబడిన సంపదతో ఉనానరు. ముంబయి ఒక్కటే 1.42 లక్షలమంది ఉన్నట్లు హురూన్‌నివేదిక తెలిపింది. ఢిల్లీలో 79,800 మంది ఉంటే తమిళనాడు మూడోర్యాంకులో ఉంది. మొత్తం మిలియనీర్ కుటుంబాలు 72,600 మందివరకూ ఉన్నారు. భారత్‌లోని టాప్ పది రాష్ట్రాల్లోనే 80శాతంమంది మిలియనీర్ కుటుంబాలున్నట్లు తేలింది. ఢిల్లీ తర్వాత బెంగళూరులో 31,600 మంది వరకూ ఉన్నారు. అహ్మదాబాద్, పూణె, హైదరాబాద్, గురుగ్రామ్‌లు వాటి వాటాను పెంచుకుంటున్నాయి. 2017నాటికి దేశంలో కేవలం ఐదుశాతం మంది మిలియనీర్లు మాత్రం 100 కోట్ల సంపదతో ఉన్నట్లు తేలింది.



# ఫండ్‌పెట్టుబడుల్లో మిలీనియల్స్,జెన్‌జడ్‌లే ఎక్కువ!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** భారత్‌లో మూచువల్‌ఫండ్‌సలో పెట్టుబడులు పెడుతున్న ఇన్వెస్టర్లలో అత్యధికశాతం ఇటీవలికాలంలో మిల్లీనియల్స్, జన్‌జడ్ తరమే ఎక్కువకనిపిస్తోంది. అలయన్స్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్ నిర్వహించిన సర్వే ప్రకారంచూస్తే 93శాతం జన్‌జడ్ తరం పొదుపు వైపు ఆసక్తిచూపిస్తున్నట్లు తేలింది. ఇన్వెస్టర్ల కమ్యూనిటీలో 48శాతం కూడా వీరేకావడం విశేషం. మిల్లినియల్స్,జన్‌జడ్‌ఫరంగాచూస్తే ఈ తరం పెట్టుబడులు 500 నుంచి 600 మిఇయన్ డాలర్లవరకూ ఉన్నట్లుఅంచనా. సంపదపై ఎక్కువ వ్యయంచేయడం కంటే ఎక్కువగా సహాయజమానులుగా నిలుస్తున్నారు. రూ.10 లక్షలనుంచి వారి సంపదను వృద్ధిచేసుకునేందుకు తాపత్రయపడుతున్నారు. నెలవారీ రిటర్నులు సాధించడంలో ఎక్కువ ఫోకస్‌పెడుతున్న జన్‌జెడ్,మిల్లీనియల్స్ పెట్టుబడి పథకాల వడ్డీరేట్లను కూడా నిరంతరం గమనిస్తున్నట్లు సంస్థ సర్వేలో తేలింది. ప్రత్యామ్నాయ రుణపరపతితో యువ ఇన్వెస్టర్లు ఎక్కువ పెట్టుబడులు పెడుతున్నారు. పీర్‌టుపీర్ రుణపరపతివైపు కూడా వారు ఆసక్తితో ఉన్నారు.



# బ్లూ ఎనర్జీ మోటార్స్ 30 మిలియన్ డాలర్ల నిధుల సమీకరణ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** ఎల్‌ఎన్‌జిరవాణాచేసే భారీ ట్రక్కుల తయారీసంస్థ బ్లూఎనర్జీమోటార్స్ 30 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించింది. దీనితో ఈసంస్థ ఇప్పటివరకూ మొత్తం 50 మిలియన్ డాలర్లు సమీకరించినట్లయింది. ఇన్వెస్టర్ నిఖిల్‌కామత్, ఓమ్నిటెక్స్ ఇండస్ట్రీస్ కంపెనీకి ఇన్వెస్టర్లుగా మారారు. అంతేకాకుండా వ్యూహాత్మకంగా ఎస్సార్ ఎఫ్‌పిటి సంస్థలు మద్దతునిస్తున్నాయి. బిఇఎం తన ఉత్పత్తి సామర్థ్యాన్ని 10 వేల ట్రక్కులకు పెంచాలనినిర్ణఇంచింది. భారత రవాణా రంగంలో కీలక మార్పులుచేసేందుకునిర్ణయించింది. భారత రవాణారంగంలో ఇపుడు బిఇఎం ఎక్కువ వాటాతో ఉంది. విద్యుత్ ట్రక్కుల ఉత్పత్తివల్ల ఏటా 15శాతం కర్బన ఉద్గారాలను తగ్గించుకోగలమని విశ్వసిస్తోంది. భావితరం ఎల్‌ఎన్‌జి, విద్యుత్ హెవీడ్యూటీ ట్రక్కులు ఇపుడు రవాణారంగంలో కీలకంగాపనిచేస్తున్నాయి. కంపెనీ ఇప్పటివరకూ వెయ్యికిపైగా ఎల్‌ఎన్‌జి వాహనాలను విక్రయించింది. ఈ ట్రక్కులు సుమారు 60 మిలియన్ కిలోమీటర్ల దూరం వరకూ కవర్‌చేస్తాయి. కర్బన ఉద్గారాలను 15వేల టన్నులవరకూ తగ్గిస్తుందని కంపెనీ భరోసా ఇస్తోంది. ఇన్వెస్టర్ నిఖిల్‌కామత్ మాట్లాడుతూ భారత్‌లో రవాణారంగం స్వచ్ఛమైన, హరిత ఇంధనవనరులపైనే నడుస్తోందని, రానురాను మరింతపెరుగుతుందని బ్లూ ఎనర్జీ ఇందుకు మరింతగా ఉపయోగపడుతున్నదన్నారు. ఎస్సార్ డైరెక్టర్ అన్షుమన్ రూయా మాట్లాడుతూ కంపెనీ హెవీ డ్యూటీ ట్రక్కుల ట్రాన్స్‌పోర్టేషన్‌లో కర్బన ఉద్గారాల తగ్గింపులనకు బ్లూ ఎనర్జీ మోటార్స్ కృషి గణనీయంగా ఉందని అందుకే కంపెనీతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు.






Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.